Published from
Telangana and Andhra Pradesh

PRGI NO.TELTEL/2010/33275

ఎడిటర్- కలకొండ రామకృష్ణ

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily జాతీయ దినపత్రిక

Digital Editions : www.prajakalam.in., epaper.prajakalam.in , www.magzter.com, www.paperboy.com

ఆదివారం | 01-11- 2026 | సంపుటి: 17, సంచిక: 211, పేజీలు: 12, వెల: 3/-

ఆయన లేకుంటే నేటి భారత్‌ను ఊహించలేం





దేశాన్ని కాపాడిన దార్శనికుడు సర్దార్ పటేల్ : నరేంద్ర మోదీ

- పటేల్ జయంతి వేడుకల్లో ప్రధాని ప్రశంసలు

-దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవాలని పిలుపు

ఏక్తానగర్ (గుజరాత్) : స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశాన్ని ఒక్కటిగా నిలబెట్టడంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆయన లేకపోతే నేటి భారతదేశాన్ని ఊహించుకోవడం కూడా కష్టమేనని పేర్కొన్నారు. విభజన తర్వాత దేశంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల్లో పటేల్ చూపిన దూరదృష్టి వల్లే హిమాలయాల నుంచి హిందూ మహాసముద్రం వరకు దేశ భద్రతకు బలమైన పునాది పడిందని చెప్పారు. సర్దార్ పటేల్ జ యంతి సందర్భంగా గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో శనివారం నిర్వహించిన 'రాష్ట్రీయ ఏక్తా దివస్' వేడుకల్లో ప్రధాని ప్రసంగించారు.

దేశాన్ని ఒక్కటి చేసిన మహానేత

సర్దార్ పటేల్ భారతదేశాన్ని కేవలం భౌగోళికంగా ఏకం చేయలేదని, ప్రజల మధ్య భావోద్వేగ బంధాన్ని కూడా బలపరిచారని మోదీ కొనియాడారు. స్వాతంత్ర్యం తర్వాత దేశం ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించడంలో ఆయన నాయకత్వం ఎంతో కీలకమైందన్నారు.

తరువాయి 2వ పేజీలో...

సర్దార్ పటేల్ 151వ జయంతి

జాతీయ ఐక్యతా దివస్

సందర్భంగా ప్రముఖుల నివాళులు!



ఢిల్లీ, అక్టోబర్ 31: భారత ఉక్కు మనిషి , దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా అక్టోబర్ 31 దేశవ్యాప్తంగా 'జాతీయ ఐక్యతా దివస్' ఘనంగా జరుపుకుంటున్నారు. రాజధాని ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా పలువురు నాయకులు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తరువాయి 2వ పేజీలో...

అంగన్వాడీ కేంద్రంలో

పాము కలకలం

- నిర్లక్ష్య వైఖరిపై టీచర్‌కు మెమో



మల్లాపూర్,

అక్టోబర్ 31 (ప్రజాకలం ప్రతినిధి):

మండలంలోని రేగుంట గ్రామ అంగన్వాడీ కేంద్రంలోకి పాము చొరబడటంతో చిన్నారులు భయాందోళనకు గురైన ఘటనపై అధికారులు స్పందించారు. అంగన్వాడీ టీచర్ అందుబాటులో లేకపోవడంతో చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం ప్రజాకలం దినపత్రికలో ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా శనివారం అంగన్వాడీ టీచర్ పి. శోభారాణి సూపర్వైజర్ ప్రతిభను ఒక గంట అనుమతి కోరినప్పటికీ, ఆ తర్వాత విధులకు హాజరుకాకపోవడంతో పాటు అదే రోజు నిర్వహించిన సెక్టార్ సమావేశానికి కూడా గైర్హాజరైనట్లు గుర్తించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై చిట్టాపూర్ సెక్టార్ సూపర్వైజర్ సి. ప్రతిభ అక్టోబర్ 31న టీచర్‌కు మెమో జారీ చేశారు. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. పాము కలకలం ఘటనపై **ప్రజాకలం**లో వచ్చిన వార్తతో అధికారులు స్పందించి చర్యలు తీసుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

లక్ష మందితో

బీజేపీ భారీ ప్లాన్

- నవంబర్ 2న హైదరాబాద్‌లో భారీ ప్రదర్శన

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరు

బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి మొజాంజాహీ మార్కెట్ వరకు యాత్ర



హైదరాబాద్,

అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రాజకీయాల్లో మరో సారి వేడి రాజుకోనుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ భారీ రాజకీయ కార్యక్రమానికి సిద్ధమవుతోంది. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.. అరాచకాన్ని తరిమికొడదాం' అనే నినాదంతో నవంబరు 2న నిర్వహించనున్న మహా పాదయాత్రకు లక్ష మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తోంది.



జ్ఞానేశ్‌ను తప్పించే వరకు

పోరాటం ఆగదు..

- మాక్ పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ

ఢిల్లీ, అక్టోబర్ 31: కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై ఇండి కూటమి నేతలు ప్రజా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తప్పించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థపై దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. ఎన్నికల ప్రక్రియ 'సర్'లో జరిగిన అవకతవకల వెనుక జ్ఞానేశ్ కుమార్ ఒక్కరే కాదని, ఇంకా చాలామంది ఉన్నారని ఆరోపించారు. 'రాజ్యాంగాన్ని, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు పోరాడుతాం. సీఈసీపై అభిశంసనతో పాటు దేశద్రోహం కేసు కూడా పెట్టాలి. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా అగ్రస్థానంలో ఉన్నప్పటికీ.. వారి ఆదేశాలను అమలు చేస్తున్న వారే మా తొలి లక్ష్యం. పదవులు, సంస్థల రక్షణ వెనుక దాక్కుని ఎవరూ తప్పించుకోలేరు' అని రాహుల్ పేర్కొన్నారు.

ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారు..

ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు. 'ఎన్నికల సంఘం, సీబీఐ, ఈడీ వంటి సంస్థల దుర్వినియోగాన్ని సహించేది లేదు. వీటిపై ప్రజాస్వామ్య శక్తుల పోరాటం కొనసాగుతుంది. అలాగే జ్ఞానేశ్ కుమార్‌పై ఉన్న అన్ని అభియోగాలకూ మా వద్ద తగిన ఆధారాలు ఉన్నాయి.

తరువాయి 2వ పేజీలో...



తెలంగాణలో ఎలక్ట్రానిక్స్

పరిశ్రమలకు పెద్దపీట

- తయారీ రంగంలో 7.7 శాతం వృద్ధి

- రూ.200 కోట్లతో మివి నూతన తయారీ కేంద్రం

-ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

తుక్కుగూడ అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సాంకేతికత, ఆవిష్కరణలు, ఉత్పత్తి రంగాలను అనుసంధానిస్తూ సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ఈ-సిటీలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఆవిష్కరణ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మివి నూతన తయారీ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తయారీ రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ తయారీ రంగం 7.7 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని వెల్లడించారు.

తరువాయి 2వ పేజీలో...



బ్యాలెట్ ఎన్నికలకు సిద్ధం

- రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయండి

- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్

- ఎస్ఐఆర్ ప్రక్రియను ఆపే ప్రసక్తే లేదు.. ఎన్ఆర్‌సీ అమలు చేస్తాం

- కాంగ్రెస్ తీరుపై తీవ్ర విమర్శలు..


బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి

హైదరాబాద్, అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి)

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆందోళనలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. దొంగ ఓట్లు, మరణించిన వారి ఓట్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లను తొలగిస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తోందని ప్రశ్నించారు. ఈవీఎంలపై విమర్శలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. తెలంగాణలో బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, ఎస్ఐఆర్ ఇన్‌చార్జి బండారి శాంతికుమార్, రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, అధికార ప్రతినిధులు జె.సంగప్ప, సునీత తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్



తెలంగాణకు ఐదు రోజుల వర్ష సూచన

నవంబర్ 1 నుంచి 4 వరకు పలు జిల్లాల్లో వర్షాలు

రెండు జిల్లాలకు ఎల్లో అలర్ట్.. గంటకు 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు

బంగాళాఖాతంలో వాయుగుండం.. తుపానుగా బలపడే అవకాశం



హైదరాబాద్,

అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణలో రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నవంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముం దని హెచ్చరించింది.

తరువాయి 2వ పేజీలో...

వీడీసీ ఇసుక టెండర్లు..

ఎవరి అధికారం?

- గ్రామాల్లో సమాంతర పాలనకు తెరలేపుతున్న కమిటీలు!

- భూగర్భ జలాలపై ఆందోళన ఒకవైపు.. -ఇసుక వేలాలు మరోవైపు!

- మెట్‌పల్లి మండలంలో ఇసుక టెండర్ల వ్యవహారం హాట్‌టాపిక్..

అధికారుల పర్యవేక్షణ ఏదీ?



ఆయన లేకుంటే నేటి భారత్‌ను ఊహించలేం

మొదటి పేజీ తరువాయి...

నేడు మనం చూస్తున్న భారతదేశ నిర్మాణంలో పటేల్ కృషి మరువలేనిదని పేర్కొన్నారు.

భిన్నత్వమే మన బలం

భారతదేశంలోని భిన్నత్వాన్ని పటేల్ ఎప్పుడూ అడ్డంకిగా చూడలేదని ప్రధాని అన్నారు. దేశ సంస్కృతి, నాగరికత, ప్రజల జీవన విధానంపై ఆయనకు పూర్తి అవగాహన ఉండేదని చెప్పారు. విభిన్న భాషలు, సంప్రదాయాలు, ప్రాంతాలు ఉన్నప్పటికీ భారతీయులందరినీ కలిపి ఉంచేది ఐక్యతేనని వివరించారు. వేల ఏళ్లుగా ఇదే స్ఫూర్తితో భారతీయులు కలిసి జీవిస్తున్నారని, అభివృద్ధి వైపు సాగుతున్నారని తెలిపారు.

స్వాతంత్ర్యానికి దిశ చూపేది గణతంత్రం

స్వాతంత్ర్యం, గణతంత్రం, జాతీయ ఐక్యత మధ్య ఉన్న సంబంధాన్ని మోదీ వివరించారు. స్వాతంత్ర్యం దేశానికి తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే అవకాశం కల్పిస్తుందని, గణతంత్ర వ్యవస్థ ఆ స్వేచ్ఛకు సరైన దిశ చూపుతుందని చెప్పా రు. రాజ్యాంగం ప్రతి ఒక్కరినీ బాధ్యతా యుతంగా ఉండేలా చేస్తుందని, ఐక్యత దేశం ముందుకు సాగేందుకు బలాన్నిస్తుందని పేర్కొన్నారు. అందుకే స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవంతో పాటు జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని కూడా దేశమంతా ఉత్సాహంగా జరుపుకుంటుందని వివరించారు.

పటేల్ సేవలకు గుర్తుగా ఏక్తా దివస్

సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటారు. స్వాతంత్ర్యం తర్వాత దేశంలోని సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ ఈ రోజున దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రజలు దేశ సార్వభౌమత్వం, శాంతి, ఐక్యతను కాపాడేందుకు తమ వంతు కృషి చేయాలని ఈ వేడుకలు గుర్తుచేస్తాయి.

సర్దార్ పటేల్ 151వ జయంతి..

జాతీయ ఐక్యతా దివస్ సందర్భంగా ప్రముఖుల నివాళులు!

మొదటి పేజీ తరువాయి...

ఢిల్లీలో ప్రముఖుల అంజలి

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి: ఢిల్లీలో ఏర్పాటు చేసిన స్మారక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ పటేల్‌కు పుష్పాంజలి ఘటించారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధూ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తదితరులు పాల్గొని పటేల్ చేసిన సేవలను స్మరించుకున్నారు. మహారాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కూడా పటేల్ జయంతి సందర్భంగా ప్రత్యేక నివాళులర్పించారు.

ప్రధాని నరేంద్ర మోదీ సందేశం

ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. సర్దార్ పటేల్‌ను 'అఖండ భారత్ శిల్పి' అని కొనియాడారు. బలమైన, సమర్థవంతమైన, స్వయంసమృద్ధి కలిగిన భారతదేశ నిర్మాణానికి పటేల్ తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన త్యాగం వికసిత భారత్ నిర్మాణానికి ప్రేరణ అని పేర్కొన్నారు.

హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు

సర్దార్ పటేల్ ఆధునిక భారతదేశానికి పునాది వేసిన శిల్పి అని కొనియాడారు. సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఒక్కటిగా నిర్మించడంలో ఆయన చూపిన ధైర్యం, సుదూర ఆలోచన చరిత్రాత్మకమైనవని పేర్కొన్నారు. ఆల్ ఇండియా సర్వీసెస్ ను ఏర్పాటు చేసి దేశ పాలనా వ్యవస్థకు బలమైన ఆధారాన్ని అందించారని, ఖేడా, బార్డోలీ సత్యాగ్రహాల ద్వారా రైతుల హక్కుల కోసం పోరాడారని అమిత్ షా గుర్తుచేశారు.



జ్ఞానేశ్‌ను తప్పించే వరకు పోరాటం ఆగదు

మొదటి పేజీ తరువాయి...

ఆయన సీఈసీగా కొనసాగలేరు. అయినప్పటికీ బీజేపీ జ్ఞానేశ్‌ను పదవిలో కొనసాగిస్తే ఆ పార్టీ ఉద్దేశం ఏమిటో అందరికీ స్పష్టమవుతుంది' అని లోక్‌సభ ప్రతిపక్ష నేత వెల్లడించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడే రాజకీయ ఆయుధమిది..

అనంతరం రాహుల్ మాక్ పార్లమెంట్ కార్యక్రమం గురించి వివరిస్తూ.. ఈ కార్యక్రమం కేవలం ఎంపీలు, సామాన్య పౌరుల సమావేశం కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే రాజకీయ ఆయుధమిదని అన్నారు. 'దేశవ్యాప్తంగా 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారు. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం ఓటర్లలో 15 శాతం మందికి ఓటు హక్కు లేకుండా చేశారు. ప్రతి ఏడుగురు భారతీయుల్లో ఒకరు ఓటు హక్కు కోల్పోయారు. ఓటర్ల హక్కులను హరించిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు ప్రజాప్రతినిధులకు సమాధానం చెప్పుకోవాల్సిందే' అని రాహుల్ గాంధీ తెలిపారు.

బ్యాలెట్ ఎన్నికలకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి...

అనర్హుల ఓట్ల తొలగింపునకు అభ్యంతరమెందుకు?

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతోపాటు అనర్హులు, మరణించినవారు, అక్రమ వలసదారుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ ప్రక్రియ లక్ష్యమని బండి సంజయ్ పేర్కొన్నారు. 1952 నుంచి 2025 వరకు దేశంలో 12 సార్లు ఈ ప్రక్రియ చేపట్టగా, అందులో పదిసార్లు కాంగ్రెస్ పాలనలోనే జరిగిందని గుర్తుచేశారు. అప్పట్లో అభ్యంతరం చెప్పని కాంగ్రెస్ ఇప్పుడు ఎందుకు ఆందోళనలు చేస్తోందని ప్రశ్నించారు.

దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించారంటూ కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని, అయితే అవి తుది తొలగింపులు కావని, ముసాయిదా జాబితాలోని వివరాలేనని అన్నారు. ఇందులో 2.8 కోట్ల మంది మరణించిన ఓటర్లు, కోటి మందికి పైగా ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదైన ఓటర్లు ఉన్నారని తెలిపారు. మరో 6.30 కోట్ల మంది శాశ్వతంగా వలస వెళ్లినట్లు వివరించారు. వీరి వివరాలను గుర్తించి జాబితాలను సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఓటరు జాబితా నుంచి పేరు తొలగించినా తగిన ఆధారాలు సమర్పించి తిరిగి నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

ఓటములకు ఎస్ఐఆర్ కారణమా?

కాంగ్రెస్ పార్టీ వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారీ ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడం పరిపాటిగా మారిందని బండి సంజయ్ విమర్శించారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ చాలా కాలంగా అధికారానికి దూరంగా ఉందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కాకముందే పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ బలహీనపడిందని వ్యాఖ్యానించారు.

కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన విషయాన్ని ప్రస్తావించారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని పేర్కొంటూ, ఓటములకు ఎన్నికల విధానాలను కారణంగా చూపడం సరికాదన్నారు.

కాంగ్రెస్ ఆందోళనలపై ప్రశ్నలు

విదేశీ నిధులతో నడుస్తున్న సంస్థలు, దేశంలో అల్లర్లు సృష్టించాలని ప్రయత్నిస్తున్న శక్తులతో కాంగ్రెస్ కలిసి ఆందోళనలు చేయడం ఏమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. బంగ్లాదేశ్ తరహా పరిస్థితులు భారత్‌లోనూ రావాలని కోరుకునే వ్యక్తులతో కలిసి నిరసనలు చేపట్టడంపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విదేశీ నిధులు, అక్రమ వలసదారుల అంశాలపై ఆయన పలు ఆరోపణలు చేశారు. అయితే వాటికి సంబంధించిన ఆధారాలను కాంగ్రెస్ ముందు ఉంచాలని సవాల్ విసిరారు.

ఎన్ఆర్సీ, మహిళా బిల్లుపై ప్రకటన

ఎస్ఐఆర్ ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేసే ప్రసక్తి లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎన్ఆర్సీని తీసుకొస్తామని, మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదిస్తామని, డీలిమిటేషన్ ప్రక్రియను కూడా ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశాభివృద్ధి, భద్రతకు ప్రాధాన్యమిస్తూ పనిచేస్తోందన్నారు.

రాష్ట్ర సమస్యలను పట్టించుకోవాలి

తెలంగాణలో కేవలం 365 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించడంపై బండి సంజయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మరికొన్ని ప్రాంతాల్లోనూ వర్షాభావం, సాగునీటి కొరతతో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. విద్యుత్ కోతలు, తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు, రైతుల సమస్యలు, ప్రజలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.

ఎస్ఐఆర్‌పై బుక్‌లెట్ విడుదల

ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారానికి సమాధానంగా బీజేపీ తరఫున ప్రత్యేక బుక్‌లెట్‌ను రూపొందించినట్లు బండి సంజయ్ తెలిపారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం.. అరాచకాన్ని తరిమికొడదాం' అనే పేరుతో రూపొందించిన ఈ పుస్తకాన్ని ప్రజలకు అందజేస్తామని చెప్పారు. ఈ అంశంపై వాస్తవాలను తెలుసుకుని స్పందించాలని మేధావులు, జర్నలిస్టులు, విద్యావేత్తలకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకొస్తే ఎన్నికలకు సిద్ధం కావాలని మరోసారి సవాల్ విసిరారు.

పటేల్ స్ఫూర్తితో దేశ సమగ్రతకు పునరంకితం కావాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

- పటేల్‌కు వ్యతిరేకంగా.. నెహ్రూకు అనుకూలంగా తొలి ఓటు చోరీ: కిషన్‌రెడ్డి

- బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు



హైదరాబాద్, అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి)

భారత ఉక్కు మనిషి, అఖండ భారత నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పాల్గొని పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. దేశ సమగ్రత, సార్వభౌమాధికార పరిరక్షణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబించేలా వందలాది సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి ఆధునిక భారత నిర్మాణానికి పటిష్ఠమైన పునాది వేశారని పేర్కొన్నారు. పటేల్ చూపిన జాతీయ సమైక్యతా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశ సమగ్రత కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

దశాబ్దాల పాటు కాంగ్రెస్ పాలకులు పటేల్ సేవలను మరుగునపరిచే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఐక్యతా విగ్రహాన్ని నిర్మించడంతో పాటు దేశవ్యాప్తంగా రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను అధికారికంగా నిర్వహిస్తూ పటేల్ సేవలను భావితరాలకు చాటుతున్నారని అన్నారు.

పటేల్‌కు అన్యాయం చేశారు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో కాంగ్రెస్‌లోని మెజారిటీ సభ్యులు సర్దార్ వల్లభాయ్ పటేల్ తొలి ప్రధానమంత్రి కావాలని మద్దతు ప్రకటించారని గుర్తుచేశారు. అయినప్పటికీ అంతర్గత రాజకీయాల కారణంగా పటేల్‌కు అవకాశం దక్కకుండా చేసి, ప్రజా మద్దతు విషయంలో వెనుకబడ్డ నెహ్రూను ప్రధానమంత్రి పీఠంపై కూర్చోబెట్టారని ఆరోపించారు. స్వాతంత్ర్యం అనంతరం జరిగిన తొలి ఓటు చోరీ పటేల్‌కు వ్యతిరేకంగా, నెహ్రూకు అనుకూలంగా జరిగిందని వ్యాఖ్యానించారు.

ఆనాడే పటేల్ ప్రధానమంత్రి అయి ఉంటే దేశ చరిత్ర, రూపురేఖలు మరోలా ఉండేవని అభిప్రాయపడ్డారు. నెహ్రూ రాజకీయ విధానాలు, లోపాయికారీ ఒప్పందాల కారణంగా సంస్థానాల విలీన ప్రక్రియలో అనేక సమస్యలు తలెత్తాయని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో కొనసాగిన ఓటు బ్యాంకు రాజకీయాలు, బుజ్జగింపు విధానాలు, అవినీతి, కుటుంబ పాలన గురించి నేటి యువత తెలుసుకోవాలని సూచించారు. దేశభక్తి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన పటేల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతంరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కర్ణాటక సహ ఇన్‌ఛార్జి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌ఛార్జి ఎన్.వి. సుభాష్, అధికార ప్రతినిధి రాహుల్ సరిదెన, సీనియర్ నాయకులు చింతల రామచంద్రారెడ్డి తదితరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణలో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు పెద్దపీట

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్ర పారిశ్రామిక స్థూల విలువ జోడింపులో తయారీ రంగం వాటా రూ.1.37 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు.

2047 లక్ష్యంగా పారిశ్రామిక ప్రగతి

తెలంగాణ రైజింగ్--2047 దార్శనికతలో భాగంగా ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లు, హార్డ్‌వేర్ పార్కులను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. చిప్ రూపకల్పన, సెమీకండక్టర్ తయారీ, ఎలక్ట్రానిక్ విడిభాగాల ఉత్పత్తిలోనూ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు.

పరిశోధన, ఉత్పత్తుల రూపకల్పన నుంచి విడిభాగాలు, తుది ఉత్పత్తుల తయారీ వరకు అన్ని కార్యకలాపాలు తెలంగాణలోనే జరిగేలా పారిశ్రామిక సంస్థలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ సరఫరా వ్యవస్థతో అనుసంధానించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

యువతకు ఉపాధి అవకాశాలు

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. తయారీ రంగం విస్తరణతో రాష్ట్రంలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌కు చెందిన మివి సంస్థ ఇప్పటికే ఇయర్‌బడ్స్, హెడ్‌ఫోన్లు, స్పీకర్లు, సౌండ్‌బార్లు వంటి ఆడియో ఉత్పత్తులను తయారు చేస్తోందని వివరించారు. తాజాగా మివి వన్ 5జీ స్మార్ట్‌ఫోన్‌తో మొబైల్ తయారీ రంగంలోకి కూడా ప్రవేశించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ శశాంక్, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మివి ప్రతినిధులు విశ్వనాథ్ కందుల, మిధుల దేవభక్తుని తదితరులు పాల్గొన్నారు.



లక్ష మందితో బీజేపీ భారీ ప్లాన్

మొదటి పేజీ తరువాయి...

ఈ కార్యక్రమ ఏర్పాట్లపై రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డితో పాటు పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అమిత్ షాకు ఘన స్వాగతం పలకడంతో పాటు పాదయాత్రను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు పాల్గొనేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని నాయకులకు సూచించారు.

బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రారంభం

నవంబరు 2న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ వద్ద ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి మహా పాదయాత్ర ప్రారంభం కానుంది. అక్కడి నుంచి మొజాంజాహీ మార్కెట్ చౌరస్తా వరకు కొనసాగుతుంది. అనంతరం అక్కడ నిర్వహించే బహిరంగ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగించనున్నారు. పార్టీ కార్యకర్తలతో పాటు న్యాయవాదులు, వైద్యులు, మేధావులు, వివిధ వృత్తులకు చెందిన ప్రముఖులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని బీజేపీ నాయకత్వం భావిస్తోంది.

కాంగ్రెస్ తీరుపై కమలనాథుల విమర్శలు

రాజ్యాంగబద్ధమైన సంస్థలపై కాంగ్రెస్ పార్టీ దాడులకు పాల్పడుతోందని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని రాంచందర్‌రావు ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. ఈ అంశంపై ప్రజలకు వాస్తవాలను వివరించడంతో పాటు కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టడమే పాదయాత్ర ప్రధాన ఉద్దేశమని పార్టీ నేతలు పేర్కొన్నారు.

రాజకీయంగా ప్రాధాన్యం

నవంబరు 1న ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఓటు చోరీకి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించనుండగా.. మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ మహా పాదయాత్రకు సిద్ధమవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఇప్పటికే ఇరు పార్టీల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. అమిత్ షా పర్యటన, భారీ జనసమీకరణ ద్వారా తెలంగాణలో తమ రాజకీయ బలాన్ని చాటుకోవాలని బీజేపీ నాయకత్వం వ్యూహరచన చేస్తోంది. ఈ నేపథ్యంలో నవంబరు 2న జరిగే పాదయాత్ర, బహిరంగ సభ రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

తెలంగాణకు ఐదు రోజుల వర్ష సూచన

మొదటి పేజీ తరువాయి...

రెండు జిల్లాలకు ఎల్లో అలర్ట్..

నవంబర్ 2న ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ రెండు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈదురుగాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. నవంబర్ 3న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో మరోసారి ఎల్లో అలర్ట్ ప్రకటించింది. నవంబర్ 4న రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

తుపానుగా బలపడే అవకాశం..

ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న అండమాన్ సముద్ర ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రానున్న ఆరు గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. తదుపరి 24 గంటల్లో తుపానుగా మారే అవకాశముందని అంచనా వేసింది.

హైదరాబాద్‌లో భారీ వర్షం.. ట్రాఫిక్ ఇక్కట్లు

మరోవైపు శుక్రవారం హైదరాబాద్‌లో కురిసిన ఆకస్మిక వర్షం నగరవాసులను ఇబ్బందులకు గురిచేసింది. పలు ప్రాంతాల్లో దాదాపు మూడు గంటల పాటు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులపై నీరు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్, బేగంపేట, అమీర్‌పేట, గచ్చిబౌలి, మాదాపూర్, మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు మందగించాయి.

ఆంధ్రప్రదేశ్‌పై తుపాను ప్రభావంతో తెలంగాణలో తేమ శాతం పెరిగిందని, ఫలితంగా పలు ప్రాంతాల్లో ఆకస్మిక వర్షాలు కురిశాయని వాతావరణ అధికారులు వివరించారు. పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదు..

శుక్రవారం కురిసిన వర్షాలకు యాదాద్రి భువనగిరి జిల్లాలోని వలిగొండలో అత్యధికంగా 11.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కీసరలో 11.2, నార్కట్‌పల్లిలో 8.9, భువనగిరిలో 8.4, హైదరాబాద్‌లోని బహదూర్‌పురాలో 8.2, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 7.6, శేరిలింగంపల్లిలో 7.3, షేక్‌పేటలో 6.6, చార్మినార్‌లో 6.3, కూకట్‌పల్లిలో 6.2, ఖైరతాబాద్‌లో 6 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

వర్ష సూచన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులు వీచే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరం లేనప్పుడు బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు.

అద్భుత పనితీరుతో దూసుకువెళ్తున్న 'మీ సేవా'

హైదరాబాద్, అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ ప్రజలకు డిజిటల్ ప్రభుత్వ సేవలను మరింత దగ్గర చేస్తూ మీ సేవా కేంద్రాల్లో సెప్టెంబర్-2026 నెలలో అద్భుతమైన పనితీరు నమోదైంది.



వీటి ద్వారా మొత్తం 24,61,661 లావాదేవీలు విజయవంతంగా ప్రాసెస్ చేయబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా గత ఒక్క నెలలో రూ. 585.05 కోట్ల మొత్తంతో లావాదేవీలు జరిగాయి. రాష్ట్రం మొత్తం మీద 5,276 యాక్టివ్ మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు 393 విభిన్న రకాల సేవలు అందుబాటులో ఉండగా, కొత్తగా మరో 2 సేవలు జతచేయబడ్డాయి. ఇది పౌరులకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేసింది.



నిమ్స్‌లో ఘనంగా ఉద్యోగుల పదవీ విరమణ వేడుకలు

ముగ్గురు ఉద్యోగులకు ఘన సత్కారం

ఆసుపత్రికి అందించిన సేవలను కొనియాడిన డీన్ చంద్రశేఖర్

హైదరాబాద్, అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి)


నిమ్స్ ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ విశేష సేవలందించిన ముగ్గురు ఉద్యోగులు శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అత్యవసర విభాగం భవనంలోని ట్రామా ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి డీన్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్ పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వారు అందించిన సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. పదవీ విరమణ పొందిన వారిలో కార్యాలయ సూపరింటెండెంట్ ఎ. ఉష, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు (గ్రేడ్-1) టి. విష్ణుమోహన్, కె. విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు. విధి నిర్వహణలో వారు చూపిన అంకితభావం, సేవలను ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ కంట్రోలర్ విజయ్‌కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ సుజాత, హెచ్‌ఆర్ సూపరింటెండెంట్ ఉమ, ఆర్థిక విభాగం ఇన్‌ఛార్జి రాధిక, మీడియా సంబంధాల అధికారి సత్యగౌడ్, అలైడ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శేఖర్, కేజియా తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రి సిబ్బంది, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ కార్డుక పైసా వసూలు

-రెడ్లరేపాక రేషన్ డీలర్ వసూళ్ల పర్వం

వలిగొండ అక్టోబర్ 31 ప్రజాకలం:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన రేషన్ కార్డులు పంపిణీ చేపట్టగా,ప్రభుత్వం ఉచితంగా అందించే కార్డులకు లబ్ధిదారుల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకూడదని,పౌరసరఫరాల శాఖ స్పష్టమైన నిబంధనలు విధించింది.రేషన్ కార్డులకు డబ్బులు (పైసా వసూల్) వసూలు చేయడం పూర్తిగా చట్టవిరుద్ధం.ఒకవేళ రేషన్ డీలర్లు అక్రమంగా డబ్బులు వసూలు చేసినా,తూకంలో మోసాలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ చేపట్టగా వలిగొండ మండలంలోని రెడ్లరేపాకలో రేషన్ డీలర్ లబ్ధిదారుల నుండి 20 రూపాయలు,వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.హైదరాబాదులో ఉంటున్న లబ్ధిదారులకు రేషన్ కార్డుకు వంద రూపాయలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.సంబంధిత అధికారులు విచారించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



రచనలు పంపండి



ప్రజాకలం 'అభిప్రాయం' పేజీకి సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసా లను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్‌కు పంపించాలని మనవి.

prajakalam2010@gmail.com
website : www.prajakalam.com
Editor : +919010972526
Office : 1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, Hyd.

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న గవర్నర్

- గవర్నర్ పర్యటన సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

యాదాద్రి అక్టోబర్ 31 ప్రజాకలం:యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా ఆలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న గవర్నర్ గారికి ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.ముందుగా గవర్నర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలోని వేద పాఠశాలను సందర్శించి, అక్కడ నిర్వహించిన 26వ వేద విద్వన్మహాసభల్లో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భోజనం స్వీకరించి తిరుగు ప్రయాణమయ్యారు.గవర్నర్ పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ప్రోటోకాల్ నిబంధనలకు అనుగుణంగా పర్యటన ప్రారంభం నుంచి ముగిసే వరకు పటిష్టమైన పోలీసు బందోబస్తు,భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు,సిబ్బందికి తగిన సూచనలు చేస్తూ బందోబస్తు నిర్వహించారు.ఈ పర్యటనలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు,ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఆలయ ఈఓ భవానీ శంకర్,అదనపు ఎస్పీ లక్ష్మినారాయణ,వినోద్ కుమార్ డీఎస్పీలు శ్రీనివాస్ నాయుడు,సురేష్,ప్రసాద్ , సీఐలు,ఆర్ఐలు,ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రామంతాపూర్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ షెడ్డు తొలగింపు

హైడ్రా చర్యలతో స్థానికుల హర్షం

చెరువు పరిసరాల్లో ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ ఫిర్యాదులు

ఉప్పల్ అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి)

చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారించిన హైడ్రా మరో చర్య చేపట్టింది. ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని రామంతాపూర్ పెద్ద చెరువు పూర్తి స్థాయి నీటిమట్టం పరిధిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డును శనివారం తొలగించింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని సుమారు 400 గజాల ఖాళీ స్థలంలో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు



చేసి సిట్టింగ్ బార్ నిర్వహిస్తున్నట్లు స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అక్కడికి వచ్చే కొందరు బహిరంగంగా మద్యం సేవిస్తూ దారిన వెళ్లేవారికి ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు కట్టపై కూర్చొని మద్యం సేవించిన అనంతరం ఖాళీ సీసాలను చెరువులోకి విసిరేస్తున్నారని, దీంతో జలవనరులు కలుషితమవుతున్నాయని స్థానికులు ఫిర్యాదులో పేర్కొన్నారు. షెడ్డు నిర్మాణానికి ఎలాంటి అనుమతులు కూడా లేవని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానికుల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న హైడ్రా అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్డును తొలగించారు. ఇప్పటికే పునరుద్ధరించి సుందరంగా తీర్చిదిద్దిన రామంతాపూర్ పెద్ద చెరువు పరిసరాల్లో మళ్లీ ఇలాంటి కార్యకలాపాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. హైడ్రా చర్యపై హర్షం వ్యక్తం చేశారు.

గిన్నిస్ రికార్డులో మక్త అనంతారం వాసి

- తైక్వాండోలో శర్వాణి ప్రతిభ..

మాజీ స్పీకర్ చేతుల మీదుగా ధ్రువపత్రం ప్రదానం

-శర్వాణి ఘనతపై గ్రామస్థుల హర్షం

బీబీనగర్, అక్టోబర్ 31 (ప్రజాకలం): మండలంలోని మక్త అనంతారం గ్రామానికి చెందిన బింగి శర్వాణి తైక్వాండో క్రీడలో అరుదైన గుర్తింపు సాధించింది. ప్రపంచంలోనే అతిపెద్ద తైక్వాండో పాఠంలో పాల్గొని గిన్నిస్ ప్రపంచ రికార్డులో భాగస్వామిగా నిలిచింది. గ్రామీణ ప్రాంతం నుంచి



అంతర్జాతీయ స్థాయి రికార్డు కార్యక్రమంలో పాల్గొని గుర్తింపు పొందడం విశేషంగా నిలిచింది. ఈ ఏడాది ఆగస్టు 9న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ప్రపంచంలోనే అతిపెద్ద తైక్వాండో పాఠంలో మొత్తం 533 మంది పాల్గొన్నారు. ఇందులో బింగి శర్వాణి కూడా పాల్గొంది. ఈ ఘనతకు సంబంధించిన గిన్నిస్ ప్రపంచ రికార్డు ధ్రువపత్రాన్ని శుక్రవారం (అక్టోబరు 30) హైదరాబాద్‌లోని నుంరవరం వ్రతావరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ శాసనసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి చేతుల మీదుగా శర్వాణి ధ్రువపత్రాన్ని అందుకుంది. గ్రామానికి చెందిన బింగి ఐలయ్య యాదవ్, మహేశ్వరి దంపతుల కుమార్తె అయిన శర్వాణి సాధించిన ఈ ఘనతపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తైక్వాండో గ్రాండ్ మాస్టర్ జయంత్‌రెడ్డి, కె.పి. హనుమంతు, మాస్టర్ గ్యార నాగరాజు అందించిన శిక్షణ, ప్రోత్సాహంతో ఈ గుర్తింపు సాధించింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రీడా ప్రతిభకు కొదవలేదని శర్వాణి విజయం చాటిచెప్పింది. కార్యక్రమంలో పలువురు తైక్వాండో ప్రతినిధులు పాల్గొన్నారు.

వివక్ష లేని సమసమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

- పౌర హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- తహశీల్దార్ దశరథ

వలిగొండ అక్టోబర్ 31 ప్రజాకలం:వివక్ష లేని సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని తహసీల్దారు దశరథ నాయక్,జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సురుపంగ శివలింగం అన్నారు.శనివారం మండల పరిధిలోని దాసిరెడ్డిగూడెం గ్రామంలో సర్పంచ్ రాపోలు గోపి అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దారు దశరథ నాయక్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని, తద్వారా వారి భవిష్యత్ గొప్పగా తయారు అవుతుందన్నారు.కుల వివక్ష లేకుండా అందరూ కలిసిమెలసి ఉండాలని,ఎవరైనా వివక్ష చూపిస్తే చట్టపరమైన చర్యలకు గురైతారని అన్నారు.జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సురుపంగ శివలింగం మాట్లాడుతూ వివక్ష లేని సమసమాజ నిర్మాణానికి అందరూ కలిసి రావాలని అన్నారు.ఇటీవల వినాయక నిమజ్జనం,బతుకమ్మ పండగల్లో కూడా మన జిల్లాలో కుల దురహంకార వివక్ష, దాడులు జరిగాయని వీటిని అరికట్టడంలో యంత్రాంగం పూర్తిగా కృషి చేయాలన్నారు.దళిత గిరిజన,బీసీ విద్యార్థులు విదేశాలలో ఉన్నత చదువులు చదవడం కోసం ప్రభుత్వం ఇరవై లక్షల ఆర్థిక సహాయం చేస్తుందని,అలాగే బెస్ట్ అవైలబుల్ స్కూల్ మరియు స్కాలర్షిప్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు దుబ్బ లింగం మాట్లాడుతూ దళితుల పట్ల వివక్ష చూపేవారిపట్ల వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,కేసు నమోదు చేసి ఊరుకోకుండా నిందితులను అరెస్ట్ చేయాలని,సమానత్వాన్ని సాధించేందుకు కులాలకు అతీతంగా అందరూ కలిసిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శంకర్,ఉప సర్పంచ్ రావుల ధనమ్మా పద్మారెడ్డి,రెవిన్యూ ఇన్స్పెక్టర్ నాగేష్,పంచాయతీ సెక్రటరీ అపర్ణ,గ్రామ రెవిన్యూ అధికారి కొమ్ము అండాలు,పాలకవర్గ సభ్యులు కమ్యూనిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రామునిగుండ్ల తండాలో ఎల్‌నినో ప్రభావంపై అవగాహన

నీటి పొదుపుపై ప్రత్యేక సూచనలు.. రైతులు అప్రమత్తంగా ఉండాలి



బీబీనగర్, అక్టోబర్ 31 (ప్రజాకలం): మండలంలోని రామునిగుండ్ల తండా గ్రామపంచాయతీ పరిధిలో ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులపై గ్రామస్థులకు అధికారులు అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం, నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలున్నాయని వివరించారు. వ్యవసాయంపై వీటి ప్రభావం పడకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు గోపీ నాయక్ మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పనులు చేపట్టాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో శ్రీలత, ఉపసర్పంచ్ శ్రావణి-శ్రీనివాస్, వార్డు సభ్యులు పచ్య నాయక్, రవి నాయక్, సుధాకర్ నాయక్, జగ్గు నాయక్, వివిధ శాఖల అధికారులు, ఐదు తండాల పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



బీబీనగర్, అక్టోబర్ 31 (ప్రజాకలం): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున గ్రామస్థులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని బీబీనగర్ గ్రామ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభ లో వాతావరణ మార్పులు, వ్యవసాయంపై వాటి ప్రభావం, నీటి సంరక్షణ తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల కారణంగా వ్యవసాయ రంగంపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. వర్షాలు సకాలంలో కురవకపోతే రైతులతో పాటు సామాన్య ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో శ్రీలత, ఉపసర్పంచ్,వార్డు సభ్యులు, సెక్రటరీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు

2027 వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన శివ ప్రతాప్ శుక్ల

యాదగిరిగుట్ట, అక్టోబరు 31 (ప్రజాకలం):

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల దంపతులు శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీ జనార్దనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి యాదగిరిగుట్ట దేవస్థానంలో నిర్వహిస్తున్న తెలంగాణ వేద విద్వన్మహాసభలకు గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట కొండపై ఉన్న అతిథిగృహానికి చేరుకున్న గవర్నర్‌కు రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, ఆయన సతీమణి జానకి శుక్లా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో గవర్నర్ దంపతులకు వేదాశీర్వచనం అందించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపికతో పాటు ప్రసాదాలను గవర్నర్‌కు అందజేశారు. అనంతరం దేవస్థానం రూపొందించిన 2027 నూతన వార్షిక క్యాలెండర్‌ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వేదాలు భారతీయ సంస్కృతికి ప్రాణం- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

- యాదగిరిగుట్టలో 26వ తెలంగాణ వేద విద్వన్మహాసభల్లో గవర్నర్ సందేశం

- వేద పరిరక్షణలో గురు-శిష్య పరంపర సేవలు అమూల్యం - వేద విద్యార్థులు, పండితులకు గవర్నర్ అభినందనలు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 31 (ప్రజా కలం)

వేద జ్ఞానమే భారతీయ నాగరికత,సంస్కృతులకు మూలాధారమని,వేదాలు కేవలం ఆధ్యాత్మిక చింతనకే పరిమితం కాకుండా ప్రకృతి పరిరక్షణ,మానవ జీవనం, నైతిక విలువలు, సామాజిక సామరస్యానికి మార్గదర్శకాలని తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం,తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో నిర్వహించిన 26వ తెలంగాణ వేద విద్వన్మహాసభల్లో శనివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తరతరాలుగా వేదాలను పరిరక్షిస్తూ వస్తున్న గురు-శిష్య పరంపర భారతీయ సంస్కృతిలో అత్యంత విశిష్టమైనదని కొనియాడారు. ఆచార్యులు తమ నిరంతర సాధన, అంకితభావంతో వేదాల శుద్ధ ఉచ్చారణ, స్వర,పాఠ సంప్రదాయాలను పరిరక్షిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. ఈ మహాసభల్లో భాగంగా నిర్వహిస్తున్న వేద పరీక్షల్లో పాల్గొంటున్న 500 మందికి పైగా విద్యార్థులకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. వారి కృషి,క్రమశిక్షణ భారతీయ సాంస్కృతిక వారసత్వం ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. జయపత్రాలు



అందుకున్న 10 మంది వేద విద్వాంసులను ప్రత్యేకంగా అభినందించారు. యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం వేద అధ్యయనం,ఆధ్యాత్మిక సాధన, సాంస్కృతిక చైతన్యానికి ప్రముఖ కేంద్రంగా ఎదిగేందుకు అపార అవకాశాలు ఉన్నాయని గవర్నర్ పేర్కొన్నారు.ప్రాచీన భారతీయ జ్ఞాన సంపదకు, ఆధునిక విజ్ఞానానికి మధ్య సార్థకమైన అనుసంధానం అవసరమని అన్నారు.వేద విద్యా సంస్థలు,విద్వత్ సభలు, గురుకులాలకు మరింత ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ...గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఈ వేద పాఠశాలకు రావడం వేద విద్యార్థులకు ఒక నిదర్శనం అని విద్యార్థులందరూ గవర్నర్ ను నిదర్శనంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సుదీర్ఘంగా చాలా సంవత్సరాలు మన వేద సంస్కృతిని అహర్నిశలు ప్రతి సందర్భం,ప్రతి సమయంలో ముందుకు తీసుకెళ్తూ..గత 20 సంవత్సరాల నుంచి వేదాన్ని గురించి, వేదానికి ఉన్న మహోన్నత్యం గురించి,వేదం చదువుకోవాలనే ఒక పెద్ద సంకల్పంతో ముందుకు నడిపిస్తున్న ప్రముఖులు శ్రీ సాయినాథ్ శర్మ ఆశీస్సులు అందరికీ ఉండాలన్నారు.వేద విద్వన్మహా సభలు నిర్వహిస్తున్న తరుణంలో వేద సభలకు సంబంధించిన పరీక్షలు వ్రాస్తున విద్యార్థుల సంఖ్య మెరుగుపర్చాలన్నారు.ఈ వేద విద్యను పెంపొందించడానికి మన పిల్లల్లో ఒకళ్ళని వేద విద్యను నేర్చుకోవాలని వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు కూడా హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. చాలామంది వేద విద్యకు సంబంధించిన విద్యార్థులతో పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్లాలని, ఈ ప్రాంగణంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి తాను ప్రోత్సహం చేస్తానని తెలిపారు.ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ...వేదాన్ని పఠిస్తూ తెలంగాణ సాంప్రదాయం తో భారతదేశ సంస్కృతికి మూలం వేద విద్య అని అన్నారు.వేద విద్య జ్ఞానాన్ని పెంపొందిస్తూ శక్తి ఏకాగ్రత పెంపొందిస్తుందన్నారు.ఋగ్వేదం,సామవేదం,వివిధ వేదాలలో పరీక్షలో ప్రతిభ కనబరచిన వేద విద్యార్థులకు గవర్నర్ శాలువ, మెమెంటో లతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐ.టి మంత్రి డి. శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య,శ్రీ జనార్దనా సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ చైర్మన్ సాయినాథ్ శర్మ,గవర్నర్ స్పెషల్ సిఎస్ దాన కిషోర్, ధార్మిక సలహాదారు ఆర్.గోవింద్ హరి,దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,ఎస్పీ అక్షాంష్ యాదవ్,దేవస్థానం కార్య నిర్వహణాధికారి, జె.భవానీ శంకర్,పూజ్య ఆచార్యులు,వేద పండితులు, ప్రజా ప్రతినిధులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాలచెలిమి కథల పోటీల్లో కుకునూరు విద్యార్థినికి జాతీయ బహుమతి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 31:

బాలచెలిమి పత్రిక ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీల్లో వేల్పూర్ మండలంలోని కుకునూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ చాటింది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ర్యాడ శ్రీ అని రాసిన “కలిసి ఉంటే కలదు సుఖం” అనే కథ జాతీయ స్థాయి బహుమతికి ఎంపికైనట్లు పోటీల నిర్వాహకులు డాక్టర్ వేద కుమార్, గరిపెల్లి అశోక్ శనివారం ఒక ప్రకటనలో అధికారికంగా తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 252 కథలు రాగా, శ్రీ అని రాసిన కథ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ పురస్కారానికి ఎంపికైందని వారు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో బహుమతి సాధించి పాఠశాలకు, జిల్లాకు పేరు తెచ్చిన విద్యార్థినిని పలువురు అభినందించారు.



ర్యాడ శ్రీ అని , 9వ తరగతి

తెలుగు ఉపాధ్యాయునికి అభినందనలు

మారుమూల గ్రామానికి చెందిన పాఠశాల విద్యార్థుల్లో సాహిత్య సృజనను పెంపొందిస్తూ కథ, కవిత, లేఖ, పద్యం, సంభాషణ వంటి వివిధ ప్రక్రియల్లో రచనలు చేసేలా నిరంతరం ప్రోత్సహిస్తున్న పాఠశాల తెలుగు భాషోపాధ్యాయుడు డాక్టర్ పతాని గంగాధర్‌ను ప్రధానోపాధ్యాయులు టీ. హరిచరణ్, తోటి ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్ రావు, మల్కన్నా, చరణ్ దాస్, నాగరాజు, రవీందర్, హరిత, భారతి, అశోక్, సిబ్బంది గంగమ్మ మరియు విద్యార్థులు పాల్గొని విజేతకు శుభాకాంక్షలు తెలిపారు.

బుద్ధుని బోధనలే మానవాళికి మార్గదర్శకాలు: బంతే సత్య బోధి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 31:

అక్టోబర్ పూర్ణిమ సందర్భంగా బౌద్ధ భిక్షువుల వర్షావాస ముగింపు కార్యక్రమం



నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన బౌద్ధ భిక్షువు బంతే సత్య బోధి ధమ్మ ప్రవచనం చేశారు. తథాగత బుద్ధుడు సంపూర్ణ జ్ఞానోదయం అనంతరం మానవ జీవితంలోని పంచస్కంధాల స్వభావాన్ని వివరించారని ఆయన తెలిపారు. భూమిని ఎవరో ఒకరు సృష్టించలేదని, అది ప్రకృతి సహజ పరిణామ క్రమంలో ఏర్పడిందని బోధించారని చెప్పారు. ప్రపంచంలోని ప్రతిదీ నిరంతరం మార్పు చెందుతూనే ఉంటుందని వివరించారు. భూమిపై ఏదీ శాశ్వతం కాదని, ప్రతి వస్తువుకూ ఆరంభం, ముగింపు ఉంటాయని బంతే సత్య బోధి పేర్కొన్నారు. ఏదీ మన వెంట శాశ్వతంగా రాదని, కాలక్రమంలో పాతవి అంతమై కొత్తవి ఆవిర్భవిస్తాయని తెలిపారు. ఇదే బుద్ధుని అనిత్య ధమ్మ బోధన అని వివరించారు.

చీకటి పడితే చాలు మట్టి మాఫియా కుమ్ముడే

- మహేశ్వరంలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు పోలీసులు

- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న మట్టి మాఫియా

- మహేశ్వరం మండలంలో ఏ గ్రామంలో చూసినా మట్టి మాఫియా

- ఇదంతా జరుగుతున్న నిద్రపోతున్న మైనింగ్ అధికారులు

- ముడుపులు ముడితే ఏమైనా చేసుకోవచ్చా





మహేశ్వరం, అక్టోబర్ 31, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో మట్టి మాఫియా ఆగడాలు హద్దు మీరాయి. పగలంతా సైలెంట్.. చీకటి పడితే చాలు జేసీబీలు, టిప్పర్లతో దండయాత్ర. మండలంలో ఏ గ్రామంలో చూసినా ఇదే దందా నడుస్తోంది. ప్రభుత్వ ఆదాయానికి కోట్లలో గండి కొడుతున్నా అటు రెవెన్యూ, ఇటు పోలీసు, మైనింగ్ అధికారులు కళ్లు మూసుకుని కూర్చోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ఏ గ్రామంలో చూసినా అదే తంతు:

మహేశ్వరం, ఎన్ డి తండా, దుబ్బచెర్ల, నాగారం, తుమ్మలూరు, మన్ సాన్ పల్లి,, ఉప్పు గడ్డ తండా , తదితర గ్రామాల్లో చెరువులు, ప్రభుత్వ భూములు, రైతుల భూముల నుండి అక్రమంగా మట్టిని తోడేస్తున్నారు. అనుమతులు లేకుండా రాత్రికి రాత్రే వందలాది టిప్పర్ల మట్టిని తరలించి, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ఫామ్ హౌస్ లకు అధిక ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమ దందాతో రోడ్లన్నీ ధ్వంసమై, దుమ్ము ధూళితో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు.

ముడుపులు ముడితే ఏదైనా చేసుకోవచ్చా?

ఈ దందా అంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మట్టి మాఫియా నుండి నెలవారీ ముడుపులు ముడుతున్నందునే అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఒక్క కేసు కూడా నమోదు చేయకపోవడం, ఒక్క వాహనాన్ని కూడా సీజ్ చేయకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.

పగటిపూట ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు ఉన్నాయని చెబుతున్న అధికారులు, రాత్రి వేళ జరిగే అక్రమ తవ్వకాలపై ఎందుకు నిఘా పెట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా కమీషన్ల కోసమేనా? అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వం స్పందించాలని డిమాండ్:

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, మైనింగ్ శాఖ స్పందించి, రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, అక్రమ మట్టి రవాణాపై ఉక్కుపాదం మోపాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్వరం మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- ఘనంగా కొవ్వొత్తుల ర్యాలీ, రన్

- పాల్గొన్న సీపీ సాయి చైతన్య



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 31:

దేశ శాంతిభద్రతల కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎన్నటికీ మరవలేనివని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే), రాష్ట్రీయ ఏక్తా దివాస్ పురస్కరించుకొని శనివారం నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ, రన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని కోర్టు చౌరస్తా నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మున్సిపల్ ఆఫీస్, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు సాగింది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేడు సమాజంలో ప్రజలందరూ ప్రశాంతంగా జీవించగలుగుతున్నారని కొనియాడారు. వారి కుటుంబాలకు యావత్తు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీలు ప్రకాష్, మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రాజ్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ధరణి, శేఖర్ బాబు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీను, స్పెషల్ పార్టీ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు మరియు వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నిజామాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 'రాష్ట్రీయ ఏక్తా దివాస్'.. అట్టహాసంగా వేడుకలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 31:

భారతదేశ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో “రాష్ట్రీయ ఏక్తా దివాస్” (జాతీయ ఐక్యత దినోత్సవం) వేడుకలను శనివారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అత్యంత ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్. నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత మరియు సమగ్రతను కాపాడతామని ప్రతిజ్ఞ చేయించారు.



ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మరియు భారతదేశ సమగ్రత, ఐక్యత కొరకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి అనన్య సామాన్యమైనదని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం దేశంలోని అన్ని సంస్థానాలను విలీనం చేసి, అఖండ భారతదేశాన్ని నిర్మించడంలో ఆయన పోషించిన కీలక పాత్ర వల్లనే ఆయనకు ఉక్కు మనిషిగా పేరు వచ్చిందని గుర్తుచేశారు. దేశ రక్షణలో, అంతర్గత భద్రతలో పోలీస్ శాఖ పాత్ర కీలకమైనదని, పటేల్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ దేశ ఐక్యత కోసం కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ వేడుకల్లో అదనపు డి.సి.పి (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, ఎ. ఓ ఆసియా భేగం, ఏసీపీలు ప్రకాష్, ఆర్. నరేందర్, గురు నాయుడు, ఆఫీస్ సూపరింటెండెంట్లు, రిజర్వు ఇన్స్పెక్టర్లు, సి.ఐలు, ఎస్.ఐలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఎ.ఆర్, స్పెషల్ పార్టీ మరియు హోమ్ గార్డ్స్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తుక్కుగూడ బస్ స్టాండ్ లో విహెచ్పి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

అయోధ్య రామ జన్మభూమి కరసేవలో ప్రాణాలర్పించిన వారిని స్మరిస్తూ నివాళులు

మహేశ్వరం, అక్టోబర్ 31, (ప్రజా కలం):

అయోధ్య శ్రీ రామ జన్మభూమి కోసం జరిగిన కరసేవలో ప్రాణాలర్పించిన కోఠారి సోదరులను స్మరించుకుంటూ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో హుతాత్మ దివస్ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి చింతల వెంకటరెడ్డి మహేశ్వరం జిల్లా అధ్యక్షులు సాగుకుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కోఠారి సోదరుల త్యాగాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, వారి ఆశయ సాధన కోసం హిందూ సమాజం ఏకతాటిపై నడవాలని నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి చింతల వెంకటరెడ్డి మహేశ్వరం జిల్లా అధ్యక్షులు సాగుకుంట్ల శ్రీనివాస్, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ గంగాపురం శివ, మహేశ్వరం జిల్లా సత్సంగ్



ప్రముఖ్ బొడ్ల శ్రీనివాస్, తుక్కుగూడ ప్రఖండ అధ్యక్షులు మదన మౌని రాజు, కార్యదర్శి సురేష్, సహ కార్యదర్శి మహేష్ తదితరులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మధుమోహన్, కౌన్సిలర్ జాపాల భవన సుధాకర్, విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాదిగల ఐక్యతను చాటుదాం

- నవంబరు 1న నిజామాబాద్‌లో ఆది జాంబవంతుని శోభాయాత్ర

- మాదిగ జాగృతి సంఘం మండల నాయకుడు - పాలేపు రాము మహారాజ్ పిలుపు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 31:

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నవంబరు 1వ తేదీ (ఆదివారం) సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న ‘మాదిగ మహారాజుల ఆది జాంబవంతుని శోభాయాత్ర’ను విజయవంతం చేయాలని మాదిగ జాగృతి సంఘం మోర్తాడ్ మండల నాయకుడు పాలేపు రాము మహారాజ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ విశారదన్ మహారాజ్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.


ఆది జాంబవంతుడు మాదిగ సమాజ చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని కొనియాడారు. ఆయన గొప్పతనాన్ని, సామాజిక ఐక్యతను చాటిచెప్పేలా జిల్లాలోని అన్ని మండలాల నుంచి మాదిగలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శోభాయాత్రకు ఘనత తీసుకురావాలని కోరారు. పార్టీలు, మతాలు, వ్యక్తిగత విభేదాలకు అతీతంగా మాదిగ సమాజం అంతా ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. భేదాలను పక్కనపెట్టి ఆత్మగౌరవం, సామాజిక అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. శోభాయాత్రలో యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పాలేపు రాము మహారాజ్ విజ్ఞప్తి చేశారు.



వీడీసీ ఇసుక టెండర్లు.. ఎవరి అధికారం?

గ్రామాల్లో సమాంతర పాలనకు తెరలేపుతున్న కమిటీలు!- భూగర్భ జలాలపై ఆందోళన ఒకవైపు.. ఇసుక వేలాలు మరోవైపు!

మెట్‌పల్లి మండలంలో ఇసుక టెండర్ల వ్యవహారం హాట్‌టాపిక్.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?



మెట్ పల్లి రూరల్,అక్టోబర్ 31: (ప్రజా కలం); మెట్ పల్లి మండలంలోని ఓ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో వీడీసీ (గ్రామ అభివృద్ధి కమిటీ) ఇసుక టెండర్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. గ్రామ పరిధిలోని చెరువు కాలువ నుంచి ఇసుక తవ్వకాలకు సంబంధించి శుక్రవారం వీడీసీ ఆధ్వర్యంలో టెండర్ నిర్వహించినట్లు, సదరు టెండర్‌ను రూ. 1.05 లక్షలకు దక్కించుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారానికి అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు సహకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ టెండర్లకు చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా? ఇసుక తవ్వకాలకు సంబంధిత శాఖల ఆమోదం తీసుకున్నారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చకు దారితీస్తున్నాయి.

ఒకవైపు భూగర్భ జలాలపై ఆందోళన.. మరోవైపు ఇసుక తవ్వకాలు!

ఒకవైపు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, నీటి వనరులను కాపాడుకోవాలని, వంటల సాగు విషయంలో ఆచితూచి వ్యవహరించాలని సూచనలు వినిపిస్తున్నాయి. మరోవైపు కొందరు స్థానిక నాయకులు ఇసుక టెండర్ల వ్యవహారంలో చురుగ్గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపించడం విస్మయానికి గురిచేస్తోంది. చెరువు కాలువల్లో ఇసుక తవ్వకాలు పర్యావరణంపై, భూగర్భ జలాలపై ఎలాంటి ప్రభావం చూపు తాయన్న అంశాన్ని పక్కనపెట్టి టెండర్లు నిర్వహిస్తే భవిష్యత్తులో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వీడీసీలకు ఇసుక వేలం వేసే అధికారం ఎవరిచ్చారు?

గ్రామ అభివృద్ధి పేరుతో ఏర్పాటైన కమిటీలు తమ పరిధిని దాటి వ్యవహరిస్తున్నాయా? ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండాల్సిన ఇసుక తవ్వకాల విషయంలో స్వతంత్రంగా టెండర్లు నిర్వహించే అధికారం వీడీసీలకు ఉందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత ప్రభుత్వ శాఖల అనుమతులు, పర్యావరణ నిబంధనలు, ఇసుక తవ్వకాలపై అమల్లోఉన్నమార్గదర్శకాలను పాటించకుండా వేలం నిర్వహిస్తే అది నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందా? అన్నది అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

సమాంతర పాలనకు తెరలేపుతున్నారా?

గ్రామాల్లో ప్రజాస్వామ్యబద్ధమైన పాలనకు బదులుగా కొన్ని కమిటీలు తమదైన శైలిలో నిర్ణయాలు తీసుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం పరిధిలోకి వచ్చే అంశాల్లోనూ కమిటీలు జోక్యం చేసుకుంటూ టెండర్లు నిర్వహిస్తే అది సమాంతర పాలనకు దారితీసే ప్రమాదం ఉందని మేధావి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గ్రామాభివృద్ధి పేరుతో ఏర్పడిన కమిటీలు ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలే తప్ప, అధికారిక అనుమతులు అవసరమైన వ్యవహారాల్లో నిబంధనలను పక్కనపెట్టకూడదని సూచిస్తున్నారు.

అధికారులు స్పందించేనా?

మెట్‌పల్లి మండలంలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న వీడీసీ ఇసుక టెండర్ల వ్యవహారంపై సంబంధిత రెవెన్యూ, మైనింగ్, నీటిపారుదల శాఖల అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. టెండర్ నిర్వహణకు అనుమతులు ఉన్నాయా? ఇసుక తవ్వకాలకు చట్టబద్ధమైన ప్రాతిపదిక ఏమిటి? ప్రభుత్వ ఆదాయానికి గండి పడే అవకాశం ఉందా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తారా? లేక చట్టప్రకారం చర్యలు తీసుకుంటారా? అన్నది ఇప్పుడు మెట్‌పల్లి మండలంలో చర్చనీయాంశంగా మారింది.



కొల్లాపూర్ చౌరస్తాలోని చిరు వ్యాపారస్తుల ఉపాధిని తొలగించొద్దు

పట్టణ సుందరీకరణ పేరుతో నిరుపేదల పొట్ట కొట్టడం సరికాదు -బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 31 (ప్రజా కలం): పట్టణ సుందరీకరణ పేరుతో కొల్లాపూర్ చౌరస్తాలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదల ఉపాధిని తొలగించవద్దని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు దుబ్బాలను తొలగించాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ శనివారం బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ మాట్లాడుతూ కొల్లాపూర్ చౌరస్తాలో ఎస్పీ కార్యాలయం పక్క నుంచి చౌరస్తా వరకు సుమారు 10 మంది నిరుపేదలు చిన్నచిన్న దుబ్బాలు ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రోజుకు కేవలం రూ. 200 నుంచి రూ. 300 వరకు సంపాదిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, ప్రతిరోజూ రూ. 50 నుంచి రూ. 100 వరకు తైబజార్ రుసుము సైతం చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేక పేదలు పట్టణాలకు వలస వస్తున్నారని, మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్న తరుణంలో పేదలకు ఉన్న కొద్దిపాటి ఉపాధిని కూడా తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించకపోయినా ఫర్వాలేదు కానీ, ఇప్పటికే జీవనోపాధి పొందుతున్న పేదల పొట్ట కొట్టడం ఎంతవరకు సమంజసం అని విమర్శించారు. నవంబర్ 3వ తేదీలోగా దుబ్బాలను తొలగించాలని అధికారులు గడువు విధించడం పేదల పట్ల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అన్నారు.మున్సిపల్ అధికారులకు దుబ్బాల సమస్య తప్ప పట్టణంలో పరిష్కరించాల్సిన ఇతర సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పట్టణ అభివృద్ధి, సుందరీకరణతో పాటు పేదల జీవనోపాధికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా వారి ఉపాధిని తొలగించవద్దని, పేదల జీవనోపాధికి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి పేదలకు న్యాయం చేయాలని కోరుతామని తెలిపారు. నిరుపేద చెరువు వ్యాపారుల దుబ్బాలు తొలగించడంలో మున్సిపల్ అధికారులు విరమించుకోకపోతే నిరుపేదల తరపున నిరంతర పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ తాడూరు మండల అధ్యక్షుడు జన్ను ఆంజనేయులు, పద్మ, లావణ్య, బాలిశ్వరమ్మ, గీత తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

కార్మిక హక్కులను కాలరాస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి - ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్

నాగర్ కర్నూల్, అక్టోబర్ 31(ప్రజాకలం): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ విమర్శించారు. కార్మికులు ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథాతథంగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.

శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కుమ్మర ఆటో స్టాండ్ వద్ద ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అయన మాట్లాడుతూ 1920లో ఆవిర్భవించిన ఏఐటీయూసీ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పోరాడిన తొలి కార్మిక సంఘమని గుర్తుచేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందన్నారు.

కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవే..

గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు.కనీస వేతనాన్ని రూ. 26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీపై ఉన్న పరిమితులను ఎత్తివేసి, కనీస పెన్షన్ రూ. 10 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్పీఎంలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించి కార్మిక సమస్యలను పరిష్కరించాలని, సివిల్ సప్లై హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, సింగరేణికి నూతన బొగ్గు బావులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆటో, హమాలీ తదితర అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును అమలు చేయాలని, వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, ఆశా వర్కర్లకు రూ. 26 వేల కనీస వేతనంతో పాటు ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ కార్మికులకు ఎస్ఎస్ఆర్ ప్రకారం వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తుమ్మల శివుడు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యశంకర్ గౌడ్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఈర్ల హుస్సేన్, బండి లక్ష్మీపతి, ఎన్నుపోతుల రామస్వామి, వంకేశ్వరం శ్రీనివాసులు, కొత్త రామస్వామి, ఆటో నాయకులు కె. విష్ణు, ఎండీ సర్దార్, గౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ఉప్పునుంతల తహసీల్దార్‌పై వేటు

తహసీల్దార్ ఎ. సునీతను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఉత్తర్వులు



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 31(ప్రజాకలం) :నాగర్ కర్నూల్ జిల్లాలో అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ కఠిన చర్యలు తీసుకున్నారు. అచ్చంపేట డివిజన్ పరిధిలోని ఉప్పునుంతల మండలం అయ్యవారిపల్లి గ్రామంలో భూ రికార్డుల నమోదులో జరిగిన అవకతవకలకు సంబంధించి ఉప్పునుంతల తహసీల్దార్ ఎ. సునీతను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయ్యవారిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 115లో ఉన్న 13 ఎకరాల 17 గుంటల భూమి ఇతరుల పేర్లపై అక్రమంగా నమోదైనట్లు వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంపై పత్రికల్లో వచ్చిన కథనాలను సైతం పరిగణనలోకి తీసుకుని అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాను విచారణ అధికారిగా నియమించారు. విచారణలో భాగంగా పాత పహాణీలు, ఖాస్రా, ఆర్ఓఆర్ రికార్డులతో పాటు భూభారతి పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులు, డిజిటల్ సంతకాల ప్రక్రియను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అసలు రెవెన్యూ రికార్డులకు, కొన్ని భూ నమోదులకు పొంతన లేదని విచారణ నివేదికలో వెల్లడైనట్లు సమాచారం. పత్రాల ధృవీకరణలో లోపాలు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం జరిగినట్లు గుర్తించారు.గతంలో చారకొండ మండల తహసీల్దార్‌గా పనిచేసిన ఎ. సునీత ప్రస్తుతం డిప్యుటేషన్‌పై ఉప్పునుంతల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఆమె బాధ్యతారాహిత్యం, విధి నిర్వహణలో వైఫల్యాన్ని పరిగణనలోకి తీసుకున్న జిల్లా కలెక్టర్ తెలంగాణ సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.క్రమశిక్షణా విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాలల రక్షణ పై అవగాహన కల్పించడమే సురక్షిత్ బచ్పన్ అభియాన్ లక్ష్యం -జిల్లా మెజిస్ట్రేట్



నిర్మల్ అక్టోబర్ 31(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) బాలల హక్కులు చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, బాలల రక్షణకు అందరూ కలిసి పనిచేయాలని జిల్లా మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె భవిష్య అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఈద్గా నిర్మల్ యందు ఏర్పాటుచేసిన సురక్షిత్ బచ్పన్ అభియాన్ అవగాహన కార్యక్రమం పై ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, పోక్సో చట్టం బాల్యవివాహాలు బాల కార్మిక వ్యవస్థ సైబర్ క్రైమ్ ట్రాఫిక్ నియమాల పై విద్యార్థులకు అవగాహన కల్పించినారు. గుడ్ టచ్,బ్యాడ్ టచ్, మొబైల్ ఫోన్, వాడకం వల్ల ఎదురయ్యే సమస్యలను వివరించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే చైల్డ్ లైన్ 1098 నంబర్ కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించినారు. సోషల్ మీడియా, వాట్సాప్, ఇన్స్టా,లను అతిగా వాడరాదని, వీటివల్ల అనేక సమస్యలు ఎదురవుతాయని, ఫ్రీ టైం ను చదువు కొరకు సద్వినియోగం చేసుకోవాలని, చెడు వ్యసనాలకు బానిస కావద్దని, విద్యార్థులకు సూచించినారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలనికోరారు. ఈ కార్యక్రమంలో జువెనైల్ జస్టిస్ బోర్డు మెంబర్,నరేష్ కుమార్,జిల్లా న్యాయ సేవా అథారిటీ లీగల్ హెడ్ సిరాజ్, న్యాయవాది సాయికుమార్, సి ఐ సమ్మయ్య మరియు ప్రధానోపాధ్యాయులు డి మోహన్ రావు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యతా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

- కలెక్టరేట్ లో ఘనంగా ఐక్యతా దినోత్సవ వేడుకలు



నిర్మల్ అక్టోబర్ 31(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యతా స్ఫూర్తితో మనమంతా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు.భారత తొలి ఉప ప్రధాని, మాజీ హోం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151 వ జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అధికారులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో కీలక భూమిక పోషించడమే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన ఉక్కుమనిషి పటేల్ అని కొనియాడారు. అధికారులు, సిబ్బంది అంతా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కంకణబద్దులు కావాలని తెలిపారు. ఈ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఐదు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

-పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలి

-కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి వినతి

తానూర్, అక్టోబర్ 31(ప్రజా కలం): ముథోల్ నియోజకవర్గంలోని తానూర్ ,బాసర, ముథోల్, లోకేశ్వరం, నర్సాపూర్ (జి) మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు తగిన న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఆయా మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. రైతులకు పంట నష్టపరిహారంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ, ప్రభుత్వం అందించే ఇతర సహాయ సదుపాయాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తాగునీటి అవసరాల కోసం బోర్లు మంజూరు చేయాలని, పశువులకు సరిపడా మేత సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. నియోజకవర్గంలోని రైతులు, గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



ప్రజా కలం
ఆదివారం, నవంబర్ 1, 2026

కనీస భద్రత కూడా
కరువైన గిగ్ కార్మికులు!

దేశ ఆర్థిక ప్రగతికి కోట్లాది మంది కార్మికుల శ్రమ పునాది. అయినప్పటికీ వారి జీవితాలకు భద్రత కరువవుతోంది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు పనిచేసే నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు, పారిశుద్ధ్య సిబ్బంది, ఆహార పంపిణీ ఉద్యోగులు, వాహన చోదకులు.. ఇలా అసంఘటిత, గిగ్ రంగాల్లో పనిచేసే లక్షలాది మందికి రోజువారీ సంపాదనే జీవనాధారం. అనారోగ్యం వస్తే ఆదాయం ఆగిపోతుంది. ప్రమాదం జరిగితే కుటుంబం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుంది. వృద్ధాప్యంలో ఆదుకునే భరోసా కూడా చాలామందికి లేదు. అభివృద్ధి ప్రయాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ శ్రమజీవుల సామాజిక భద్రతపై ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించాలి. నీతి ఆయోగ్ 2022 నివేదిక ప్రకారం, 2020-21లో దేశంలో గిగ్ కార్మికుల సంఖ్య 77 లక్షలుగా అంచనా వేయగా, 2029-30 నాటికి అది 2.35 కోట్లకు చేరవచ్చని పేర్కొంది. డిజిటల్ వేదికల ఆధారంగా ఉపాధి అవకాశాలు విస్తరిస్తున్నా, వీరికి సంప్రదాయ ఉద్యోగుల మాదిరిగా వేతన భద్రత, చెల్లింపుతో కూడిన సెలవులు, ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలు అందడం లేదు. పని గంటలు, ఆదాయం, ఉద్యోగ కొనసాగింపుపై స్పష్టమైన భరోసా లేకపోవడం ఆందోళనకరం. అసంఘటిత కార్మికుల నమోదు కోసం కేంద్రం ప్రారంభించిన ఈ-శ్రమ్ పోర్టల్‌లో 2025 నవంబరు నాటికి 31.38 కోట్లకు పైగా కార్మికులు నమోదయ్యారు. అయితే నమోదు ప్రక్రియతోనే బాధ్యత ముగియకూడదు. వారికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు వాస్తవంగా ఎంతవరకు అందుతున్నాయన్నదే కీలకం. సామాజిక భద్రతా కోడ్-2020 ద్వారా గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు చట్టపరమైన గుర్తింపు కల్పించడం కీలక పరిణామం. 2025 నవంబరు 21 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కోడ్ ద్వారా జీవిత, ప్రమాద బీమా, ఆరోగ్య, ప్రసూతి ప్రయోజనాలు, వృద్ధాప్య భద్రత వంటి అంశాలకు చట్టబద్ధమైన మార్గం ఏర్పడింది. అగ్రిగేటర్ల నుంచి సంక్షేమ నిధుల సమీకరణకూ నిబంధనలు ఉన్నాయి. అయితే వీటి అమలులో జాప్యం లేకుండా చూడటం అవసరం. ప్రతి కార్మికుడికి ఆరోగ్య బీమా, ప్రమాద పరిహారం, పెన్షన్, ప్రసూతి ప్రయోజనాలు అందాలి. రాష్ట్రాల మధ్య వలస వెళ్లినా, ఒక డిజిటల్ వేదిక నుంచి మరో వేదికకు మారినా సంక్షేమ ప్రయోజనాలు కొనసాగాలి. ఇందుకు ప్రత్యేక నిధులు, పారదర్శక పర్యవేక్షణ, సులభమైన నమోదు వ్యవస్థ అవసరం. కార్మికుడి చెమట చుక్కతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతోంది. కానీ అతడి కుటుంబానికి కనీస భద్రత కల్పించలేకపోతే ఆ అభివృద్ధికి పరిపూర్ణత ఉండదు. ఉపాధి కల్పించడమే కాదు, ఆ ఉపాధికి గౌరవం, భద్రత కల్పించడం కూడా ప్రభుత్వాలు, సంస్థల బాధ్యత. శ్రమకు తగిన ప్రతిఫలంతో పాటు భద్రమైన భవిష్యత్తు కల్పించినప్పుడే సమ్మిళిత అభివృద్ధి సాకారమవుతుంది.

- సి.హెచ్. ప్రతాప్

బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు



బెల్లంపల్లి, అక్టోబర్31, (ప్రజాకలం) ప్రతినిధి...బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి శాంతి సోనీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణం లోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, కస్తూర్బా రెసిడెన్షియల్ స్కూల్ లో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు.. విద్యార్థులకు చట్టాల పై అవగాహన కల్పించారు... ఫోక్సో చట్టం పై ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సోషల్ మీడియలో వస్తున్న ఫేక్ ఐడి లకు స్పందించి మోస పోవద్దని, సమాజం లో ఆడ పిల్లల పై జరుగుతున్న అరాచకాల పై అవగాహన కల్పించారు.పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న వసతి,బోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.. బాగా చదువుకొని ఉన్నతమైన స్థానం లో నిలిచి తల్లి తండ్రులకు,ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మెరుగు శ్రీనివాస్, బార్ అసోసియేషన్ మహిళా వైస్ ప్రెసిడెంట్ నల్లులు సంగీత, న్యాయవాదులు బాల కృష్ణ, గోలి శ్రీనివాస్, సందీప్, లావణ్య, జమ్మిడి రాజేష్, పాల్గొన్నారు....

పడకల్ గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం

ఎండపల్లి, అక్టోబర్ 31 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని పడకల్ గ్రామం లో శనివారం రోజున ఖేత్ బచావో అభియాన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్య క్రమానికి మండల వ్యవసాయ అధికారి కామల్ల మహేష్, ఏఈఓ కళ్యాడపు మౌనిక, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అన్వేష్, సర్పంచ్ బెడ్డల ప్రవీణ్, ఉప సర్పంచ్ గాదె విజయ, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ భూసార పరిరక్షణకు సేంద్రియ వ్యవసాయం, మట్టి పరీక్షలు ఎంతో అవస రమని, రసాయనాల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున, రైతులు వాతావరణ మార్పులకు అనుగుణంగా ఆరుతడి పంటలు మరియు పంటల వైవిధ్యీకరణ పాటించాలని కోరారు. వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ రైతులు స్థిరమైన దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి కామాల్ల మహేష్ తెలిపారు.



మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి
అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ - కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి - వైద్యులతో సమీక్షించిన కలెక్టర్



జగిత్యాల, ప్రతినిధి అక్టోబర్ 31: మెట్ పల్లి పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి ఆసుపత్రిని ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, ఇతర ఏర్పాట్లను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, వైద్య సిబ్బంది హాజరు, మందుల లభ్యత తదితర అంశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్యం కోసం వచ్చే ప్రజల పట్ల వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి రోగికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని, ఆసుపత్రులలో పారిశుద్ధ్యం, రోగులకు అవసరమైన సౌకర్యాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీఓ నరసింహారావు, కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి, వైద్యులు, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు నాణ్యత..త్వరితగతిన పూర్తి చేయాలి

కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి



జగిత్యాల, ప్రతినిధి అక్టోబర్ 31(ప్రజా కలం):మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, వివిధ అభివృద్ధి పనులను శనివారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో చేపడుతున్న నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించే లక్ష్యంతో చేపడుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం కోరుట్ల మండలం కల్లూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో అదనంగా నిర్మిస్తున్న తరగతి గదులు, డార్మెటరీ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం పాఠశాలలోని వంట గదిని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. వంటగదిలో నిల్వ ఉంచిన వంట నూనె ప్యాకెట్లు, ఇతర వంట సామగ్రి, నిత్యావసర వస్తువులను పరిశీలించి వాటి నాణ్యత, నిల్వ విధానాలపై ఆరా తీశారు. వంటగదిలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థినులకు అందించే ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు.అనంతరం విద్యార్థినులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముచ్చటించి వారి చదువు, వసతులు, భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థినులకు నాణ్యమైన, రుచికరమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. భోజనం తయారీలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థినుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థినులకు అందించే ఆహారంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు విద్యార్థినులకు మెరుగైన విద్యా, వసతి సదుపాయాలు కల్పించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, డీఈఓ రాము, సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో ఘనంగా ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం

కార్మిక హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటం : జిల్లా అధ్యక్షుడు ఎశమేని గణేష్



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజాకలం):-భారతదేశ తొలి కార్మిక సంఘమైన ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మెట్‌పల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులో జగిత్యాల జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు ఎశమేని గణేష్ సంఘం జెండాను ఆవిష్కరించి కార్మికులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎశమేని గణేష్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతోందని అన్నారు. సంఘం నిర్వహించిన అనేక ఉద్యమాల ఫలితంగానే కార్మికులకు చట్టాలు, హక్కులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాల సాధనలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను బలహీనపరిచే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించి హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పండుగ, జాతీయ సెలవులు, ప్రసూతి సెలవులు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బర్ల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎండీ ఉస్మాన్, మెట్‌పల్లి మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు లంక శ్రీకాంత్, యు. శ్రీనివాస్, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గద్దల బాలరాజు, పొట్ట ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాతా వినయ్, ఓడల రాకేశ్, చౌదరి శివకుమార్, గోవర్ధన్, మాతంగి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడిన ఘనత సీఎం రేవంత్‌దే

- ప్రభుత్వ విప్ విజయరమణ రావు



పెద్దపల్లి,అక్టోబర్ 31:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) రాష్ట్రంలో సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన 550 ఎకరాల ప్రభుత్వ భూములను న్యాయపోరాటం ద్వారా కాపాడిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించి,ఎకరాకు రూ.100 కోట్ల వరకు విలువ చేసే విలువైన భూములను రాష్ట్ర ప్రభుత్వ పరం చేశారని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు మేడ్చల్,రంగారెడ్డి జిల్లాల్లోని ఉప్పలగూడ,కంటోన్మెంట్,రాయదుర్గం తదితర ప్రాంతాల్లోని భూములను పరిరక్షించామని చెప్పారు.ప్రభుత్వ చర్యల వల్ల నేడు చెరువులు, కుంటలు పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయని పేర్కొన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్,హరీశ్ రావులు తమ అనుచరులకు,పార్టీ నాయకులకు విలువైన ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కట్టబెట్టారని విజయరమణ రావు ఆరోపించారు.దామోదర్ రావు లాంటి వ్యక్తులను ముందుంచి అటవీ భూములు,ప్రభుత్వ స్థలాలను నిర్వీర్యం చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంపదను కాపాడుతూ ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తుంటే ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు సీఎం రేవంత్ రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం తగదని ఆయన మండిపడ్డారు.

దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కి ఘన నివాళి



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజాకలం):- దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 42వ వర్ధంతి సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కొమిరెడ్డి లింగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ.. భారతదేశ తొలి మహిళా ప్రధానిగా, దేశ మూడవ ప్రధానిగా ఇందిరాగాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉక్కు మహిళగా పేరుగాంచిన ఆమె పేద ప్రజల సంక్షేమం కోసం పలు సంస్కరణలు చేపట్టారని, దేశాన్ని వివిధ రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. భారత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో 22వ వార్డు బీసీ ఇన్‌చార్జి ఆరెల్లి కుమార్, 13వ వార్డు కాంగ్రెస్ నాయకుడు కొమ్ముల సంతోష్ రెడ్డి, చింతలపేట గ్రామ మాజీ వీడీసీ చైర్మన్ ముక్కెర మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- మెట్‌పల్లిలో ఘనంగా మాజీ ప్రధాని 42వ వర్ధంతి వేడుకలు



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజాకలం):- భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ ఇందిరాగాంధీ 42వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం మెట్‌పల్లి పట్టణంలోని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఖుతుబోదీన్ పాషా మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ఐరన్ లేడీగా గుర్తింపు పొందిన ఇందిరాగాంధీ పేదల సంక్షేమం కోసం అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు.బ్యాంకుల జాతీయీకరణ, భూ సంస్కరణలు, భూ పరిమితి చట్టం, 20 సూత్రాల కార్యక్రమం ద్వారా పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని అన్నారు. భూమిలేని నిరుపేదలకు భూములు పంపిణీ చేసి లక్షలాది కుటుంబాలకు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించారని పేర్కొన్నారు. దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్, పట్టణ ఎన్ఎస్‌యూఐ వైస్ ప్రెసిడెంట్ సమీర్ సర్కార్, ఎండీ అన్వర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు రిజ్వాన్, రియాన్, ముదసీర్, ముస్తఫా, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయం

శక్తిస్థల్‌లో ఇందిరాగాంధీ కి నివాళులర్పించిన పూదరి రాము గౌడ్



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజాకలం):- భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ 42వ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలోని శక్తిస్థల్‌లో మెటుపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూదరి రాము గౌడ్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. బ్యాంకుల జాతీయీకరణ, హరిత విప్లవానికి ప్రోత్సాహం, దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో భారతదేశానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు.తెలంగాణ ప్రాంత అభివృద్ధి, స్థానికుల హక్కులకు సంబంధించిన అంశాలు కూడా ఆమె పాలనా కాలంలో జాతీయ స్థాయిలో ప్రాధాన్యత పొందాయని, 1973లో ఆరు సూత్రాల పథకం అమలుకు ఆమె ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుందని గుర్తుచేశారు.పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆమె చూపిన చిత్తశుద్ధి, ధైర్యసాహసాలు నేటి తరానికి ఆదర్శమని, ఆమె ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని రాము గౌడ్ పేర్కొన్నారు.

తవ్వితీసిన నిజం.. తలవంచిన దుండగులు

- ఉత్కంఠకు తెర..యథాస్థానంలో రాజ్యాంగ పీఠిక పునఃప్రతిష్ఠ

పెద్దపల్లి,అక్టోబర్ 31:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లి నూతన బస్ డిపో ప్రాంగణంలో అకస్మాత్తుగా మాయమైన రాజ్యాంగ పీఠిక వివాదం సుఖాంతమైంది.దేశ స్వాతంత్ర్య స్మృతి చిహ్నంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పీఠిక కనిపించకుండా పోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ఈ ఘటనపై స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంస్థ రాష్ట్ర కార్యదర్శి బాలసాని వెంకటేశం పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన ఎస్ఐ రాజశేఖర్ తక్షణమే స్పందించి విచారణ చేపట్టారు. పోలీసుల దర్యాప్తు,స్థానిక బస్ డిపో మేనేజర్ చొరవతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.కొందరు వ్యక్తులు ఆ రాజ్యాంగ పీఠికను అక్కడి నుంచి తొలగించి,సమీపంలోనే గుంత తవ్వి మట్టిలో పాతర వేసినట్లు గుర్తించారు. పోలీసుల విచారణ ముమ్మరం కావడం, విషయం తీవ్రరూపం దాల్చడంతో తప్పు తెలుసుకున్న సదరు వ్యక్తులు రాత్రికి రాత్రే స్పందించారు.మట్టిలో నుంచి పీఠికను వెలికితీసి,శనివారం నాటికి దానిని పాత స్థానంలోనే తిరిగి భద్రంగా నిర్మించి తమ తప్పును సరిదిద్దుకున్నారు. దీంతో గత కొన్ని గంటలుగా నెలకొన్న వివాదానికి, ఉత్కంఠకు పూర్తిగా తెరపడింది.ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి తక్షణమే స్పందించి సహకరించిన పెద్దపల్లి ఎస్ఐ రాజశేఖర్‌కు,వార్తను వెలుగులోకి తెచ్చిన పాత్రికేయ మిత్రులకు బాలసాని వెంకటేశం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- బెల్లంపల్లి డివిజన్ ఏసిపి వి. కిరణ్ కుమార్

- బెల్లంపల్లి రూరల్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



బెల్లంపల్లి,అక్టోబర్ 31, (ప్రజాకలం) ప్రతినిధి...
బెల్లంపల్లి రూరల్ సర్కిల్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణార్థం శనివారం ఆర్య వైశ్య భవన్ లో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా బెల్లంపల్లి డివిజన్ ఏసిపి వి.కిరణ్ కుమార్ హాజరయ్యారు. యువకులు,పోలీస్ సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు,ప్రజాప్రతినిధులు, ప్రజలు రక్తదానం చేశారు. రక్తదాతలకు ఏసిపి అభినందన పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని వారు చేసిన సేవలను కొనియాడారు. అక్టోబర్ 21 నుంచి 31 ఈరోజు వరకు సైకిల్ ర్యాలీ, కొవ్వొత్తుల ర్యాలీ, రక్తదాన శిబిరం, పోలీస్ స్టేషన్ ఓపెన్ హౌస్, విద్యార్థులకు వ్యాసరచనలు వంటి వివిధ కార్యక్రమాలను నిర్వహించమన్నారు.. తలసేమియా,సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు నిరంతరం రక్తం అవసరం ఉంటుందని, ఇలాంటి రక్తదాన శిబిరం వల్ల వారికి రక్తం సేకరించి ప్రాణదాతలుగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డివిజన్ సిఐలు ,ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, యువకులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు....

జగ్గసాగర్ పాఠశాలలో విజిలెన్స్ అవేర్‌నెస్ సదస్సు



మెట్ పల్లి రూరల్,అక్టోబర్ 31:(ప్రజా కలం);తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం జగ్గసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ నిర్వహించారు. 'నిజాయితీతో సమృద్ధి' అనే నినాదంతో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో నిజాయితీ, నైతిక విలువలను పాటించాలని సూచించారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో నిజాయితీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుల్ల జగన్ గౌడ్, బ్యాంక్ మేనేజర్ గారిపెల్లి విశ్వేశ్వర్, పాలకుర్తి అవినాశ్, గంగాధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం



ఎండపల్లి, అక్టోబర్ 31:(ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని పడకల్ గ్రామంలో శనివారం రోజున రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ బెడ్డల ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ టి అన్వేష్, ఎస్సీ ఎస్టీ అబ్జర్వర్, మండల వ్యవసాయ శాఖ అధికారి కామాల్ల మహేష్, ఏ ఈ ఓ మౌనిక, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్, వెంకటేశ్వర్లు, ఐకెపి ఎపిఎం, విద్యుత్ శాఖ, అంగన్వాడి టీచర్లు, ఆరోగ్యశాఖ, ఎస్సీ హాస్టల్ హెచ్ డబ్ల్యు ఓ అప్సర్, రెవెన్యూ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంబేద్కర్ సంఘం నాయకులు,

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు పట్టుకున్న రెవెన్యు సిబ్బంది

గొల్లపల్లి అక్టోబర్ 31 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండల కేంద్రంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను శుక్రవారం రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. రాత్రి 10 గంటల సమయంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది మూడు టిప్పర్లను పట్టుకోగా టిప్పర్ల డ్రైవర్లు అక్కడి నుండి పరారయ్యారు.టిప్పర్ నడిపిస్తున్న డ్రైవర్లను శనివారం పట్టుకొని గొల్లపల్లి పోలీస్ స్టేషన్లో అప్పగించారు. మరో టిప్పర్ తప్పించుకొని వెళ్లడంతో, సదరు టిప్పర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు రెవెన్యూ అధికారులు తెలిపారు.మండలంలో ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.



పర్యావరణ పరిరక్షణపై రైసింగ్ హైస్కూల్ లో అవగాహన సదస్సు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

కరస్పాండెంట్ రాజేంద్ర ప్రసాద్ - ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణపై పత్యేక అవగాహన



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్31(ప్రజా కలం): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ-వేస్ట్) నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పట్టణంలోని రైసింగ్ హైస్కూల్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కుడేల రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడేయడం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాలను విద్యార్థులకు సూచించారు.పాత మొబైల్ ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, ప్రింటర్లు, బ్యాటరీలు, వైర్లు, ఛార్జర్లు, సర్క్యూట్ బోర్డులు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను సాధారణ చెత్తలో కలిపి పారవేయకూడదని సూచించారు. వీటిలో ఉండే సీసం, పాదరసం వంటి హానికర పదార్థాలు నేల, నీరు, గాలిని కలుషితం చేసే ప్రమాదం ఉందని, తద్వారా మానవ ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు. పనికిరాని ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రత్యేకంగా సేకరించి, అధికారిక ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాలు లేదా రీసైక్లింగ్ సంస్థలకు అందించాలన్నారు.అదేవిధంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి నిర్దేశిత చెత్త బుట్టల్లో వేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు.పర్యావరణాన్ని కాపాడటం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కుడేల లిఖిత, డైరెక్టర్లు చిప్ప మోహన్, షహనాజ్ బేగం, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కవిత, ఉపాధ్యాయులు సుమయ్య, సంజన, లత, భవాని, రమ్య, విద్యారాణి, జ్యోతి, సాయి ప్రియ, సహస్ర, కార్తీక్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం

- కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. సునీతారాణి సస్పెన్షన్



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 31(ప్రజా కలం): విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, పరిపాలనా పర్యవేక్షణలో వైఫల్యం, ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన కారణాలతో కోరుట్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. సునీతారాణిని తక్షణమే సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.అక్టోబర్ 31న జిల్లా కలెక్టర్ కోరుట్ల ఏరియా ఆసుపత్రిని నందర్శించిన సందర్భంగా, సూపరింటెండెంట్ సంబంధిత సమర్థ అధికారి నుంచి ముందస్తు అనుమతి పొందకుండా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. ఆసుపత్రి పరిపాలన, సిబ్బంది పర్యవేక్షణ, రోగులకు నిరంతర వైద్యసేవలు అందేలా చూడాల్సిన బాధ్యత కలిగిన అధికారి స్వయంగా అనుమతి లేకుండా గైర్హాజరు కావడాన్ని ఉత్తర్వుల్లో తీవ్రంగా పరిగణించారు.అంతేకాకుండా, ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందిలో దాదాపు సగం మందికి ఒకేసారి సెలవులు మంజూరు చేసినట్లు గుర్తించారు. ఆసుపత్రి సేవలు నిరాటంకంగా కొనసాగేందుకు అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడకుండా సెలవులు మంజూరు చేయడం పరిపాలనా నిర్లక్ష్యాన్ని, పర్యవేక్షణ లోపాన్ని సూచిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజలకు అత్యవసరమైన వైద్యసేవలు అందించే ప్రభుత్వ ఆసుపత్రిలో తగినంత మంది వైద్యులు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గుర్తించిన లోపాల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, చేపట్టనున్న క్రమశిక్షణ చర్యల దృష్ట్యా డాక్టర్ వి. సునీతారాణిని సస్పెన్షన్‌లో ఉంచారు.క్రమశిక్షణ చర్యలు ముగిసే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. సస్పెన్షన్ కాలంలో జిల్లా కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యస్థానాన్ని విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బియ్యం విక్రయ ధరలను తప్పనిసరిగా ప్రదర్శించాలి

జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్



మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31: బియ్యం విక్రయదారులు తమ విక్రయ కేంద్రాలలో వివిధ రకాల బియ్యం గరిష్ట విక్రయ ధరల వివరాలను ప్రజలకు కనిపించే విధంగా తప్పనిసరిగా ప్రదర్శించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్ అన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో గల శ్రీనాథ్ ట్రేడర్స్, హరి ఓం ట్రేడర్స్, మహేశ్వరి ట్రేడర్స్ బియ్యం విక్రయ దుకాణాలను డి.టి., ఆర్.ఐ., ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బియ్యం విక్రయదారులు తమ విక్రయ కేంద్రాలలో వివిధ రకాల బియ్యం గరిష్ట విక్రయ ధరలను తెలిపే ఫ్లెక్సీలను తప్పనిసరిగా ఏర్పాటు చేసి ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని తెలిపారు. బి పి టి బియ్యం కిలోకు 66 రూపాయలు, తెలంగాణ సోనా / హెచ్ఎంటి బియ్యం కిలోకు 74 రూపాయలు, జైశ్రీరామ్ బియ్యం కిలోకు 79 రూపాయలకు మించరాదని తెలిపారు. హోల్‌సేల్ వ్యాపారులు, కిరాణా వర్తకులు, మిల్లర్లు, బియ్యం విక్రయదారులు ఈ ధరలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత ధరలకు మించి బియ్యం విక్రయించరాదని సూచించారు. వినియోగదారులకు ధరలపై స్పష్టమైన అవగాహన కల్పించేలా విక్రయ కేంద్రాలలో ధరల పట్టికలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరలను ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించిన వారిపై నిత్యావసర వస్తువుల చట్టం--1955 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పటేల్ ఆదర్శాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

- అమరగాని ప్రదీప్ కుమార్, యాదవ రాజు



పెద్దపల్లి,అక్టోబర్ 31:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)
దేశ సమైక్యత కోసం సర్వస్వం అర్పించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, ఆయన ఆశయ సాధనకు పునరంకితం కావాలని రాష్ట్ర యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్,ఎన్ఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు యాదవ రాజు పిలుపునిచ్చారు.భారతదేశ ఐక్యతను చాటిచెప్పిన ఉక్కుమనిషి,భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని జూలపల్లి మండల కేంద్రంలోని జూపిటర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్,బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్,ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు.నేషనల్ యూత్ ప్రాజెక్ట్,నిఫా తెలంగాణ,గాంధీ స్మారక నిధి సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాలల కరస్పాండెంట్ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్,ముఖ్య వక్తగా ఎన్ఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు యాదవ రాజు హాజరై మాట్లాడారు.
స్వతంత్ర భారతంలో సంస్థానాలను విలీనం చేసి దేశ సమగ్రతను కాపాడిన దక్షుడు సర్దార్ పటేల్ అని,ఆయన ఆదర్శాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గాంధీ స్మారక నిధి సౌజన్యంతో విద్యార్థులు,ఉపాధ్యాయులకు సర్దార్ వల్లభాయ్ పటేల్, మహాత్మా గాంధీ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేయడంతో పాటు సహకారం అందించిన జీవీ సుబ్బారావు, కార్యదర్శి రంగారావులకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం స్వామి వివేకానంద 133వ చికాగో ఉపన్యాస సందేశ ప్రచారంలో భాగంగా విద్యార్థులకు సత్ప్రవర్తన,సచ్ఛీలత అనే అంశంపై అవగాహన కల్పించగా,ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని పటేల్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.

నిరుపేద యువతి పెళ్లికి ఆర్థిక సాయం అందజేత

గొల్లపల్లి అక్టోబర్ 31 ప్రజాకలం ప్రతినిధి : గొల్లపల్లి మండలం మల్లన్నపేట్ గ్రామానికి చెందిన నస్పూరి లస్మయ్యది నిరుపేద కుటుంబం. ఇటీవల వారి కుమార్తె వివాహం నిశ్చయం కావడంతో వారి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో స్థానిక నాయకులు సామాజిక సేవకులు ఎడమల భోజేందర్ రెడ్డి తెలపగా వెంటనే స్పందించిన భోజేందర్ రెడ్డి తన వంతు సాయంగా 5000 రూపాయల ఆర్థిక సాయం అందించారు.అనంతరం విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కట్ట వెంకట రమణ ఇటీవల ప్రమాదశవత్తు కింద పడి చేయి విరగడంతో వారిని ఎడమల బోజేందర్ రెడ్డి పరామర్శించి వారి బాగోగులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సిద్దెంకి లక్ష్మీ మల్లారెడ్డి , యూత్ నాయకులు అవారి చందు శంకర్రావు పెట్ ఉప సర్పంచ్ గుర్రం రంజిత్ రెడ్డి నాయకులు భీమా సత్యం,బండారి శ్రీనివాస్,లక్కాకుల వినోద్,పొలస రాయమల్లు,బండారి మహేష్,గుగ్గిళ్ల నరేష్,లక్కాకుల మనోజ్,ఉల్లెంగుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి లో జాతీయ ఏకతా దివస్



బెల్లంపల్లి, అక్టోబర్31, (ప్రజాకలం) ప్రతినిధి.. అక్టోబర్ 31న జాతీయ ఏకతా దివస్ సందర్భంగా బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ ఐక్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన దేశ ఐక్యత,సమగ్రత కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశంలోని ప్రజలందరూ కుల,మత,ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని,దేశ సమగ్రత మరియు ఐక్యతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలియజేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు.దేశంలో శాంతిభద్రతలు,సోదరభావం, జాతీయ సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.గుజరాత్ లోని ఏక్తా నగర్ లో నిర్వహించబడే భారత ప్రధాని మంత్రి లైవ్ కార్యక్రమాన్ని రాంజీ గోండు స్కూల్ పిల్లలు,టీచర్స్ తో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమం లో టూ టౌన్ ఎస్ఐ,ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకు చేతిలో తండ్రి హత్య



జగిత్యాల్ ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజా కలం) జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో శనివారం దారుణ ఘటన చోటుచేసుకుంది. భూ వివాదం నేపథ్యంలో సొంత కొడుకే తండ్రిని కర్రతో కొట్టి హత్య చేశాడు. గ్రామానికి చెందిన మేడిపల్లి వెంకటేశంను ఆయన కుమారుడు లక్ష్మణ్ కర్రతో కొట్టి చంపినట్లు తెలిసింది. భూమి విషయంలో తలెత్తిన గొడవ హత్యకు దారితీసినట్లు సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దేశ సమగ్రత ఐక్యతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

- అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు

- ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

పెద్దపల్లి,అక్టోబర్ 31:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) దేశ సమగ్రత,ఐక్యతను పెంపొందించుటకు ప్రతి ఒక్కరు పాటుపడాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. శనివారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు



లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ వల్లభాయ్ చిత్ర పటానికి పూలమాలలు సమర్పించారు.ఈసందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు,మాట్లాడుతూ జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని భారత ప్రథమ హోమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన అక్టోబర్ 31న ప్రతి ఏటా నిర్వహించు కుంటున్నామని తెలిపారు.దేశ ప్రజలలో మనమంతా భారతీయుల మనే భావనను సుస్థిరం చేసిన మహనీయుడు అని,సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు సంకల్పాన్ని భావి తరాలు ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన దిశగా కృషి చేసి దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.అనంతరం దేశఐకమత్యం,సమగ్రత,భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతామని,దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచటానికి స్వీయ తోడ్పాటు అందిస్తామని,ఉద్యోగులతో అదనపు కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్,వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది,తదితరులు,పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువ రైతు దుర్మరణం

వేరుశనగ పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి మృత్యువాత

నాగర్ కర్నూల్ జిల్లా, అక్టోబర్ 31(ప్రజాకలం):నాగర్ కర్నూల్ జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. పెద్దకొత్తపల్లి మండలం మారేడుమాన్ దిన్నె గ్రామానికి చెందిన యువ రైతు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయాడు.గ్రామానికి చెందిన పెబ్బేటి వెంకటయ్య కుమారుడు కేశవులు (31) శనివారం తన వేరుశనగ పంటకు నీరు పారించేందుకు పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో వ్యవసాయ మోటార్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో తీవ్ర విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే



మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి భార్య జయరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వేధింపులను నిర్భయంగా ఎదిరించండి

- ఫోక్సో అదనపు జిల్లా న్యాయమూర్తి స్వప్న రాణి



పెద్దపల్లి,అక్టోబర్ 31:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) బాలబాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా మౌనంగా భరించకుండా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు లేదా పోలీసులకు నిర్భయంగా తెలియజేయాలని, బాధితులకు అండగా నిలిచేందుకు చట్టాలు,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయని ఫోక్సో అదనపు జిల్లా న్యాయమూర్తి స్వప్న రాణి స్పష్టం చేశారు.సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా పెద్దపల్లి మండలం నిమ్మనపల్లిలోని పల్లవి పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ,పోక్సో చట్టం–2012 మరియు వేధింపుల నివారణపై శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనిజ కోహిర్కర్ కలిసి ఫోక్సో అదనపు జిల్లా న్యాయమూర్తి స్వప్న రాణి హాజరై విద్యార్థులకు వ్యక్తిగత భద్రత,మంచి స్పర్శ–చెడు స్పర్శ,లైంగిక వేధింపుల నివారణపై అవగాహన కల్పిస్తూ,చిన్నారుల రక్షణలో తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,పాఠశాల యాజమాన్యం మరియు పోలీసుల సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు.ఆపదలో ఉన్న బాలల సహాయార్థం 1098,ఉచిత న్యాయ సేవలకు 15100 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో న్యాయ సహాయ మండలి సభ్యులు శ్రీనివాస్,సంకీర్తన,కల్చరల్ సెక్రెటరీ నరేష్,మహిళా న్యాయవాదుల విభాగం ప్రతినిధులు శరత్,ఝాన్సీ,డీసీపీవో సిబ్బంది రమ,కల్పన,శ్యామల,పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి,ప్రిన్సిపాల్ వాణి,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో పేదలకే ప్రాధాన్యం

- రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్

- జంగాలపల్లిలో 633 డబుల్ ఇళ్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



పెద్దపల్లి,అక్టోబర్ 31:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు.రామగుండం నియోజకవర్గంలోని జంగాలపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తన సతీమణి మనాలి ఠాకూర్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని,అర్హులైన 633 మంది లబ్ధిదారులకు నూతన గృహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,గత బీఆర్ఎస్ పాలకులు నిర్మాణాలను మధ్యలోనే వదిలేసి పేదలను మోసం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం అన్ని వసతులు పూర్తి చేసి ఇళ్లను అందజేస్తున్నామని తెలిపారు.ఇళ్ల వద్ద తాగునీటి సరఫరా పైప్‌లైన్,ట్యాంక్ కోసం రూ. 2.50 కోట్లు,మేడిపల్లి నుంచి అప్రోచ్ రోడ్లు,డ్రైనేజీలు,వీధి దీపాల కోసం రూ. 1.70 కోట్లు, విద్యుదీకరణకు రూ. 30 లక్షలు వెచ్చించామని చెప్పారు.అంతేకాకుండా ఎన్టీపీసీ ప్రాంతంలో రూ. 30 కోట్లు, రామగుండం పట్టణంలో రూ. 35 కోట్ల నిధులతో రోడ్లు,అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్ వంటి విస్తృత అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో రామగుండాన్ని విద్య,వైద్యం,ఉపాధి రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే కాక,త్వరలోనే సింగరేణి కార్మికుల సొంతింటి కలను కూడా సాకారం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి,డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య,మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ,కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు ఎండీ ముస్తఫా,కార్పొరేటర్లు, అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాలల రక్షణకు పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు



నాగర్ కర్నూల్, అక్టోబర్ 31(ప్రజాకలం): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో సురక్షిత్ బచ్పన్ అభియాన్ – పాన్ ఇండియా స్కూల్ అవేర్‌నెస్ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోక్సో ప్రత్యేక సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీమతి నసీం సుల్తానా మాట్లాడుతూదేశంలో బాలల రక్షణ, హక్కులు, భద్రతను పెంపొందించడమే సురక్షిత్ బచ్పన్ అభియాన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. చిన్నారులపై జరిగే లైంగిక దాడులు, వేధింపులను అరికట్టేందుకు రూపొందించిన పోక్సో చట్టంపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు.పోక్సో చట్టం అత్యంత కఠినమైన చట్టమని, ఈ చట్టం కింద నేరం రుజువైతే కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వివరించారు. ఇలాంటి ఘటనలు బాధిత పిల్లలతో పాటు వారి కుటుంబాలపై కూడా తీవ్ర మానసిక ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాలను వివరించి, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి బాలబాలిక సురక్షితమైన బాల్యాన్ని పొందేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అనంతరం బాలల హక్కులు, రక్షణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి నిహారిక, ప్రభుత్వ న్యాయవాది శ్రీరామ్ ఆర్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

60 సంవత్సరాల అనంతరం కొండగట్టులో

శ్రీ హనుమాన్ చందనోత్సవ మహోత్సవం

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ - నవంబర్ 15 నుంచి 20 వరకు చందనోత్సవ మహా సంప్రోక్షణ కార్యక్రమాలు
నవంబర్ 20 నుంచి డిసెంబర్ 29 వరకు 40 రోజుల పాటు స్వామివారి నిజరూప దర్శనం
నిజరూప దర్శనానికి రోజుకు సుమారు 50 వేల మంది భక్తులు వచ్చే అవకాశం
ట్రాఫిక్, పార్కింగ్, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి
భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు, వైద్య శిబిరాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి
ప్రజాప్రతినిధులతో క్షేత్రస్థాయి పర్యటన అనంతరం మరో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం
కొండగట్టు చందనోత్సవ మహోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజా కలం):

కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో స్వామి వారికి సుమారు 60 సంవత్సరాల అనంతరం నిర్వహించనున్న శ్రీ హనుమాన్ చందనోత్సవ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారు.శనివారం ఐడీఓసీలో సంబంధిత శాఖల అధికారులతో కొండగట్టు చందనోత్సవ మహోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారుజిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ సుమారు 60 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ అపూర్వ, అద్భుతమైన ఆధ్యాత్మిక కార్యక్రమం అత్యంత విశిష్టమైనదని తెలిపారు. ఈ మహోత్సవానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని సూచించారు.నవంబర్ 15 నుంచి 20, 2026 వరకు స్వామివారి చందనోత్సవం, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 29 వరకు 40 రోజుల పాటు భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 29న తిరిగి స్వామివారికి మండల పూజ, సింధూర లేపనం నిర్వహించనున్నట్లు వివరించారు. కార్తీక మాసం సందర్భంగా సాధారణ రోజుల కంటే ఉత్సవాల సమయంలో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.సాధారణ రోజుల్లో సుమారు 10 వేల మంది, మంగళ, శని, ఆదివారాలు, సెలవు దినాల్లో సుమారు 20 వేల మంది, పర్వదినాల్లో 25 వేల నుంచి 30 వేల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా నవంబర్ 20 నుంచి డిసెంబర్ 29 వరకు నిర్వహించే నిజరూప దర్శనానికి రోజుకు సుమారు 50 వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పార్కింగ్ నుంచి దర్శనం, తిరుగు ప్రయాణం వరకు ప్రతి అంశంలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, పోలీసు బందోబస్తు, ప్రత్యేక బస్సులు, తాగునీటి సరఫరా, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, నిరంతరం తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణకు తగిన సంఖ్యలో సిబ్బందిని నియమించి, చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భక్తుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆలయ పరిసరాల్లో మూడు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన వైద్యులు, వైద్య సిబ్బంది, మందులు, ప్రథమ చికిత్స సామగ్రి, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఉత్సవాల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,ప్రత్యామ్నాయంగా జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఆలయ ప్రాంగణం, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాల్లో తగినంత విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. రెవెన్యూ శాఖ అవసరమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి పార్కింగ్ తదితర అవసరాలకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ రాజ్, పారిశుద్ధ్య శాఖలు ఆలయ వరినరాలు, రహదారులు, పార్కింగ్ ప్రాంతాల్లో నిరంతర పరిశుభ్రతను నిర్వహించాలని, తాత్కాలిక మరుగుదొడ్లు, చెత్త సేకరణ కేంద్రాలు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి శాఖ ఆలయానికి చేరుకునే ప్రధాన, అనుసంధాన రహదారులపై మరమ్మతులు చేపట్టి గుంతలు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గుట్ట కింద ఇద్దరు, గుట్ట పైన ముగ్గురు లైన్‌మెన్లను నిరంతరం విధుల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపడంతో పాటు, వేములవాడ నుంచి జగిత్యాలకు వెళ్లే బస్సుల్లో ఎనిమిది బస్సులను కొండగట్టు మీదుగా నడిపేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.అగ్నిమాపక శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకొని అవసరమైన అగ్నిమాపక వాహనాలు, పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.జిల్లా పౌర సంబంధాల శాఖ చందనోత్సవ మహోత్సవం, నిజరూప దర్శనాల విశిష్టతను ప్రజలకు తెలియజేసేలా విస్తృత ప్రచారం చేపట్టాలని, ఉత్సవాల తేదీలు, దర్శన సమయాలు, రవాణా, పార్కింగ్, భక్తులకు కల్పించనున్న సౌకర్యాల వివరాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.ప్రస్తుతం నిర్వహించిన సమావేశం చందనోత్సవ మహోత్సవ ఏర్పాట్లకు సంబంధించి ప్రాథమిక సమావేశం మాత్రమేనని కలెక్టర్ తెలిపారు. వచ్చే వారం ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించిన అనంతరం, క్షేత్రస్థాయిలో గుర్తించిన అవసరాలు, సమస్యలు, శాఖల వారీగా చేపట్టాల్సిన పనులపై మరో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.60 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ అరుదైన మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డిఓ మధు సుధన్, డి.ఎస్.పి కె పురుషోత్తం రెడ్డి ,కొండగట్టు ఈవో ఎస్ అంజనారెడ్డి ,డిపిఓ మదన్మోహన్, డిఎంహెచ్ఓ సుజాత, మిషన్ భగీరథ ,ఫైర్ అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల కట్టడికి పకడ్బందీ చర్యలు

అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

గంజాయి సాగుదారులకు సంక్షేమ పథకాలు బంద్

అన్ని శాఖల సమన్వయంతో కఠిన నిఘా



పెద్దపల్లి,అక్టోబర్ 31(ప్రజాకలం జిల్లా ప్రతినిధి): మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.సరదా కోసం కూడా ఎటువంటి మత్తు పదార్థాల వైపు వెళ్లవద్దని,ఒక్కసారి వీటికి బానిసైతే వ్యక్తిగత జీవితం,కుటుంబం,సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని అదనపు కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం,రవాణాపై నిరంతర నిఘా ఉండాలని స్పష్టం చేశారు.ఎక్కడైనా గంజాయి సాగు గుర్తిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు,నిబంధనల ప్రకారం వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్,ఎక్సైజ్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు.జిల్లాలో నమోదయ్యే ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పేర్కొన్నారు. విద్యాసంస్థలు,హాస్టళ్లు,రవాణా కేంద్రాల వద్ద క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడంతో పాటు,యువతకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారికి చికిత్స అందించేందుకు రామగుండం ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.అక్కడ చికిత్స పొందే బాధితుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.డ్రగ్స్ అక్రమ రవాణా,విక్రయాలపై సమాచారం ఉన్నవారు వెంటనే అధికారులకు తెలియజేయాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు సైతం రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమారస్వామి,జిల్లా పోలీస్,ఎక్సైజ్, వైద్యారోగ్య,విద్యా,వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేశ ఐక్యతకు పటేల్ సేవలు చిరస్మరణీయం

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం

- ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు



పెద్దపల్లి,అక్టోబర్ 31:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

స్వతంత్ర భారతదేశాన్ని సమైక్యంగా తీర్చిదిద్దిన ఘనత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కే దక్కుతుందని బీజేపీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం అన్నారు.జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి క్యాంపు కార్యాలయంలో పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం పల్లె సదానందం మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన క్లిష్ట సమయంలో 562 సంస్థానాలను ఎలాంటి రక్తపాతం లేకుండా భారత యూనియన్‌లో విలీనం చేసిన మహనీయుడు పటేల్ అని కొనియాడారు.ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తి చేసి దేశ సమగ్రతను కాపాడారని గుర్తుచేశారు.రైతు కుటుంబంలో జన్మించి,లండన్‌లో బారిస్టర్ విద్యను పూర్తి చేసి,గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు.బార్డోలి సత్యాగ్రహంలో రైతుల పక్షాన నిలిచి పోరాడినందుకే ఆయనకు సర్దార్ బిరుదు లభించిందని తెలిపారు.పటేల్ దేశభక్తికి నిదర్శనంగా గుజరాత్‌లోని నర్మదా నది తీరాన ఏర్పాటు చేసిన 182 మీటర్ల స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' నేడు ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహంగా నిలిచి భారత సమైక్యతను చాటుతోందన్నారు.ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శిలావేరు ఓదెలు,భూషణవేణి శ్రీనివాస్ గౌడ్,మౌటం నర్సింగం,మోర మనోహర్,రెవెల్లి సందీప్,కొమిరిశెట్టి రమేష్, ఉనుకొండ తిరుపతి,పల్లె ఓదెలు,కందునూరి ప్రమోద్,మోలుగురి రాజావీరు,ముస్త్యాల సంతోష్,నుద్దాల సతీష్,కొప్పుల శ్రీనివాస్,బండ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిది

- పదవీ విరమణ పొందిన తిరుపతి యాదవ్‌కు బీఎస్పీ సత్కారం




పెద్దపల్లి,అక్టోబర్ 31:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) సింగరేణి సంస్థ ఆర్జీ–3 ఏరియాలో సుదీర్ఘకాలం పాటు నిబద్ధతతో సేవలందించి శనివారం పదవీ విరమణ పొందిన ఉద్యోగి గోర్ల తిరుపతి యాదవ్‌ను బహుజన సమాజ్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తిరుపతి యాదవ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు ఇరుకుళ్ల రాజనర్సయ్య,నాయకులతో కలిసి తిరుపతి యాదవ్ దంపతులను శాలువాతో సత్కరించి,పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా అధ్యక్షులు ఇరుకుళ్ల రాజనర్సయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థ పురోగతిలో కార్మికుల శ్రమ ఎనలేనిదని,సంస్థ అభివృద్ధికి దశాబ్దాల పాటు నిస్వార్థ సేవలందించిన తిరుపతి యాదవ్ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.పదవీ విరమణ అనంతరం ఆయన తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో శేష జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.ఈ సన్మాన కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇంచార్జీలు జింక ఉదయ్,దామెర రాజేశం,రామగుండం నియోజకవర్గ అధ్యక్షులు జనగామ లింగయ్య,ప్రధాన కార్యదర్శి లేతకారి శ్యామ్,ఉపాధ్యక్షులు ఆరేపల్లి సంపత్,రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు జనగామ ఎల్లస్వామి లతో పాటు పలువురు ముఖ్య నాయకులు,కార్యకర్తలు,తిరుపతి యాదవ్ కుటుంబ సభ్యులు,శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ఘనంగా ఏక్తా దివస్ వేడుకలు

దేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి-గుండెపూడి గ్రామ సర్పంచ్ లకావత్ రవికుమార్

మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపూడి గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో జాతీయ ఐక్యతా దినోత్సవం (ఏక్తా దివస్) సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను గ్రామ సర్పంచ్ లకావత్ రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సర్పంచ్ లకావత్ రవికుమార్ మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశంలోని సంస్థానాలను ఏకం చేసి భారతదేశ సమైక్యతకు ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. దేశ ప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం ఉపేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమార్, పెద్దపులి లచ్చు, వడ్లకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేట నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి ముత్తు

అంబర్‌పేట, అక్టోబర్ 31 (ప్రజా కలం న్యూస్):

అంబర్‌పేట పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి ముత్తు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ కె. కిరణ్ కుమార్ నార్త్ రేంజ్ లా అండ్ ఆర్డర్ విభాగానికి బదిలీ కావడంతో, ఆయన స్థానంలో ముత్తు నియమితులయ్యారు.



అనుభవ జ్ఞుడైన అధికారి: 2004 బ్యాచ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి ముత్తుకు పోలీస్‌శాఖలోసుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆయన జూబ్లీహిల్స్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ)గా, సుల్తాన్ బజార్ ఎస్‌హెచ్‌ఓగా, ఫ్యూచర్ సిటీ స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బి)లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అంతేకాకుండా, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓగా కూడా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం: బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన ఎస్‌హెచ్‌ఓ కొత్తపల్లి ముత్తు మాట్లాడుతూ.. అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను కాపాడటానికే తాము మొదటి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణ, సంఘ విద్రోహ కార్యకలాపాల అణచివేత, ప్రజల భద్రత కోసం క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చిన ఆయన, పరిధిలోని కాలనీల నివాసితులు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- మాజీ ఫ్యాక్స్ చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్



(వరంగల్/ పర్వతగిరి)అక్టోబర్ 31, ప్రజాకలం ప్రతినిధి: పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామం లో బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆదేశాల మేరకు అన్నారం గ్రామంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ యం. మనోజ్ గౌడ్ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ, పట్టభద్రుల ఓటరు నమోదులో భాగంగా అన్నారం గ్రామంలో గాని, పర్వతగిరి మండలంలో వివిధ గ్రామాలల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సమిష్టిగా తిరుగుతూ డిగ్రీ చదువు పూర్తి ఐనా పట్టభద్రులను ఓటరుగా గుర్తించి వారిని స్వయంగా మీరే ఆన్లైన్ సెంటర్ వద్దకు తీసుకువెళ్లి పట్టభద్రుల ఓటరుగా నమోదు చేపించాలని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ మెంబర్ షబ్బీర్ అలీ, కర్ణాటక నర్సింగం, యం.డి పాషా, ముంజంపెల్లి యాకాంభ్రం, సముద్రాల వెంకన్న, గడ్డం యాకాంభ్రం, సోమరాపు రాజు, పస్తం సుధాకర్, తదితరులు పాల్గొనడం జరిగింది.

కల్లెడ గ్రామంలో నూతనంగా వారపు

అంగడి (సంత) ప్రారంభం

- కల్లెడ సర్పంచ్ తక్కెళ్ళపల్లి శ్రీనివాస్

(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 31, ప్రజాకలం ప్రతినిధి: పర్వతగిరి మండలం ప్రజలు, వ్యాపారులు, వినియోగదారుల సౌకర్యార్థం కల్లెడ గ్రామంలోని బైపాస్ రోడ్డు లో ఉన్న ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో నూతనంగా అంగడి (వారపు సంత)ను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ తక్కలపెల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ నూతన అంగడి (సంత) 05-11-2026 గురువారం ఉదయం కల్లెడ గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గం చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుందని, ఈ అంగడి (సంత) ప్రతి వారం గురువారం రోజున కొనసాగుతుందని తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ సందర్భముగా వ్యాపారం నిర్వహించుకునే అన్ని రాదార్లకు (వ్యాపారులకు) ఉచిత సౌకర్యం కల్పించడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. పర్వతగిరి మండల ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు, వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని కల్లెడ పంచాయతీ పాలకవర్గం కోరారు.



గర్మిళ్లపల్లిలో ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు

విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు

ఐనవోలు, అక్టోబర్ 31 (ప్రజాకలం ప్రతినిధి): భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం, ఐనవోలు మండలం గర్మిళ్లపల్లి గ్రామంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలను, దేశ అభివృద్ధి కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలను నాయకులు స్మరించుకున్నారు. ఆమె ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఐనవోలు దేవస్థానం డైరెక్టర్, పోటీ చేసిన వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని ఇందిరాగాంధీకి నివాళులర్పించారు.



ఎటపాక టీడీపీలో అనూహ్య పరిణామాలు!

సీనియర్ నాయకులు మువ్వా శ్రీను, దొంతు మంగేశ్వరావు సస్పెన్షన్

స్వతంత్ర జడ్పీటీసీ అభ్యర్థి పాయం దేవికి మద్దతు ఇస్తున్నారనే కారణంతో చర్యలు?

పార్టీ కోసం కుటుంబాన్ని సైతం పక్కనపెట్టిన నాయకులకు ఇదేనా గుర్తింపు? కార్యకర్తల్లో చర్చ



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, అక్టోబర్ 31

పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజక వర్గంలోని ఎటపాక మండల తెలుగుదేశం పార్టీలో అనూహ్య రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. జడ్పీటీసీ అభ్యర్థి ఎంపిక వ్యవహారం ఇప్పుడు పార్టీ అంతర్గత విభేదాలకు దారితీసింది. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన పాయం దేవికి మద్దతు ఇస్తున్నారనే కారణంతో టీడీపీ సీనియర్ నాయకులు మువ్వా శ్రీను, దొంతు మంగేశ్వరావులను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎటపాక మండల జడ్పీటీసీ స్థానానికి టీడీపీ తరఫున పాయం దేవి నామినేషన్ దాఖలు చేసి పార్టీ బీ ఫారం కోసం ఆశించారు. పాయం దేవి గతంలో తెలుగుదేశం పార్టీ తరఫున రెండుసార్లు ఎంపీటీసీగా గెలుపొందారు. మండలంలో రాజకీయంగా తనకంటూ గుర్తింపు, ప్రజల్లో పరిచయాలు ఉన్న నాయకురాలిగా ఆమెకు పేరుంది. అయితే పార్టీ అధిష్ఠానం జడ్పీటీసీ అభ్యర్థిగా మరో మహిళకు అవకాశం కల్పించడంతో వివాదం మొదలైంది. మాజీ జడ్పీటీసీ ఉబ్బా సుస్మిత తొలుత స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం జనసేన పార్టీలో చేరి కూటమి తరఫున జడ్పీటీసీ అభ్యర్థిగా బీ ఫారం పొందారు. అయితే నామినేషన్ పత్రాల్లో స్వతంత్ర అభ్యర్థిగా పేర్కొన్న కారణంగా ఎన్నికల అధికారులు ఆమెకు గాజు గుర్తు కేటాయించలేదని స్థానికంగా చర్చ జరుగుతోంది. మరోవైపు కూటమి తరఫున బీ ఫారం పొందిన ఉబ్బా సుస్మిత విజయానికి సహకరించాలని పార్టీ అధిష్ఠానం స్థానిక టీడీపీ నాయకులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. పార్టీ ఆదేశాల మేరకు పాయం దేవి తన నామినేషన్ ఉపసంహరించుకోవాలని సూచించినప్పటికీ ఆమె పోటీ నుంచి తప్పుకోకుండా స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. ఈ నేపథ్యంలో పాయం దేవికి మద్దతుగా నిలుస్తున్నారనే కారణంతో టీడీపీ సీనియర్ నాయకులు మువ్వా శ్రీను, దొంతు మంగేశ్వరావులపై పార్టీ సస్పెన్షన్ చర్యలు తీసుకుంది. ఈ పరిణామం ఎటపాక టీడీపీ శ్రేణుల్లో చర్చకు దారితీసింది.

పార్టీ కోసం కుటుంబాన్ని సైతం పక్కనపెట్టిన మువ్వా శ్రీను ఆవేదన

గత 30 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీని నమ్ముకొని పనిచేస్తున్నానని, పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేశానని మువ్వా శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం తన కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి పనిచేసిన తనకు ఎదురైన పరిస్థితులు బాధ కలిగిస్తున్నాయని మీడియా ముందు కన్నీటిపర్యంతమయ్యారు.

పార్టీ కార్యకర్తల మనోభావాలను గుర్తించరా?

పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడిన కార్యకర్తలు, నాయకుల మనోభావాలను కూడా అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోవాలని దొంతు మంగేశ్వరావు అభిప్రాయపడినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసిన నాయకులకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నారు.మొత్తంగా ఎటపాక జడ్పీటీసీ అభ్యర్థి ఎంపికతో ప్రారంభమైన వివాదం ఇద్దరు సీనియర్ నాయకుల సస్పెన్షన్ వరకు వెళ్లడం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. మూడు దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న నాయకులు, రెండుసార్లు ఎంపీటీసీగా గెలుపొందిన పాయం దేవి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవడం వంటి పరిణామాలు పార్టీ శ్రేణుల్లో చర్చకు కారణమవుతున్నాయి. ఈ వ్యవహారంపై టీడీపీ అధిష్ఠానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

'ఫౌండేషన్ ఆఫ్ ఫ్యూచర్ రెడీనెస్ ప్రోగ్రామ్' ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 31:

మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో 21వ శతాబ్దపు నైపుణ్యాలను అభివృద్ధి చేసి, భవిష్యత్ ఉపాధి అవకాశాలకు వారిని సంసిద్ధులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన 'ఫౌండేషన్ ఆఫ్ ఫ్యూచర్ రెడీనెస్ ప్రోగ్రామ్'ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేవలం విద్యాపరమైన మార్కులకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్, ఆర్థిక అక్షరాస్యత, సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, కెరీర్ ప్రణాళిక వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆమె సూచించారు.శనివారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు.జిల్లాలోని 26 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఇందులో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.ప్రధానోపాధ్యాయులు, 15 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో యంగ్ ఒరేటర్స్ క్లబ్ , థింక్ అండ్ మేక్ , స్వతఃు, ఫ్యూచర్ డాట్స్ వంటి నాలుగు ప్రధాన రంగాలకు సంబంధించిన నైపుణ్యాలను అభివృద్ధి చేయనున్నారు.

యంగ్ ఒరేటర్స్ క్లబ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల, మౌఖిక సంభాషణా నైపుణ్యాలు, వేదికపై ధైర్యంగా ప్రసంగించడం, భావ వ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందిస్తారు. ఈ కార్యక్రమానికి కీర్తన వేపా ప్రతినిధిగా వ్యవహరిస్తారు.

థింక్ అండ్ మేక్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనా విధానం, విమర్శనాత్మక ఆలోచన మరియు సమస్యలను స్వయంగా పరిష్కరించుకునే సామర్థ్యాలను అభివృద్ధి చేస్తారు. ఈ కార్యక్రమానికి నాగేష్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.

స్వతఃు కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, డబ్బు నిర్వహణ మరియు ఆర్థిక ప్రణాళికపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమానికి సంతోష్ దిన్నె మరియు యువరాజ్ నక్కార్ ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు.

ఫ్యూచర్ డాట్స్ కార్యక్రమం ద్వారా 9, 10వ తరగతుల విద్యార్థులకు వివిధ వృత్తులు, ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య మరియు భవిష్యత్ కెరీర్ ప్రణాళికపై మార్గదర్శకత్వం అందిస్తారు. ఈ కార్యక్రమానికి పవన్ కుమార్ కొల్లి, నిఖిల్ దాసరి ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక, సామాజిక మరియు ఉద్యోగ రంగాల్లో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం విద్యాపరమైన మార్కులు మాత్రమే విద్యార్థుల భవిష్యత్తును సరిపోవని, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆర్థిక అక్షరాస్యత, సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, కెరీర్ ప్రణాళిక వంటి జీవిత నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో స్థిరమైన ఉపాధి అవకాశాలను పొందాలంటే ఆధునిక ఉద్యోగ రంగ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 21వ శతాబ్దపు నైపుణ్యాలను అందించడం ప్రస్తుత కాలపు అత్యవసర అవసరమని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఒక చక్కని వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎ.ఎం.ఓ దుంకుడు శ్రీనివాస్, డి.ఎస్.ఓ షంషీర్, జి.సి.డి.ఓ అస్రా ఖాద్రి,ఎం.ఈ.ఓ ఉషారాణి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కె.జి.బి.వి ల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఐరన్ లేడీ ఇందిరాగాంధీకి కాంగ్రెస్ ఘన నివాళి

ఐనవోలులో వర్ధంతి కార్యక్రమం..నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



ఐనవోలు, అక్టోబర్ 31:-(ప్రజా కలం ప్రతినిధి)

భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఐనవోలు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఐనవోలు మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశ రాజకీయాల్లో ఆమె పోషించిన పాత్ర, ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశం కోసం ఆమె చేసిన త్యాగాలు, ధైర్యసాహసాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అయినవోలు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పోలేపల్లి శంకర్ రెడ్డి అయినవోలు గ్రామ ఉపసర్పంచ్ బరిగెల భాస్కర్ మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదికజిల్లా కమిటీ ఎన్నిక

హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమకారుడు చింత అశోక్ అయినవోలు గ్రామానికి దక్కిన గుర్తింపు.. నియామక ఉత్తర్వులు జారీ

ఐనవోలు, అక్టోబర్ 31 (ప్రజాకలం ప్రతినిధి):

తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఐనవోలు గ్రామానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు చింత అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ గుడిమళ్ల రవికుమార్ అక్టోబర్ 31న నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఉద్యమకారులు చేసిన పోరాటాలు, త్యాగాలను గుర్తిస్తూ వారి సంక్షేమం, హక్కుల సాధన కోసం తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో సంస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే బాధ్యతను చింత అశోక్‌కు అప్పగించారు.జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన చింత అశోక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. చింత అశోక్ నియామకం పట్ల ఐనవోలు గ్రామస్తులు, పలువురు ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

బాలకోటికి నివాళులర్పించిన పగడాల లచ్చిరెడ్డి



తల్లాడ అక్టోబర్ 31 ప్రజాక కలం న్యూస్ తల్లాడ మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన యల్లంకి బాలకోటి ఇటీవల మృతి చెందారు. శనివారం ఆయన దశదినకర్మ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, వైరా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పగడాల లచ్చిరెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ ఓబుల సీతారామిరెడ్డి, ఉప సర్పంచ్ బండి బాలశౌరి, గ్రామ పెద్దలు ఉన్నారు.

ముద్దునూరు, కలకోడిమ గ్రామాల్లో ఎల్ నినో గ్రామ సభలు.. ఎంపీడీవో శ్రీధర్ రాజు



తల్లాడ, అక్టోబర్ 31 (ప్రజా కలం న్యూస్): తల్లాడ మండలంలోని ముద్దునూరు, కలకోడిమ గ్రామ పంచాయతీల యందు శనివారం ఎల్ నినో పై ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించడం జరిగింది. ముద్దునూరు గ్రామ సభకు సర్పంచ్ యరమల రామ్ మోహన్ రెడ్డి, కలకోడిమ గ్రామ సభకు ఉప సర్పంచ్ మనుబోలు సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ ఎంపీడీఓ శ్రీధర్ రాజు, అగ్రికల్చర్ ఆఫీసర్ తాజుద్దీన్, కోటయ్య , పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ పాల్గొని ఎల్ నినో ప్రభావం, వాతావరణంలో వచ్చే మార్పులు, వ్యవసాయ రంగంపై దాని ప్రభావం మరియు రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దేశ సమైక్యత,సమగ్రతల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి- జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 31: దేశ సమైక్యత,సమగ్రతల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని లి జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు.జాతీయ ఐక్యత దినోత్సవాన్నిపురస్కరించుకొని శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నమామేశ మందిరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశాన్ని ఐకమత్యంగా ఉంచడంలో కృషిచేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి జాతీయ ఐక్యత దినోత్సవం గా నిర్వహించుకుంటున్నామని , దేశానికి దిశ,నిర్దేశం చేసిన ఆయన చిరస్మరణీయుడని అన్నారు.అనంతరం దేశ ఐకమత్యం,సమగ్రత,భద్రతను కాపాడటానికి స్వయంగా అంకిత మవుతానని,దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచడానికి స్వీయ తోడ్పాటు నందిస్తానని జిల్లా కలెక్టర్ అధికారులు,ఉద్యోగుల చే రాష్ట్రీయ ఏక్తా దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ,డి.ఆర్.ఓ ఏ.నిర్మల,జిల్లా అధికారులు,కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



అయినవోలు గౌడ సంఘం భూ వివాదంలో కొత్త మలుపు

సంఘం పేరుతో పదవులు పొంది సంఘాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నారు

గౌడ సంఘం పేరుతో పదవులు.. ఇప్పుడు సంఘం భూములపైనే కన్నా?

879, 880, 925 సర్వే నంబర్ల భూములపై వివాదం - వ్యక్తిగత పట్టాలుగా మార్చుకున్నారంటూ ఆరోపణలు.. ఆర్డీవోకు ఫిర్యాదు

ఐనవోలు, అక్టోబర్ 31 (ప్రజాకలం ప్రతినిధి):

గౌడ సంఘం పేరు చెప్పి నాయకులుగా ఎదిగి, సంఘం సభ్యుల మద్దతుతో పదవులు పొందిన కొందరు ఇప్పుడు అదే సంఘానికి చెందిన భూముల విషయంలో వివాదాలకు కేంద్రంగా మారుతున్నారనే ఆరోపణలు ఐనవోలు మండల కేంద్రంలో చర్చనీయాంశంగా మారాయి. సంఘం ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కలిగిన వారే వాటిపై వ్యక్తిగత హక్కులు పొందేందుకు ప్రయత్నిస్తున్నారనే ఫిర్యాదులు కలకలం రేపుతున్నాయి. మండల కేంద్రంలోని గౌడ సంఘానికి సంబంధించిన 879, 880, 925 సర్వే నంబర్లలోని భూముల వ్యవహారం తాజాగా మరోసారి తెరపైకి వచ్చింది. సంఘం పేరు, ప్రతిష్ఠను ఉపయోగించుకొని నాయకత్వ స్థానాలు పొందిన కొందరు వ్యక్తులు సంఘం భూములను తమ వ్యక్తిగత ప్రయోజనాలకు అనుగుణంగా మార్చుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంఘానికి చెందిన భూములు వ్యక్తిగత పట్టాలుగా మారడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

సంఘం భూములు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయా?

సంఘం ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత ఉన్నవారే వాటిని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. సంఘం సభ్యుల అనుమతి, తీర్మానాలు లేకుండానే భూముల విషయంలో నిర్ణయాలు తీసుకున్నారా? వ్యక్తిగత పట్టాలు ఎలా జారీ అయ్యాయి? వాటికి రెవెన్యూ అధికారులు ఏ ఆధారాలను పరిగణనలోకి తీసుకున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారుల విచారణ పక్కదారి పట్టించే ప్రయత్నమా?

భూముల అసలు పరిస్థితిని అధికారులకు పూర్తిస్థాయిలో వివరించకుండా, తమకు అనుకూలమైన సమాచారాన్ని మాత్రమే అందిస్తున్నారనే ఆరోపణలు ఫిర్యాదుదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. పాత రికార్డులు, భూముల హక్కులకు సంబంధించిన పత్రాలు, పట్టాల జారీ ప్రక్రియను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు పేర్కొంటున్నారు.

ఆర్డీవోకు ఫిర్యాదు.. సమగ్ర విచారణకు వినతి

ఈ వ్యవహారంపై కోట నిఖిల్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 879, 880, 925 సర్వే నంబర్లలోని భూములపై సమగ్ర విచారణ చేపట్టి, పాత రెవెన్యూ రికార్డులు, పట్టాల జారీకి సంబంధించిన దస్త్రాలు, సంఘం తీర్మానాలు, ఇతర ఆధారాలను పరిశీలించాలని కోరారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి భూముల వాస్తవ హక్కులను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.

సంఘం ఆస్తుల పరిరక్షణ బాధ్యత అధికారులదే!

సంఘం ఆస్తులు ఎవరి వ్యక్తిగత సొత్తు కాదని, అవి సమాజ ప్రయోజనాలకు ఉపయోగపడాల్సినవని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. సంఘం పేరు చెప్పి పదవులు పొందిన వారు సంఘం ఆస్తుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండగా, వివాదాలకు కారణమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి, తప్పు జరిగినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సంఘం భూములపై నెలకొన్న అనుమానాలకు తెరదించుతారా? అన్నది వేచి చూడాలి. ఈ కార్యక్రమంలో నకరకంటి మోహన్, కోట నర్సయ్య, నకరకంటి రవీందర్, బైరి వెంకటయ్య, గంగి ఎల్లయ్య, గాని మల్లేష్, మునిగాల మొగిలి, బొల్లెపెల్లి రమేష్, తిగల చంద్రశేఖర్, కోట నిఖిల్, బొల్లెపెల్లి రఘువర్మ, బొల్లెపెల్లి మధు, బొల్లెపెల్లి తిరుపతి, బొల్లెపెల్లి యాదగిరి, బొల్లెపెల్లి నర్సయ్య, బొల్లెపెల్లి సతీష్, నకరకంటి రమేష్, ఏ. అగపాటి ఉప్పలయ్య, తాళ్లపల్లి మల్లేశం, తిగల రాజు తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

వివక్ష లేని సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలి - తహసీల్దార్ విజయసాగర్



అక్టోబర్ 31(ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్/వర్ధన్నపేట)

సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సమానమేనని, కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ సమాన గౌరవంతో చూడాలని వర్ధన్నపేట తహసీల్దార్ విజయసాగర్ అన్నారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సమాజంలో వివక్ష, అసమానతలకు తావులేకుండా ప్రతి పౌరుడికి సమాన హక్కులు, గౌరవం కల్పించడమే ప్రజాస్వామ్య స్ఫూర్తి అని పేర్కొన్నారు. కులం, మతం, ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఎవరిపైనా వివక్ష చూపకూడదని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సమానత్వం అనేది కేవలం చట్టాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి ఆచరణలో ప్రతిఫలించినప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందన్నారు. వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆ లక్ష్యం నెరవేరాలంటే ప్రజల్లో సామాజిక బాధ్యతతో పాటు పరస్పర గౌరవ భావన పెరగాలని విజయసాగర్ పేర్కొన్నారు. తమ పౌర హక్కులను గౌరవిస్తూ, ఇతరుల హక్కులకు భంగం కలగకుండా వ్యవహరించడం ప్రతి పౌరుడి బాధ్యత అని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ చైర్మన్ బిర్రు మహేందర్ మాదిగ, వర్ధన్నపేట ఎస్సై భోగం ప్రవీణ్, ఎంపీఓ జుమ్మిలాల్, డీటీ బిక్కులాల్, సర్పంచ్ సాంబయ్య, కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, గడ్డం సమ్మయ్య, బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు మల్లెపాక రాకేష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి సట్ల అనిల్, వేల్పుల కార్తీక్, ఎంఆర్‌పీఎస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు తదితరులు

ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరు

టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి శ్రీమతి మాధురి



సత్తుపల్లి, అక్టోబర్ 31 (ప్రజా కలం న్యూస్): రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని చైర్మన్ ముప్పా విజయబాబు ఆధ్వర్యంలోసత్తుపల్లిలో నిర్వహించిన 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఆదినుంచి ఇరు జట్లు హోరాహోరీగా తలపడుతూ అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించాయి. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో రంగారెడ్డి జట్టుపై నల్గొండ మహిళా జట్టు విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. విజయం సాధించిన నల్గొండ జట్టు క్రీడాకారిణులకు అభినందనలు వెల్లువెత్తాయి. అనంతరం విజేతగా నిలిచిన నల్గొండ, రన్నరప్‌గా నిలిచిన రంగారెడ్డి జట్లకు పొంగులేటి ట్రోఫీలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్రీడాకారిణులను అభినందించి, మహిళలు క్రీడారంగంలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల మహిళా క్రీడాకారిణులకు తమ ప్రతిభను చాటుకునేందుకు గొప్ప వేదిక కల్పిస్తూ, ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రస్థాయి పోటీలను లిసత్తుపల్లిలో విజయవంతంగా నిర్వహించిన చైర్మన్ శ్రీ ముప్పా విజయబాబు గారి క్రీడా ప్రోత్సాహాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే శ్రీ జారె ఆదినారాయ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే శ్రీ తెల్లం వెంకటరావు, పినపాక ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు గారు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఖమ్మం డైరెక్టర్ శ్రీ తుళ్లూరి బ్రహ్మయ్య , పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కటికాల క్రిస్టఫర్ బాబు (స్టేట్ వైస్ ప్రెసిడెంట్ –ఖమ్మం జిల్లా సెక్రటరీ), కె. స్వాతిముత్యం (స్టేట్ జాయింట్ సెక్రటరీ – భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెక్రటరీ), చి. సుధాకర్ (ఖమ్మం జిల్లా జాయింట్ సెక్రటరీ), మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.డి. రహేన కమల్ పాషా , మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, చైర్మన్ దోమ ఆనంద్ గారు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుబ్బారెడ్డి గారు, పట్టణ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఖమ్మం మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, ముప్పా, మట్టా అభిమానులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో కంప్యూటర్ ఆపరేటర్‌దే పెత్తనమా?

- మున్సిపల్ పాలనపై సమగ్ర విచారణకు పట్టణ ప్రజల డిమాండ్!
- ప్రజా ప్రతినిధులు అధికారులకంటే కంప్యూటర్ ఆపేరాటరే కీలకమా?
- ఏ ప్రాతిపదికన నియామకం.. ఎవరికి జవాబుదారీతనం?
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులెన్ని? ఖర్చు చేసినదెంత?
- వార్డుల వారీగా అభివృద్ధి పనుల వివరాలు బహిర్గతం చేయాలి
- కంప్యూటర్ ఆపరేటర్ వ్యవహారశైలిపై ఉన్నతాధికారుల నిఘా అవసరం



అక్టోబర్ 31, ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ / వర్ధన్నపేట)

వర్ధన్నపేట మున్సిపాలిటీలో పరిపాలన వ్యవహారాలపై అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు సేవలందించాల్సిన మున్సిపల్ కార్యాలయంలో ఒక కంప్యూటర్ ఆపరేటర్ చుట్టూనే కీలక వ్యవహారాలు తిరుగుతున్నాయనే విమర్శలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి. మున్సిపల్ అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణలో ఉండగా కంప్యూటర్ ఆపరేటర్ జోక్యం ఎంతవరకు? ఆయనకు ఏ అధికారిక హోదా ఉంది? ఏ ప్రాతిపదికన నియామకం జరిగింది? విధులు, బాధ్యతలు ఏమిటి? అనే ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి.

ఆపరేటర్ చుట్టూనే కార్యాలయ వ్యవహారాలా?

మున్సిపాలిటీలో ఇంటి నిర్మాణ అనుమతులు, అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల మరమ్మతులు తదితర అంశాల్లో కంప్యూటర్ ఆపరేటర్ జోక్యం ఉంటోందని పలువురు పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏ పని కావాలన్నా ముందుగా సిస్టమ్ ఆపరేటర్‌ను సంప్రదించాల్సిన పరిస్థితి నెలకొందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల ఆదేశాలే అమలు కావాలా? లేక ఒక ఉద్యోగి సూచనలే కార్యాలయంలో ప్రాధాన్యత పొందుతున్నాయా? అన్నది ఉన్నతాధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ నిధుల లెక్కలు ఎక్కడ?

రాష్ట్ర ప్రభుత్వం నుంచి వర్ధన్నపేట మున్సిపాలిటీకి 2026 ఆర్థిక సంవత్సరంలో వివిధ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కింద ఎన్ని నిధులు మంజూరయ్యాయి? ఏయే శాఖల నుంచి ఎంత మొత్తం విడుదలైంది? ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు? ఇంకా ఎంత నిధులు మిగిలి ఉన్నాయి? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలనే డిమాండ్ వినిపిస్తోంది. వార్డుల వారీగా మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, వాటి అంచనా వ్యయం, కాంట్రాక్టర్ల వివరాలు, పనుల ప్రస్తుత స్థితిగతులను బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యత లేని పనులపై విచారణ ఏదీ?

పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్య పనులు, వీధి దీపాల ఏర్పాటు, మరమ్మతుల కోసం కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగిస్తున్నారా? క్షేత్రస్థాయిలో పనులు పూర్తయ్యాయా? నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. కాగితాలపై చూపిస్తున్న పనులకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న అభివృద్ధికి మధ్య వ్యత్యాసం ఉందా? అన్న కోణంలోనూ పరిశీలన జరగాలని పట్టణవాసులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డు నుంచి వీధి దీపాల వరకు..

పట్టణంలోని చెత్త సేకరణ, తరలింపు, డంపింగ్ చేసే ప్రాంతాల ఎంపిక, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాల్లోనూ అధికారిక విధానాల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏ కాలనీలో ఎన్ని వీధి దీపాలు ఏర్పాటు చేశారు? ఎక్కడ మరమ్మతులు చేపట్టారు? ఎన్ని ఫిర్యాదులు పరిష్కరించారు? అనే వివరాలను వార్డుల వారీగా వెల్లడించాల్సిన బాధ్యత మున్సిపల్ యంత్రాంగంపై ఉంది.

పర్మనెంట్ చైర్మన్ లేకపోవడం సమస్యగా మారిందా?

మున్సిపాలిటీ ఏర్పాటైనప్పటి నుంచి పూర్తిస్థాయి రాజకీయ నాయకత్వం, పరిపాలనా పర్యవేక్షణ విషయంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కార్యాలయ నిర్వహణపై మరింత పారదర్శకత అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తమ పరిధిలోని బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారా? ఉద్యోగుల విధులపై పర్యవేక్షణ ఉందా? అనే అంశాలపై కూడా సమీక్ష జరగాల్సి ఉంది.

కలెక్టర్ స్పందించాలి.. నిధుల లెక్కలు బయటపెట్టాలి!

వర్ధన్నపేట మున్సిపాలిటీలో కంప్యూటర్ ఆపరేటర్ నియామక ప్రక్రియ, అర్హతలు, విధుల కేటాయింపు, అధికార పరిధి, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పాత్ర, పనుల ఆమోద ప్రక్రియ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మున్సిపాలిటీకి విడుదలైన ప్రతి రూపాయి ఎక్కడ, ఏ పనికి, ఎవరి ఆమోదంతో ఖర్చు చేశారో రికార్డుల ఆధారంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే ప్రత్యేక ఆడిట్ నిర్వహించి, వార్డుల వారీగా నిధుల కేటాయింపులు, ఖర్చుల వివరాలు, బిల్లులు, పనుల అంచనాలు, నాణ్యతా నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేకుంటే వాస్తవాలను అధికారికంగా వెల్లడించి ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పది రోజుల శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం,

క్రమశిక్షణ పెంపొందించాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లియెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 31:

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే అద్భుతమైన ఫలితాలు సాధిస్తారని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. NMMS స్కాలర్‌షిప్ పరీక్షకు సిద్ధం చేసేందుకు నిర్వహించిన పది రోజుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు ఈ శిబిరం మంచి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ శిబిరంలో మొత్తం 190 మంది విద్యార్థులు శిక్షణ పొందారని, ప్రారంభంలో కొత్త వాతావరణానికి అలవాటు పడటంలో కొంతమంది ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, పది రోజుల్లోనే ఎంతో ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. రోజుకు దాదాపు 12 నుంచి 14 గంటలపాటు చదువుతూ పరీక్షకు సిద్ధమయ్యారని చెప్పారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 71 NMMS స్కాలర్‌షిప్‌లు సాధించగా, వాటిలో 60 ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకే రావడం విశేషమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈసారి కూడా మంచి ఫలితాలు వస్తాయని, గత ఏడాది కంటే మెరుగైన విజయాలు సాధిస్తారనే నమ్మకం ఉందని అన్నారు. గణితం, మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాల్లో అందించిన శిక్షణ భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్, గ్రూప్స్, బ్యాంకింగ్, రైల్వే తదితర పోటీ పరీక్షలకుఉపయోగపడుతుందని తెలిపారు. చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందిస్తే ఉన్నత లక్ష్యాలను సాధించగలరని పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సమయపాలన, క్రమశిక్షణ, మంచి అలవాట్లు, సమిష్టిగా చదువుకునే విధానాన్ని కూడా అలవాటు చేసినట్లు తెలిపారు. ఉదయం ఐదు నుంచి ఐదున్నర గంటలకే నిద్రలేచి చదువుకోవడం వంటి అలవాట్లు వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఎనిమిదో తరగతి నుంచే క్రమబద్ధంగా చదివితే పదో తరగతిలోనూ మంచి మార్కులు సాధించవచ్చని చెప్పారు. ఈ శిబిరం విజయవంతం కావడంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ ప్రతినిధి గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్, సమన్వయకర్త రవీందర్ రెడ్డి తో పాటు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించారని ఆయన అభినందించారు. తమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూనే అదనపు సమయాన్ని కేటాయించి విద్యార్థులకు శిక్షణ అందించిన ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయమన్నారు. జిల్లా విద్యాశాఖ అందించిన సహకారాన్ని ఆయన అభినందించారు.

ఏఎంఓ శ్రీనివాస్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని పర్యవేక్షించారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత విజయాలు సాధిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ తమ తల్లిదండ్రులకు, గురువులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ లలితాంబికా తపోవనం ఆలయ చైర్మన్ జి.భాస్కర్, నాయకులు మైత్రి యాదయ్య, జాజి మొగ్గ నర్సింహులు, పీఆర్టీయు జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ యాదవ్, కార్యదర్శి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఓటు చోరీ'పై వర్ధన్నపేట కాంగ్రెస్ నాయకుల పోరుబాట!

- సీఈసీ జ్ఞానేష్ కుమార్ జవాబుదారీ వహించాలి: -వర్ధన్నపేట కాంగ్రెస్ నినాదం
- రాహుల్, ఖర్గే పిలుపుతో ఢిల్లీకి ప్రయాణమైన పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్
- రేపు రాంలీల మైదానంలో ప్రజా గొంతుక వినిపించేందుకు సమాయత్తం

అక్టోబర్ 31 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్/వర్ధన్నపేట)

దేశవ్యాప్తంగా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (యస్ ఐ ఆర్) ప్రక్రియ పేరిట కోటికి పైగా అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉద్యమ బాట పట్టాయి. ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పిలుపు మేరకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ఆశీస్సులతో, వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈగ దామోదర్ హస్తిన బాట పట్టారు. నవంబర్ 1న ఢిల్లీ వేదికగా జరిగే భారీ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వర్ధన్నపేట పట్టణం నుండి ఢిల్లీకి బయలుదేరారు.

ఓటర్ల తొలగింపుపై సీఈసీ భారాన్ని వహించాలి!

ఢిల్లీకి బయలుదేరే ముందు వర్ధన్నపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్య మూలాలను దెబ్బతీసేలా ఎలక్షన్ కమిషన్ వ్యవరిస్తోందని మండిపడ్డారు. ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఓటర్ల అక్రమ తొలగింపుపై పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసే విధంగా సాగుతున్న సర్ ప్రక్రియను తక్షణమే ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు.



రాంలీల మైదానంలో గర్జించనున్న ప్రజా గొంతుక!

రేపు ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీల మైదానంలో జరగబోయే నిరసన మహాసభలో దేశ నలుమూలల నుంచి వచ్చిన ప్రజా గొంతుకలు బలంగా వినిపిస్తాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల తరపున ప్రజాస్వామ్య రక్షణకై దామోదర్ ఢిల్లీలో తమ గొంతుకను వినిపించి రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపును విజయవంతం చేయాలని కోరారు. ఈగ దామోదర్ ఢిల్లీ ప్రయాణం సురక్షితంగా సాగాలని, ఓటు చోరీపై సాగిస్తున్న ఈ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ శ్రేణులు మనసారా ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

తల్లాడ దర్గా వద్ద పూజలు చేసిన గౌడ సంఘం నాయకులు..



తల్లాడ అక్టోబర్ 31 ప్రజా కలం న్యూస్ తల్లాడ పట్టణంలోని పాత వెలుగు ఆఫీస్ సమీపంలో ఉన్న ముస్లింల దర్గా వద్ద గౌడ సంఘం నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గౌడ సోదరులు ప్రత్యేక వస్త్రాలు ధరించి దర్గాలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం ముజావర్ షేక్ ఈసూబ్ హర్షం వ్యక్తం చేశారు. హిందూ ,ముస్లిం భాయి భాయి అనే పదానికి నిదర్శనంగా మతసామరస్యాన్ని కాపాడటం అభినందనీయమని ఆయన అన్నారు. తొలుత స్థానిక కాటమయ్య దేవాలయంతో పాటు తల్లాడలో ఉన్న పలు దేవాలయాల్లో వారు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం నాయకులు మొక్క బసవయ్య, సున్నం తిరుపతిరావు, బొడ్డు రామ్ లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు, మొక్క సైదులు, సమ్మెట రామకృష్ణ, ఇజ్జగాని గోవిందరావు, మొక్క తిరుపతిరావు, గుండ్ల శీను, , బొడ్డు శీను, మొక్క కృష్ణ అర్జున్, పెరిక అయ్యప్ప, గుండ్ల రాఘవ మొక్కసత్యనారాయణ. మొక్క సత్యం. సున్నం నరసారావు,గుండ్ల సత్తి,సున్నం రవికుమార్, సున్నం హరీష్,మొక్క రవి,తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరా గాంధీకి ఘన నివాళులు



పాలేరు అక్టోబర్ 31(ప్రజా కలం న్యూస్) కూసుమంచి మండల కేంద్రంలోనిభారతరత్న, ఉక్కు మహిళ, భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ శ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామ పాఠశాలను సందర్శించిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి

పాలేరు అక్టోబర్ 31(ప్రజా కలం న్యూస్) రాజుపేట తన స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి సందర్శించి, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి చాక్లెట్లు పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, ప్రతి ఇంటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా గ్రామస్తులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రతిరోజూ గంటపాటు వ్యాయామం లేదా క్రీడలు ఆడాలి: మున్సిపల్ చైర్మన్ తీగల సురేందర్

క్రీడలతో క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవడతాయి: వైస్ చైర్మన్ బాదం రమేష్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 31(ప్రజాకలం):చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ తీగల సురేందర్ విద్యార్థులకు సూచించారు.



శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో నిర్వహించిన 70వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీలు ముగిశాయి. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తీగల సురేందర్, వైస్ చైర్మన్ బాదం రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ తీగల సురేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం గంటపాటు వ్యాయామం చేయాలని లేదా ఏదైనా క్రీడలో పాల్గొనాలని సూచించారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదిగి ఉమ్మడి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వైస్ చైర్మన్ బాదం రమేష్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ, పట్టుదల, మంచి అలవాట్లు అలవడతాయని, చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు.అనంతరం ఉప్పునుంతల మండలానికి చెందిన క్రీడాకారులను వారు ప్రత్యేకంగా పరిచయం చేసుకున్నారు. క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ జక్కా రాజు, కౌన్సిలర్ పద్మ, మాజీ కౌన్సిలర్లు పాండు చారి, తిరుమల యాదవ్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగేశ్వరరావు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటయ్య, అసిస్టెంట్ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, సామా రమేష్, వెంకటేష్, రమేష్, కృష్ణ, డాక్య, మోహన్‌లాల్, మని, స్వరూప, బొమ్మల భారతి, తులసి, అనిత, సరోజ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ ఎంపీ వద్దిరాజు

ఖమ్మం అక్టోబర్ 31(ప్రజా కలం న్యూస్)

రాష్ట్రంలో పాలనను పూర్తిగా గాలికొదిలేసి ముఖ్యమంత్రి, మంత్రులు,అధికార పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,నాయకులంతా ఢిల్లీలో తిష్ట వేశారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నిశితంగా విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీటికిమాటికి ఢిల్లీ బాటపడుతున్నారని,90 సార్లు వెళ్లారని, మంత్రులు ఆయనతో పాటు అక్కడే ఉన్నారని,దీంతో రాష్ట్రంలో ప్రభుత్వ పాలన పూర్తిగా కుంటుపడిందన్నారు.ఖమ్మం తెలంగాణ భవన్ లో ఎంపీ రవిచంద్ర శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, తక్కళ్లపల్లి రవీందర్ రావు తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.రేవంత్ రెడ్డి తన 34 నెలల పాలనలో చేసిందేమీ లేదని, ఢిల్లీ నుంచి నయా పైసా నిధులు కూడా మంజూరు చేయించలేదని, చెప్పుకునేందుకు ఒక మంచి పని కూడా లేదని ఎంపీ రవిచంద్ర దుయ్యబట్టారు. బూటకపు వాగ్దానాలు చేయడం, అబద్ధాలు చెప్పడం, ప్రధాన ప్రతిపక్షంపై తప్పుడు ప్రచారం చేయడం,పోలీసులను, మీడియాను వాడుకుంటూ "డైవర్షన్ పాలిటిక్స్"చేయడం తప్ప ముఖ్యమంత్రి ఒరగబెట్టిందేమీ లేదన్నారు.మియాపూర్ లోని 550 ఎకరాలు అన్యాక్రాంతం కాకుండా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయవాది వైద్యనాథన్ ను పెట్టి కాపాడడం జరిగిందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.కోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఆ భూమున్ని అమ్మకానికి పెడుతూ ముఖ్యమంత్రి తన బినామీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.భవిష్యత్ తరాల వారి సామాజిక ప్రయోజనాలకు లేకుండా హైదరాబాద్ నగరం,దాని చుట్టూ ఉన్న విలువైన భూమున్ని అమ్మడం తీవ్ర అభ్యంతరకరం అని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు,అధికార పార్టీ ఎమ్మెల్యేలు భూమున్ని ఆక్రమించుకుంటూ,రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా మారి రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీ కోసం కేసీఆర్ భూములను సేకరించి పెడితే ఫ్యూచర్ సిటీ అంటూ రేవంత్ రెడ్డి ఆగమాగం చేస్తున్నారన్నారు.మహానేత



కేసీఆర్ దూరదృష్టితో కాళేశ్వరం బహుళ దశ ప్రాజెక్టును నిర్మించి చెరువులు,కుంటల్ని నీళ్లతో నింపి, భూగర్భ జలాల మట్టాలను పెంచడం ద్వారా పంటలు సమృద్ధిగా పండేలా రాష్ట్రాన్ని ఆకుపచ్చగా తీర్చిదిద్దారని ఎంపీ రవిచంద్ర వివరించారు.కాళేశ్వరం ప్రాజెక్టులో ఒకటి రెండు పిల్లర్లు కుంగిపోలేదని,బాస్టింగ్ చేసినట్లుగా ప్రజలు అనుమానిస్తున్నారని.. అయితే వాటిని మరమ్మతులు చేయకుండా రేవంత్ రెడ్డి తీవ్ర నిర్లక్ష్యం దుర్మార్గమన్నారు.డ్యామ్ సేఫ్టీ ఉన్నతాధికారులు చెప్పినా కూడా వినకుండా గోదావరి జలాలను ఒడిసిపట్టకుండా కిందికి వదిలేసి ముఖ్యమంత్రి తన గురువు చంద్రబాబుకు గురుదక్షణ చెల్లించుకున్నారని ఎంపీ రవిచంద్ర దుయ్యబట్టారు.ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని తెలిసి కూడా కేసీఆర్ పై కక్షపూరిత వైఖరితో ఈవిధంగా సుమారు 800 టీఏంసీల నీళ్లు కిందకు వదిలిపెట్టడం బాధాకరమన్నారు.సింగరేణిపై శ్రద్ధ లేదు,విద్యుదుత్పత్తి పెంచాలనే,బీడు భూములకు నీళ్లివ్వాలనే, కరెంట్ సరఫరా అందించాలనే,రైతులకు మంచి చేయాలనే ధ్యాస లేదని ఎంపీ రవిచంద్ర కాంగ్రెస్ పాలకులపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో తీవ్ర కరువు కాటకాలు నెలకొన్నప్పటికీ,ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీలో తిష్ట వేసి ఉండడం అభ్యంతరకరమని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానించారు.పాలకుల వ్యవహారశైలిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని,ఏ ఎన్నికలు జరిగినా కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమని, రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించడం తథ్యమని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు గుండాల కృష్ణ,రాకేష్ రెడ్డి,ఉప్పల వెంకటరమణ, నరేందర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా అగ్రిస్టాక్ టాస్క్‌ఫోర్స్ కమిటీ పనిచేయాలి



- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అక్టోబర్ 31 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని జిల్లా స్థాయి అగ్రిస్టాక్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమన్వయంతో, సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అగ్రిస్టాక్ టాస్క్ ఫోర్స్ కమిటీతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో డిజిటల్ విధానాలను అమలు చేస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు అర్హులైన రైతులందరికీ పారదర్శకంగా అందేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖకు సమాచారం, గణాంకాల నిర్వహణ ఎంతో కీలకమని, అందువల్ల వ్యవసాయ సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి, ఖచ్చితత్వంతో డేటాను నిర్వహించాలని సూచించారు. అగ్రిస్టాక్ ద్వారా వ్యవసాయ రంగంలో డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవరావు, రాథోడ్ రమేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుజాత, ఉద్యానవన శాఖ అధికారి రమణ, డీఆర్డీఓ విజయలక్ష్మి, సీపీఓ గంగారెడ్డి, డీసీఎస్ఓ రాజేందర్, డీవీఏహెచ్ఓ సురేష్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, ఎల్డీఎం రామ్ గోపాల్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

- గడువులోగా భూముల రీ సర్వే పూర్తి చేసేలా ప్రణాళికలు అమలు చేయాలి: - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అక్టోబర్ 31(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు, భూముల రీ సర్వే, ఇతర రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జరిమానాలు విధించి, వాహనాలు జప్తు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకూడదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు కేవలం టిజిఎండిసి లేదా మన ఇసుక వాహనం యాప్ ద్వారా మాత్రమే ఇసుక పొందాలని తెలిపారు.

భూముల రీ సర్వే వివరాలను మండలాల వారీగా సమీక్షించారు. జిల్లాలో 19 మండలాలకు 21 సర్వే పరికరాలు (రోవర్లు) ఉన్నాయని, స్పష్టమైన ప్రణాళికలతో గడువులోగా రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాకు మరిన్ని సర్వే యంత్రాలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రతి సర్వే సిబ్బందికి టోపీ, తాగునీరు, ఓఆర్ఎస్ పొట్లాలతో కూడిన కిట్ లను అందించాలని తెలిపారు.



ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తానూర్ విద్యార్థి కృష్ణ ఎంపిక

400 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం సాధించి సత్తా చాటిన కృష్ణ

తానూర్, అక్టోబర్ 31 (ప్రజా కలం): అథ్లెటిక్స్ పోటీల్లో మండల కేంద్రమైన తానూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సీ.హెచ్. కృష్ణ ప్రతిభ చాటాడు. ఆదిలాబాద్‌లోని ఐపి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహించిన జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-19 విభాగం 400 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కృష్ణ సాధించిన విజయంతో కళాశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రవికిరణ్, అధ్యాపక బృందం, పోటీల నిర్వాహకులు విద్యార్థిని అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఇదే ఉత్సాహంతో రాణించి కళాశాలకు, తానూర్ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



పరుగులో.. పతకాలలో మోడల్ స్కూల్ జోరు!

పీఎం శ్రీ జిల్లాస్థాయి క్రీడోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ

మెడల్స్ సాధించిన విజేతలకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల అభినందనలు



మల్హర్, అక్టోబర్ 31 ప్రజాకలం ప్రతినిధి..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన పీఎం శ్రీ జిల్లాస్థాయి క్రీడోత్సవాలు-2026లో మల్హర్ మండలం ఎడ్లపల్లి ఆదర్శ మోడల్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. పలు విభాగాల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు.అండర్-17 అథ్లెటిక్స్‌లో కే. సాయి, 100 మీటర్ల పరుగులో యశస్విని గోల్డ్ మెడల్స్ సాధించారు. 100 మీటర్ల పరుగులో తేజస్విని, బాలికల లాంగ్‌జంప్‌లో యశస్విని, అండర్-17 కబడ్డీ, అండర్-14 బాలుర లాంగ్‌జంప్‌లో రామ్ చరణ్, అండర్-17 షాట్‌పుట్‌లో గణేష్ సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. విజేతలను పాఠశాల ప్రిన్సిపాల్ పూర్ణచందర్‌రావు, ఉపాధ్యాయ బృందం, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

బియ్యం ధరల నియంత్రణకు తహసీల్దార్లు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా ప్రతినిధి అక్టోబర్ 31: ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయించే వ్యాపారులపై నిఘా ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. అన్ని రిటైల్, హోల్‌సేల్ దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులతో కలిసి తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె బియ్యం ధరల నియంత్రణ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం సరఫరాపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత నెల వరకు కిలో బియ్యం ధర రూ.55 నుంచి రూ.60 వరకు ఉండగా, ప్రస్తుతం సూపర్ మార్కెట్లలో సైతం రూ.85 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నట్లు అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ధరల పెరుగుదలతో వినియోగదారులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం బియ్యం రకాలను బట్టి గరిష్ఠ విక్రయ ధరలను నిర్దేశించిందన్నారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బీపీటీ/కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్/తెలంగాణ సోనా రకం రూ.74, హెచ్ఎంటీ/జేఎస్ఆర్ రకం రూ.79కు మించి విక్రయించరాదని స్పష్టం చేశారు. ఈ ధరలకు సంబంధించిన ఫ్లెక్సీలను రైస్ మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్లు తమ పరిధిలోని వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని దుకాణాల్లో ధరల పట్టికలను వినియోగదారులకు కనిపించేలా ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం పక్కదారి పట్టే అవకాశాలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. రేషన్ డీలర్లు బియ్యం పంపిణీలో ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా కఠిన నిఘా ఏర్పాటు చేయాలని, క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రేషన్ కార్డుదారులకు, వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఉద్దేశించిన విధంగా సన్నబియ్యం సరఫరా జరిగేలా చూడాలన్నారు.రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించినా, లబ్ధిదారులకు తక్కువ పరిమాణంలో పంపిణీ చేసినా సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే రేషన్ దుకాణాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.బియ్యం ధరల నియంత్రణ, అక్రమ నిల్వలు, బియ్యాన్ని పక్కదారి పట్టించే చర్యలపై నిరంతర నిఘా ఉంచాలని, వ్యాపారులు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, , డి.సి.ఎస్.ఓ గంప శ్రీనివాస్, డి.ఎం రవి నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అనుప్రియ, క్రిస్టినా, తహసీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అడుగడుగునా సమస్యలే

-పెచ్చులూడుతున్న పైకప్పులు.. కనీస వసతుల కరువు



తానూర్ ,అక్టోబర్ 31(ప్రజా కలం): మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది, పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ఆసుపత్రిలో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి, ఒకవైపు వైద్య సిబ్బంది కొరత, మరోవైపు శిథిలావస్థకు చేరిన భవనం, ఇంకోవైపు మరుగుదొడ్లు, డ్రైనేజీ వంటి సౌకర్యాల లేమితో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, వైద్యం కోసం ఆసుపత్రికి వస్తున్న ప్రజలకు భవనం పరిస్థితి భయాందోళన కలిగిస్తోంది, పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతుండటంతో రోగులు, వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నాలుగు మండలాలకు ప్రధాన వైద్య కేంద్రం

గతంలో ముథోల్, లోకేశ్వరం, బాసర, తానూర్ మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ముథోల్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రత్యేక గుర్తింపు పొందింది, ఈ నాలుగు మండలాల ప్రజలకు ప్రధాన వైద్య కేంద్రంగా సేవలందించిన ఘనత ఈ ఆసుపత్రికి ఉంది, అనేక మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఆసుపత్రే ప్రధాన ఆధారంగా ఉండేది, అయితే కాలక్రమేణా రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా భవనం, వైద్య సిబ్బంది, మౌలిక సదుపాయాలు పెరగకపోవడంతో ప్రస్తుతం ఆసుపత్రి అనేక సమస్యలను ఎదుర్కొంటోంది.

వైద్య సేవల్లో ముందంజ.. రక్త పరీక్షల్లో జిల్లాలో రెండో స్థానం...గత తొమ్మిది నెలల కాలంలో ముథోల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు 51 వేల మంది రోగులకు వైద్య చికిత్సలు అందించడం విశేషం, అంతేకాకుండా వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించడంలో జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలవడం ఆసుపత్రి సేవలకు నిదర్శనంగా నిలుస్తోంది, పరిమిత సౌకర్యాలు, సిబ్బంది కొరత ఉన్నప్పటికీ వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలు ప్రశంసనీయంగా ఉన్నాయి, అయితే ఇంతటి సేవలు అందిస్తున్న ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంది.

ఐదు దశాబ్దాల చరిత్ర.. పెరగని సౌకర్యాలు...

1974లో సామాజిక ఆసుపత్రిగా నిర్మించిన ఈ ఆసుపత్రిని 2022లో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోకి మార్చారు, ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆసుపత్రిలో రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా భవనం, వైద్య సిబ్బంది, మౌలిక సదుపాయాలు మాత్రం పెరగడం లేదు.

సగం పోస్టులు ఖాళీ.. సిబ్బందిపై పనిభారం...

ఆసుపత్రిలో మొత్తం 33 పోస్టులకు గాను 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి, అసిస్టెంట్ సర్జన్, ఫిజీషియన్, గైనకాలజిస్ట్ 2, అనస్థీషియా నిపుణులు, పిల్లల వైద్య నిపుణుడు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్ల పోస్టులు భర్తీ చేశారు, అయితే అవసరమైన వైద్య పరికరాలు, ఇతర సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో కొంతమంది సిబ్బందిని డిప్యూటేషన్‌పై భైంసా ఆసుపత్రికి పంపినట్లు సమాచారం, దీంతో అందుబాటులో ఉన్న సిబ్బందిపై అదనపు పనిభారం పడుతోంది.

మరుగుదొడ్లు లేవు.. డ్రైనేజీ సమస్య...

ఆసుపత్రిలో పురుషులు, మహిళా రోగులకు సరిపడా మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు,డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి,రాత్రి వేళల్లో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది విశ్రాంతి తీసుకోవడానికి ఒకే గది ఉండటంతో సమస్యలు తప్పడం లేదు.

రోగుల మధ్యే పెచ్చులూడుతున్న పైకప్పు...

ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి, ఇటీవల రోగులు చికిత్స పొందుతున్న సమయంలోనే పెచ్చులు ఊడిపడటంతో ప్రమాదం చోటుచేసుకుంది, అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది, మరోవైపు అవుట్ పేషెంట్లకు వైద్య సేవలు అందించేందుకు సరిపడా గదులు లేక ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు విధులు.నిర్వహించాల్సి వస్తోంది.

పోస్టుమార్టం గదిలోనూ సౌకర్యాల కొరత...

ఆసుపత్రిలో పోస్టుమార్టం గదిని ఏర్పాటు చేసినప్పటికీ మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్, సహాయక సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి,రాత్రి వేళల్లో ఆనువత్రి వరినరాల్లో వినరాల్లు సంచరిస్తుండటంతో వైద్య సిబ్బంది, రోగులు భయాందోళనకు గురవుతున్నారు.

నూతన భవనం కోసం ఎదురుచూపులు...

నాలుగు మండలాల ప్రజలకు ఒకప్పుడు ప్రధాన వైద్య కేంద్రంగా నిలిచిన ముథోల్ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రస్తుతం అన్ని సౌకర్యాలతో కూడిన నూతన భవనం అవసరం ఎంతైనా ఉంది,ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు అవసరమైన వైద్య పరికరాలు, మరుగుదొడ్లు, డ్రైనేజీ, సిబ్బందికి విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి, శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో ఆధునిక వైద్య సదుపాయాలతో నూతన ఆసుపత్రిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆసుపత్రి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

నవంబర్ 30న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితా ప్రచురణ : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం జిల్లాలో 1,75,275 మంది ఓటర్ల విచారణ పూర్తి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటి వరకు 73,898 దరఖాస్తుల స్వీకరణ

సర్ 2026 , పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, అక్టోబర్ 31(ప్రజా కలం న్యూస్)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ 2026 షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం సవరించిందని కలెక్టర్ తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం నోటీసుల పరిష్కారం, విచారణలు, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియను నవంబర్ 26వ తేదీలోగా పూర్తి చేయాలని, నవంబర్ 30వ తేదీన తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 1,75,841 నోటీసులు జారీ చేయగా, వాటిలో 1,75,629 నోటీసులను ఓటర్లకు అందజేశామని కలెక్టర్ వివరించారు. మొత్తం 1,75,275 మంది ఓటర్ల విచారణ పూర్తయిందని, వీరిలో 1,74,838 మందిని తుది జాబితాలో అర్హులైన ఓటర్లుగా చేర్చేందుకు క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. వివిధ కారణాల వల్ల 1,006 మంది ఓటర్లు అర్హులు కాదని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 లకు సంబంధించి మొత్తం 3,080 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గత 2024 ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 83,879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు 73,898 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి నమోదును మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి అర్హులైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలంటే తాజాగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. 25 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి, గడువు లోగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా ముసాయిదాను నవంబర్ 25, 2026న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. డిసెంబర్ 25, 2026లోగా వాటిని పరిష్కరించి, డిసెంబర్ 30, 2026న తుది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రచురించ నున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పీ. శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, బీజేపీ పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్వి ప్రతినిధి ఎల్. సురేష్ బాబు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టీఆర్ కృష్ణప్రసాద్, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రాజయ్య, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో విద్యార్థి మృతి

బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది - పగడాల నాగరాజు

అజయ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి

ఖమ్మం అక్టోబర్ 31(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘునాథపాలెం మండలం గణేష్‌పాడు గ్రామానికి చెందిన 17 ఏళ్ల అజయ్ బీసీ హాస్టల్‌లో ఉంటూ డీఎంఎల్‌టీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అక్టోబర్ 30న సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో బాత్‌రూమ్‌కు వెళ్లిన అజయ్ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో హాస్టల్ సిబ్బంది తలుపు కొట్టినట్లు, తలుపు తెరుచుకోకపోవడంతో దానిని పగలగొట్టి అజయ్‌ను బయటకు తీసి ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు

అయితే అజయ్ మృతి అనుమానాస్పదంగా ఉందని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. మార్చురీ వద్ద బైఠాయించి అజయ్ కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని నినాదాలు చేశారు.

ఈ విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని బీఆర్ఎస్ నాయకులతో, బాధిత కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.

వరుస ఘటనలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి: పగడాల నాగరాజు

అనంతరం బీఆర్ఎస్ ఖమ్మం నగర నాయకుడు పగడాల నాగరాజు మీడియాతో మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాల్లో వరుసగా విద్యార్థుల మృతి ఘటనలు చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు.

“బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల భద్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస పారిశుద్ధ్య చర్యలు లేకపోవడం, చెత్తాచెదారం పేరుకుపోవడం, పిచ్చి మొక్కలు పెరగడం, విషపూరిత కీటకాలు సంచరించే పరిస్థితులు ఉండటం వల్ల విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. పిల్లలను కాపాడాల్సిన ప్రభుత్వమే వారి ప్రాణాలకు రక్షణ కల్పించలేకపోతే బాధిత కుటుంబాలు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలిలి?” అని ప్రశ్నించారు.



అజయ్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, కుటుంబ సభ్యులకు పూర్తి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అజయ్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ఉండేందుకు ఇల్లు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగం కల్పించాలని కోరారు.

ఖమ్మం జిల్లాలో విద్యార్థుల మృతి ఘటనలు వరుసగా జరుగుతున్నప్పటికీ జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఈ అంశంపై స్పందించకపోవడం దురదృష్టకరమని నాగరాజు అన్నారు.

“ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలి. ప్రతి హాస్టల్‌లో పారిశుద్ధ్యం, భద్రత, వైద్య సదుపాయాలు, విద్యార్థుల రక్షణకు అవసరమైన చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలి. భవిష్యత్తులో మరే విద్యార్థి ప్రాణం కోల్పోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి” అని పగడాల నాగరాజు డిమాండ్ చేశారు.

అజయ్ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, కుటుంబానికి అండగా నిలవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, గుత్తా రవి,మాజీ మంత్రి వ్యక్తిగత సహాయకుడు రవి కిరణ్,పిన్ని కోటేశ్వరరావు, యాస రామారావు, అన్నపురెడ్డిపల్లి మాజీ జడ్పీటీసీ భరత్, రాంబాబు, లావణ్య, మెంటం రామారావు, పాషా, మాటేటి కిరణ్,చిన్నం మల్లేశం,పగడాల మధు,మోటె కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచిలో వరుస చోరీలతో ఆందోళన

దుకాణంలో రూ.30 వేల నగదు అపహరణ. పోలీసుల దర్యాప్తు

పాలేరు అక్టోబర్ 31 (ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండల కేంద్రంలో ఇటీవల చోటుచేసుకుంటున్న చోరీ ఘటనలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఓ దుకాణంలో యజమాని అందుబాటులో లేని సమయంలో కౌంటర్‌లో ఉన్న రూ. 30 వేల నగదు అపహరణకు గురైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన కూరపాటి నరేందర్‌కు సంబంధించిన దుకాణంలో శుక్రవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. నరేందర్ పూజా కార్యక్రమాల నిమిత్తం దుకాణం నుంచి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కౌంటర్‌లో ఉన్న నగదును అపహరించినట్లు



బాధితుడు తెలిపారు.

కొద్దిసేపటి తర్వాత దుకాణానికి వచ్చిన నరేందర్ సతీమణి కౌంటర్ తెరిచి ఉండటాన్ని గమనించి ఆయనకు సమాచారం అందించారు. దీంతో దుకాణానికి చేరుకుని పరిశీలించగా నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు.

కాగా, రెండు వారాల క్రితం మండలంలోని పాత మసీదు సెంటర్‌లో అర్పపల్లి లక్ష్మమ్మ ఇంటి తాళం పగలగొట్టి గ్యాస్ సిలిండర్ అపహరణకు గురైన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన మరువకముందే మరో చోరీ జరగడంతో స్థానికులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. చోరీ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. మండల కేంద్రంలో పోలీసు గస్తీని మరింత పెంచాలని, అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- భూ రీసర్వే పనులు, రెవెన్యూ శాఖలో పెండింగ్ ఫైళ్ల పరిష్కారం

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 31:

భూ రీసర్వే పనులు, రెవెన్యూ శాఖలో పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, భారత్‌మాల జాతీయ రహదారులు, రైల్వే లైన్ల డబ్లింగ్, బ్రహ్మోస్ పరిశ్రమ, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వెబెక్స్ ద్వారా మండల తహసీల్దార్లు తో నిర్వహించిన సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.ముందుగా రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను తహసీల్దార్లు వెంటనే పరిష్కరించి, సంబంధిత నివేదికలను ఆర్డీఓలకు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. డేటా కరెక్షన్, భూదాన్, భూ భారతి తదితర అంశాలకు సంబంధించిన ఫైళ్లను పరిష్కరించడంతో పాటు నివేదికలు, భౌతిక ఫైళ్లను కూడా పంపించాలని సూచించారు. ముఖ్యంగా బాలానగర్, నవాబుపేట, దేవరకద్ర, మిడ్జిల్, చిన్నచింతకుంట మండలాల్లో పెండింగ్ ఫైళ్లు అధికంగా ఉన్నాయని, వాటిని ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వివిధ మండలాల్లోని గ్రామాల్లో చేపడుతున్న భూ రీసర్వే పనుల పురోగతిని కలెక్టర్ మండలాల వారీగా సమీక్షించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం జమిస్తాపూర్‌లో రీసర్వే పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. హన్వాడ మండలంలోని తులసముద్రం, యారోనిపల్లిలో రోవర్ సమస్యల కారణంగా సర్వే పనులు నెమ్మదిగా సాగుతున్నట్లు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత సాంకేతిక నిపుణులతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. వచ్చే వారంలోగా ప్రతి మండలంలో రెండు సర్వే బృందాలతో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. కోయిలకొండ,



అడ్డాకుల, మూసాపేట, మహమ్మదాబాద్, చిన్నచింతకుంట, బాలానగర్, భూత్పూర్, రాజాపూర్ మండలాల్లో రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం భారత్‌మాల జాతీయ రహదారులు, రైల్వే లైన్ల డబ్లింగ్, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. భూత్పూర్, చిన్నచింతకుంట, మహబూబ్‌నగర్ రూరల్ మండలాల్లో జాతీయ రహదారులు, రైల్వే లైన్ల డబ్లింగ్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. టీజీఐఐసీ అధికారులతో సమన్వయం చేసుకుని అమరరాజా పారిశ్రామికవాడకు సంబంధించిన భూసేకరణను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బ్రహ్మోస్ క్షిపణి తయారీ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణకు పై సమీక్షిస్తూ సర్వే పూర్తయిన భూములకు వెంటనే అవార్డులు పాస్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో చేపడుతున్న నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై సమీక్షించారు. అజిలాపూర్ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన సర్వే పనుల పురోగతిని కూడా అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్ భవేశ్ మిశ్రాకు ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల సంఘీభావం

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన.. వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్



నిర్మల్ అక్టోబర్ 31 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)భైంసా పురపాలక సంఘ కార్యాలయంలో మాస్టర్ ప్లాన్ అమలుపై నిర్వహించిన సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాపై పలువురు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం టీజీఈజేఈసీ, పెన్షనర్ల సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో నిజాయితీ, నిబద్ధత కలిగిన ఐఏఎస్ అధికారిగా గుర్తింపు పొందిన కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు, ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్న అధికారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. భైంసా పట్టణ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న కలెక్టర్‌కు ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలు ఎల్లవేళలా అండగా ఉంటాయని స్పష్టం చేశారు. కలెక్టర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించినా, అనుచిత వ్యాఖ్యలు చేసినా సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఈసీ గౌరవాధ్యక్షుడు ఎం.సి. లింగన్న, చైర్మన్ వి.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పి.సి. రెడ్డి, టీజీవో ప్రధాన కార్యదర్శి రమేష్, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి రవికుమార్, పెన్షనర్ల సంఘం నాయకులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది క్రమశిక్షణ మరియు అంకితభావంతో పనిచేయాలి - ట్రాఫిక్ డిసిపి

కూకట్ పల్లి, అక్టోబర్ 31, ప్రజా కలం ప్రతినిధి:

సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ-2 శేషాద్రిని రెడ్డి ఐపీఎస్, వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, నిర్వహణ, స్టేషన్ రికార్డులు, అధికారుల పనితీరు, ట్రాఫిక్ విధుల అమలు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావం పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ ఉల్లంఘనల నియంత్రణ, రహదారులపై సాఫీగా వాహనాల రాకపోకలు జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ ట్రాఫిక్-2 వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ తిమ్మప్పతో పాటు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కల్వకోల్ యువత రక్తదానం.. 30 మంది యువకుల సేవా స్ఫూర్తి!

మహేశ్వరం, అక్టోబర్ 31, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన బక్కని రవి మాదిగ ఆధ్వర్యంలో సుమారు 30 మంది యువకులు మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని మహేశ్వరం ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి ఆధ్వర్యంలో డీసీపీ నారాయణరెడ్డి , ఏసీపీ జానకి రెడ్డి



సహకారంతో నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరంలో కల్వకోల్ గ్రామ యువకులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బక్కని రవి మాదిగ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన బాధితులకు సకాలంలో రక్తం అందించడం ద్వారా ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.రక్తదానంపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలని, యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్సీ ఎస్టీ జిల్లా కమిటీ మెంబర్ విజయ్ కుమార్, మహేశ్వరం సీఐ రాఘవేందర్ రెడ్డి, కందుకూరు సీఐ వెంకటేశ్వర్లు , ఎస్సైలు మారయ్య, ప్రసాద్, ధనుంజయ్, మండల తహశీల్దార్ చిన్నప్పల నాయుడు, ట్రాఫిక్ పోలీసులు, స్టేషన్ బక్కని సుమన్, కొండని మధు, కొండని బన్నీ, బడుసు లక్ష్మణ్, బక్కని సిద్దులు, బక్కని భరత్, ఎర్ర నవీన్, కొండన్ మధుకర్, బక్కని వరుణ్ తదితరులు పాల్గొన్నారు.


మహేశ్వరం పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

- 680 యూనిట్ల రక్తం సేకరణ
రక్తదాన శిబిరాన్ని ఘనంగా ప్రారంభించిన
- ఫ్యూచర్ సీటీ డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ జానకి రెడ్డి
- రక్తం ఇచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపిన ఎస్ఎచ్ఓ రాఘవేందర్ రెడ్డి
- రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్త సేకరణ



మహేశ్వరం, అక్టోబర్ 31, (ప్రజా కలం)

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహేశ్వరం, కందుకూరు పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి ఆధ్వర్యంలో మహేశ్వరం మండల కేంద్రంలోని సుమంగళి కన్వెన్షన్ హాల్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఫ్యూచర్ సిటీ డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ జానకిరెడ్డి ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసేందుకు సుమారు 2,000 మంది హాజరుకాగా, వారిలో 680 యూనిట్ల రక్తాన్ని విజయవంతంగా సేకరించారు. ఈ సందర్భంగా మహేశ్వరం ఎస్‌హెచ్ఓ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించామని, చివరి రోజున చేపట్టిన మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన రక్తదాతలు, వివిధ గ్రామాల సర్పంచులు, రాజకీయ నాయకులు, స్థానిక పరిశ్రమల ఉద్యోగులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రాలు అందజేసి, వారితో సెల్ఫీలు దిగుతూ అభినందించారు.భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కందుకూరు ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు మారయ్య, ప్రసాద్, ధనుంజయ్, ట్రాఫిక్ పోలీసులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మాలబార్ గోల్డ్, విప్రో, సిగ్నిక్వాంటం, రోటో ఫ్యాకర్, అశ్విని హెయిర్ ఆయిల్ కంపెనీల ఉద్యోగులు, కార్మికులు, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



యూడీఐడీ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావొద్దు

- వికలాంగులకు ఒకేరోజు వైద్య పరీక్షలు.. సత్వరమే కార్డుల జారీ.
-జిల్లాలో ఇప్పటివరకు 3,590 యూడీఐడీ కార్డులు జారీ. - సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 31 (ప్రజాకలం ప్రతినిధి) : యూడీఐడీ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అధికారులను ఆదేశించారు. దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు ఒకేరోజు పూర్తిచేసి, దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. యూడీఐడీ దరఖాస్తుల పరిష్కారం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ అంశాలపై శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, వైద్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. సెర్ప్ ద్వారా జిల్లా ఆసుపత్రులకు పంపిణీ చేసిన వైద్య పరీక్షల పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం ఆసుపత్రులకు వచ్చే వారికి అవసరమైన అన్ని పరీక్షలు ఒకేరోజు నిర్వహించి పంపించేలా సమగ్ర ప్రణాళిక అమలు చేయాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రెండు జతల యూనిఫాంల పంపిణీ పూర్తయిందా? లేదా? అని ఆరా తీశారు. ప్రతి విద్యార్థికి యూనిఫాంలు అందేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు రెండు జతల యూనిఫాంల పంపిణీ పూర్తయినట్లు అధికారులు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో యూడీఐడీ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

2025 మార్చి 1 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 3,590 యూడీఐడీ కార్డులు జారీ చేసినట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శరత్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, మెప్మా ఏపీ మీర్జా ఫసహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సేవలకు వీడ్కోలు..

పదవీ విరమణ వేళ కొమురయ్యకు ఘన గౌరవం
- కౌన్సిలర్ శంకర్ చేతుల మీదుగా కొమరయ్య దంపతులకు సన్మానం.




వేములవాడ అక్టోబర్ 31 : (ప్రజా కలం ప్రతినిధి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో స్వీపర్‌గా విధులు నిర్వహించిన కుమ్మరి కొమురయ్య శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా 19వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి శంకర్ కొమురయ్యతో పాటు ఆయన సతీమణిని శాలువాలతో సత్కరించి అభినందించారు. ఆలయంలో సుదీర్ఘకాలం సేవలందించిన కొమురయ్యకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

అకాల మృతి చెందిన కుటుంబానికి ఆసరా సేవా సమితి చేయూత

రూ.6 వేల విలువైన నిత్యావసర సరుకుల పంపిణీ..
ఐదో సేవా కార్యక్రమం

గజ్వేల్, అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ ఆసరా సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన పల్లెపహాడ్‌కు చెందిన గూడూరి అనసూయ ఇటీవల అకాల మరణం చెందారు. గతంలోనే ఆమె భర్త మృతి చెందగా,తాజాగా అనసూయ కూడా మరణించడంతో పిల్లలు తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయి పెద్ద దిక్కులేని వారయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఆసరా సేవా సమితి సభ్యులు బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో అండగా నిలిచేందుకు రూ.6 వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు.సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఐదో సేవా కార్యక్రమంగా ఈ సహాయాన్ని అందించినట్లు సభ్యులు తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు తమ వంతు చేయూత అందించడమే సమితి లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు సందానవేణి కనకరాజు, కోశాధికారి దామరంచ దయాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు నిమ్మరాజు రాజు,లింగని రాజు, కొమ్ము చంద్రశేఖర్, మద్దికుంట రమేష్, సాయిబాబా,భూమల్లు పరశురాములు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌పై నూతన పాట విడుదల.

జొన్నోజి నాగులు రచించిన పాటను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.
పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 31: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో సమష్టిగా కృషి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలోని జీఎల్ఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలాయ్ బలాయ్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కేసీఆర్‌పై ప్రత్యేక పాట ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్‌పై జొన్నోజి క్రియేషన్స్ ఆధ్వర్యంలో జొన్నోజి నాగులు రచించిన నూతన పాటను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విడుదల చేశారు. పాట ఆవిష్కరణతో కార్యక్రమంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో రామారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు మారగోని మహేష్ గౌడ్, వంజరి సురేష్, సిలివేరి స్వామి, జొన్నోజి నాగులు, మారగోని ప్రసాద్ గౌడ్, వార్డు సభ్యులు వంజరి విజయ్ కుమార్, వంజరి మహేష్, సిద్ధిరాములు కుమార్, పెరుమని నవీన్, బంజరుపల్లి బిక్షపతి, రెడ్డిబోయిన బాల్‌రాజ్, మంగలి రాజు, నల్ల యాదగిరి, వేణు తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నసాగర్ కట్ట భద్రతపై ఆందోళన..

బ్లాస్టింగ్ పనులు నిలిపివేయాలి

- అనుమతులు లేకుండానే పంప్‌హౌస్ నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆరోపణ
- చీఫ్ ఇంజనీర్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులపై వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శలు
- అధికారులు ప్రజలకు క్షమాపణ చెప్పాలి.. - న్యాయపోరాటం చేస్తాం


గజ్వేల్, అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి):

మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో బ్లాస్టింగ్ పనులు చేపడుతూ పంప్‌హౌస్ నిర్మాణం చేయడం రిజర్వాయర్ భద్రతకు ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.అనుమతులు లేకుండానే పనులు చేపడుతున్నారని ఆరోపిస్తూ వెంటనే బ్లాస్టింగ్,కాలువ తవ్వకాలు, పంప్‌హౌస్ నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడలోని ఎస్ ఫోర్ హోటల్ వద్ద శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తిప్పారం సమీపంలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్ద మూసీ నది సుందరీకరణ కోసం హెచ్ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న పంప్‌హౌస్ నిర్మాణ పనులపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రిజర్వాయర్ కట్టకు సమీపంలో భారీ బ్లాస్టింగ్‌లు చేపడుతున్నప్పటికీ సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని విమర్శించారు.మల్లన్నసాగర్ కట్టకు 200 మీటర్ల లోపు నిర్మాణ పనులు, బ్లాస్టింగ్‌లు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని ఆయన ఆరోపించారు. ఇరిగేషన్ శాఖ,పోలీస్ శాఖ,తిప్పారం గ్రామపంచాయతీ నుంచి అవసరమైన అనుమతులు పొందకుండానే పనులు ప్రారంభించారని పేర్కొన్నారు.మీడియా ప్రతినిధులు అనుమతుల గురించి ప్రశ్నించగా, అవి ఇంకా ప్రక్రియలో ఉన్నాయని అధికారులు సమాధానం చెప్పడం అనేక సందేహాలకు తావిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ శివధర్మతేజ్, హెచ్ఎండబ్ల్యూఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ మహేష్ మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు బాధ్యతాయుతమైన అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా పొంతనలేని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గతంలో మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం మల్లన్నసాగర్ కట్ట సమీపంలోని బ్లాస్టింగ్ పనులపై ఆందోళన వ్యక్తం చేశారని గుర్తుచేశారు.

380 మీటర్ల దూరంలో నిర్మించాలి: రిజర్వాయర్ కట్ట ఎత్తు ఆధారంగా నిర్మాణ ప్రాంతానికి సంబంధించి భద్రతా ప్రమాణాలను అధికారులు స్పష్టం చేయాలని ప్రతాప్‌రెడ్డి కోరారు.కట్ట ఎత్తు 38 మీటర్లు ఉన్న నేపథ్యంలో దానికి పది రెట్ల దూరం అంటే 380 మీటర్ల పరిధి దాటి నిర్మాణాలు చేపట్టాలనే నిబంధన ఉందని ఆయన పేర్కొన్నారు.అయితే కేవలం 200 మీటర్ల దూరంలోనే పంప్‌హౌస్ నిర్మాణం చేపడుతూ బ్లాస్టింగ్‌లు నిర్వహించడంపై చీఫ్ ఇంజనీర్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పంప్‌హౌస్ నిర్మాణాన్ని రిజర్వాయర్ కట్టకు కనీసం 500 మీటర్ల దూరంలో చేపట్టాలని డిమాండ్ చేశారు.

రిజర్వాయర్‌కు నష్టం జరిగితే బాధ్యత ఎవరిది?

మల్లన్నసాగర్ రిజర్వాయర్‌కు భవిష్యత్తులో ఏదైనా నష్టం వాటిల్లితే తెలంగాణ ప్రజలకు భారీ నష్టం జరుగుతుందని ప్రతాప్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.ఈ రిజర్వాయర్ ద్వారా సుమారు 16.23 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతోపాటు సిద్దిపేట, సిరిసిల్ల, జనగామ, మెదక్,సంగారెడ్డి, కామారెడ్డి తదితర జిల్లాలకు తాగునీటి అవసరాలు తీరుతున్నాయని పేర్కొన్నారు.రిజర్వాయర్ భద్రతకు విఘాతం కలిగితే ఇంతటి ప్రజా ప్రయోజనాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.పంప్‌హౌస్ నిర్మాణ పనులను చేపడుతున్న మెగా కంపెనీ యాజమాన్యం కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డికి అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు అనుగుణంగా అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని,స్థానికంగా తయారైన బాలాజీ బ్లీల్‌ను వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ,నిర్మాణ సామగ్రి నాణ్యతపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.వందేళ్లపాటు మన్నికగా ఉండాల్సిన నిర్మాణాల్లో నాణ్యత విషయంలో రాజీ పడటం సరికాదన్నారు.



అధికారులపై చర్యలు తీసుకోవాలి: అనుమతులు లేకుండా నిర్మాణ పనులు ప్రారంభించడానికి బాధ్యులైన చీఫ్ ఇంజనీర్‌తోపాటు సంబంధిత ఈఈలు, డీఈలు, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు.బాధ్యులైన అధికారులను విధుల నుంచి తొలగించాలని కోరారు. ఈ వ్యవహారంపై చీఫ్ ఇంజనీర్ శివధర్మతేజ్, హెచ్ఎండబ్ల్యూఎస్ డైరెక్టర్ మహేష్ తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.అధికారులు స్పందించకపోతే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు న్యాయస్థానాలను ఆశ్రయించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోరాటం చేస్తామని హెచ్చరించారు. మల్లన్నసాగర్ కట్ట భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిర్మాణ పనులపై సమగ్ర పరిశీలన జరపాలని, అప్పటివరకు బ్లాస్టింగ్‌లు,తవ్వకాలు, పంప్‌హౌస్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

- దుబ్బాక అభివృద్ధికి ప్రత్యేక బాధ్యత తీసుకుంటా.
- రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి.
- కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా.
- రైతులకు గిట్టుబాటు ధర, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి.
దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.



దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 31.

ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల అండదండలతోనే తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాయపోల్ మండల కేంద్రంలోని జీఎల్ఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అలై బలై' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ప్రతి 10, 15 రోజులకు ఒకసారి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై గ్రామాల సమస్యలు, పార్టీ బలోపేతంపై చర్చిస్తానని తెలిపారు. యువత, విద్యార్థులు, ఎన్నీ విభాగాలతో పాటు గ్రామస్థాయి కమిటీలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని కోరారు. గత నెల రోజులుగా నియోజకవర్గం లోని గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలు, కార్యకర్తల సమస్యలను తెలుసుకుంటున్నానని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. టమాటా, కూరగాయల వంటి పంటలకు మార్కెటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. నాణ్యమైన విద్యుత్, సకాలంలో ఎరువులు, పురుగుమందులు అందించడంతో పాటు పంటలకు సరైన ధర కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.


దుబ్బాక నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధికి ప్రత్యేక బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు. గ్రామాల్లో రహదారులు, మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రాయపోల్‌లో పెద్ద ఎత్తున అలై బలై కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని, ఇలాంటి వేడుకలు ప్రజల మధ్య సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

కొమురవెల్లి ఆలయ అన్నదానానికి రూ.1,00,116 విరాళం

విరాళం అందజేసిన హైదరాబాద్ వ్యాపారవేత్త ఇనకొండ చంద్రారెడ్డి

సిద్దిపేట జిల్లా, అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి):

సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, మహాలక్ష్మి ఫ్రైడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి ఇనకొండ చంద్రారెడ్డి రూ. 1,00,116 (ఒక లక్ష నూట



పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ మల్లికార్జున స్వామివారి అనుగ్రహం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ దైవభక్తితో పాటు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఇనకొండ చంద్రారెడ్డితో పాటు ప్రణీత రెడ్డి, భావిక్ రెడ్డి, అక్షిత రెడ్డి, హర్షవర్ధన్ రావు, లక్ష్మి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు వారికి స్వామివారి శేషవస్త్రంతో సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ మర్కుక్ మండల అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

- కరువు మండలాల ప్రకటనలో జిల్లాకు తీవ్ర అన్యాయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్దిపేట జిల్లాపై వివక్ష చూపుతోంది: దేవి రవీందర్



గజ్వేల్ నియోజకవర్గం, అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి):

సిద్దిపేట జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించాలని రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరువు మండలాల ప్రకటనలో సిద్దిపేట జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. మంత్రుల ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఎక్కువ మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి, మిగతా నియోజకవర్గాల మండలాలను విస్మరించారని విమర్శించారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే కరువు పరిస్థితులు ఉన్నాయా? మిగతా ప్రాంతాల్లో కరువు లేదా? ఏ ప్రాతిపదికన కరువు మండలా లను ఎంపిక చేశారో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులకు తోడు విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అరకొర విద్యుత్ సరఫరా కారణంగా రైతులు సాగు చేసిన పంటలు ఆశించిన స్థాయిలో పెరగలేదని, పెట్టుబడులు పెట్టిన రైతులు నష్టాలపాలవుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు వరి కోతలు ప్రారంభమైనప్పటికీ గ్రామాల్లో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులు పండించిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్దిపేట జిల్లాపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని దేవి రవీందర్ ఆరోపించారు. కరువు మండలాల ప్రకటనలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, సిద్దిపేట జిల్లాను పూర్తిస్థాయిలో కరువు జిల్లాగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా కన్వీనర్ అడిగే అశోక్, రాయవరం సర్పంచ్ రమేష్ గౌడ్, నెంటూర్ సర్పంచ్ నాగరాజు, ధర్మారెడ్డిపల్లి సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గణేష్, బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం, గాలింక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం వద్ద కలకలం

-రెవెన్యూ అధికారి కోసం పోస్టర్లు
-ఎల్ ఆర్ ఎస్ క్లియరెన్స్ కు డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ డీటీ మహమ్మద్ యాసీన్ పై ఆరోపణలు

మహేశ్వరం, అక్టోబర్ 31, (ప్రజా కలం):

ఎల్ ఆర్ ఎస్ అప్లికేషన్లను క్లియర్ చేయాల్సిన రెవెన్యూ అధికారి కనిపించడం లేదంటూ బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం డోర్లకు పోస్టర్లు వెలవడంతో కలకలం రేపుతోంది. గత కొంత కాలంగా



ఎల్ ఆర్ ఎస్ క్లియరెన్స్ చేయకుండా జాప్యం చేస్తున్న డీటీ మహమ్మద్ యాసీన్ పై స్థానికులు, బాధితులు ఈ పోస్టర్లు వేసినట్లు తెలుస్తోంది. ఎల్ ఆర్ ఎస్ క్లియర్ చేయాలంటే డబ్బులు ఇవ్వాలంటూ రెవెన్యూ అధికారి డిమాండ్ చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వకుంటే కాలయాపన చేస్తూ ఫైళ్లను నెలల తరబడి పెండింగ్ లో పెడుతున్నారని బాధితులు వాపోతున్నారు. అధికారి తీరుపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి, పెండింగ్ లో ఉన్న ఎల్ ఆర్ ఎస్ అప్లికేషన్లను త్వరగా క్లియర్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పులిమామిడి మహేశ్వరం రహదారిలో ప్రమాదకర బ్రిడ్జి

- ఇనుప రాడ్లు తేలి నిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు
- ప్రాణాలు పోయాక స్పందిస్తారా అంటున్న ప్రయాణికులు

కందుకూరు, అక్టోబర్ 31, (ప్రజా కలం)

కందుకూరు మండల పరిధిలోని పులిమామిడి – మహేశ్వరం ప్రధాన రహదారి, కేకే బస్తీ సమీపంలోని బ్రిడ్జి ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. గత రెండు సంవత్సరాలుగా



ఈ బ్రిడ్జి రహదారికి సమానంగా లేకపోవడం, పైగా బ్రిడ్జి పైనున్న ఇనుప రాడ్లు బయటకు తేలి ప్రమాదకరంగా మారినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఎవరో ఒకరు ఈ బ్రిడ్జి పై నుండి కింద పడి తీవ్ర గాయాల పాలవుతున్నారు. తాజాగా శుక్రవారం రాత్రిలి మురళీ నగర్ కు చెందిన ఇద్దరు వ్యక్తులు మహేశ్వరం నుండి మురళీ నగర్ వెళ్తుండగా ఇదే బ్రిడ్జి వద్ద అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. ఇకనైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి బ్రిడ్జికి తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలని కందుకూరు, మహేశ్వరం మండలాల ప్రజలు కోరుతున్నారు.

బాలల భద్రతకు పోక్సో చట్టం రక్షణ కవచం

విద్యార్థులకు చట్టాలపై అవగాహన..
న్యాయ నిపుణుల సూచనలు

వేములవాడ, అక్టోబర్ 31 (ప్రజాకలం ప్రతినిధి) : బాలబాలికలపై లైంగిక వేధింపులు, అఘాయిత్యాలను అరికట్టేందుకు పోక్సో చట్టం పటిష్టమైన రక్షణ కల్పిస్తుందని, ప్రతి విద్యార్థి ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ నిపుణులు సూచించారు. పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ హనుమాజీపేట పాఠశాలలో గర్ల్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ అండ్ అడోలెసెంట్ సేఫ్టీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు ఏ జి పి సంటి సుజీవన్, జక్కుల పద్మ హాజరై పోక్సో చట్టం ప్రాధాన్యత, బాలల హక్కులు, చట్టపరమైన రక్షణలపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలబాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడటం తీవ్రమైన నేరమని, నేర స్వభావాన్ని బట్టి కఠినమైన జైలు శిక్షలు, జరిమానాలు విధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడితే వ్యక్తిగత జీవితంతో పాటు సామాజిక గౌరవం, భవిష్యత్తుపైనా తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, పరస్పర గౌరవం అలవర్చుకోవాలని సూచించారు. బాలికలతో పాటు బాలురు కూడా వ్యక్తిగత భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి, హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా ఎలా సహాయం పొందాలి, పోలీసులకు ఫిర్యాదు చేసే విధానం తదితర అంశాలను వివరించారు. బాధితులు మౌనం వీడి ధైర్యంగా ముందుకు రావాలని, బాలల రక్షణకు చట్టం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించే బాధ్యతాయుత పౌరులుగా ఎదగవచ్చని న్యాయ నిపుణులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిట్నేని శ్రీకాంత్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు బచావో -- దేశ్ బచావో కార్యక్రమానికి మల్కాజిగిరి నుంచి భారీ స్పందన

దాదాపు 100 కార్లలో ఢిల్లీకి కాంగ్రెస్ శ్రేణులు.. నాగ్‌పూర్‌లో మహారాష్ట్ర మాజీ మంత్రి విజయ్‌భావు వడెట్టివార్‌తో మైనంపల్లి హనుమంతరావు బృందం భేటీ



మల్కాజిగిరి, అక్టోబరు 31 (ప్రజా కలం ప్రతినిధి):

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల రక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓటు బచావో -- దేశ్ బచావో' కార్యక్రమానికి మద్దతుగా మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఢిల్లీకి బయలుదేరారు.

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ నాయకత్వంలో దాదాపు 100 కార్లలో కాంగ్రెస్ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పయనమయ్యారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, శాసనసభ ప్రతిపక్ష నాయకుడు విజయ్‌భావు వడెట్టివార్‌ను మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలోని కాంగ్రెస్ నాయకుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కులు, ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు వంటి అంశాలపై చర్చించారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ఓటర్ల పేర్లను సరైన కారణాలు లేకుండా తొలగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఓటు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వంలో కొనసాగుతున్న 'ఓటు బచావో -- దేశ్ బచావో' ఉద్యమానికి మద్దతుగా తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి తరలివెళ్లడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

ఈ కార్యక్రమంలో నక్క ప్రభాకర్ గౌడ్, మెదక్ డీసీసీ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్, వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, వినోద్ యాదవ్, జీడి సంపత్ గౌడ్ పిట్టల నాగరాజు, చుంకు శ్రీనివాస్, సంతోష్ రామ్ దాస్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హాండ్స్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

మరో మూడేళ్ల పాటు అధ్యక్షుడిగా గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్

హైదరాబాద్: 31 అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ (TSCSTEHHA -- చారిటీ) వార్షిక సర్వసభ్య సమావేశం శనివారం అసోసియేషన్ అధ్యక్షుడు గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె. దేవేందర్ ((ప్రేమ్) గత ఐదేళ్లలో సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమగ్ర నివేదికను సభ్యుల ముందు ఉంచారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించిన సభ్యులు, తదుపరి మూడేళ్ల కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్, ఉపాధ్యక్షురాలు: సి. హెచ్. గంగ లక్ష్మి, ప్రధాన కార్యదర్శి: జె. దేవేందర్ ((ప్రేమ్), సంయుక్త కార్యదర్శి: ఎం. సూరజ్ బిన్ని, కోశాధికారి: బి. గుణవంత్ రావ్, కార్యవర్గ సభ్యులు కె. శైలజ, పి. సందీప్ కుమార్ ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, అసోసియేషన్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. సభ్యుల సహకారంతో సంస్థను మరింత బలోపేతం చేసి, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మరింతగా తోడ్పడేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



ఇందిరమ్మ బాటలో కాంగ్రెస్ పాలన

-పేదల సంక్షేమమే ఇందిరమ్మకు నిజమైన నివాళి: నీలం మధు ముదిరాజ్..

పటాన్‌చేరు, అక్టోబర్ 31 (ప్రజా కలం) ప్రతినిధి

భారతదేశ చరిత్రలో తనదైన పాలనా దక్షతతో చెరగని ముద్ర వేసుకున్న ఉక్కు మహిళ,మాజీ ప్రధాని భారతరత్న ఇందిరాగాంధీ పేదల సంక్షేమం



దేశాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం చిట్కుల్‌లోని తన నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ,పేదలకు సంక్షేమ ఫలాలను చేరువ చేసి, దేశాభివృద్ధికి బలమైన పునాదులు వేసిన మహానేతగా ఇందిరాగాంధీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.ఆమె దూరదృష్టితో అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశ ప్రగతికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలు,పాలనా స్ఫూర్తితో తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని నీలం మధు ముదిరాజ్ స్పష్టం చేశారు..

గీతంలో హాలోవీన్ సందడి..

భిన్న వేషధారణలతో విద్యార్థుల హల్‌చల్.. సృజనాత్మకతకు పెద్దపీట..

పటాన్‌చేరు, అక్టోబర్ 31 (ప్రజా కలం) ప్రతినిధి

హాలోవీన్ వేడుకలు గీతం విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా నిలిచాయి. హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విద్యార్థి జీవన విభాగం ఆధ్వర్యంలో శనివారం ది ఫర్గాటెన్



ఫెయిర్, హాలోవీన్ 2026 వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. భయానక ఇతివృత్తాలు, విభిన్న వేషధారణలు, వినూత్న కార్యక్రమాలతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ప్రత్యేక దుస్తులతో హాజరై తమ ఊహాశక్తిని, సృజనాత్మకతను చాటుకున్నారు. ఆటపాటలు, వినోదభరిత కార్యక్రమాలతో సందడి చేస్తూ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు పరస్పర పరిచయాలు, స్నేహభావం పెంపొందించేందుకు ఈ వేడుకలు దోహదపడ్డాయి. ఇటువంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించిన విశ్వవిద్యాలయ యాజమాన్యంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు..

మీర్పేట్ పోలీస్ స్టేషన్ లో కలకలం

- రికవరీ బంగారాన్ని మాయం చేసిన కానిస్టేబుల్!
- ముత్తూట్ ఫైనాన్స్ లో కుదువ పెట్టిన పోలీస్ రైటర్
- సీజ్ చేసిన ఫోన్ నుండి రూ.1.70 లక్షలు ట్రాన్స్ ఫర్

మహేశ్వరం, అక్టోబర్ 31, (ప్రజా కలం)

ప్రజలు తప్పు చేస్తే శిక్షించాల్సిన పోలీసులే తప్పు చేస్తే ఎలా? అనేలా మీర్పేట్ పోలీస్ స్టేషన్ లో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది.రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్పేట్ పోలీస్ స్టేషన్ లో రైటర్ గా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ప్రవీణ్ అలియాస్ శ్రవణ్ కుమార్ పై పోలీసు ఉన్నతాధికారులు కేసు నమోదు చేశారు.ఒక దొంగతనం కేసులో నిందితుల నుండి రికవరీ చేసిన 12 తులాల బంగారు ఆభరణాలను రైటర్ ప్రవీణ్ మాయం చేసి, ముత్తూట్ ఫైనాన్స్ లో కుదువలి పెట్టినట్లు తేలింది.అంతటితో ఆగకుండా అదే కేసులో సీజ్ చేసిన మొబైల్ ఫోన్ నుండి ఆన్ లైన్ ద్వారా ఏకంగా 1,70,000 (లక్షా డెబ్భై వేలు) తన బంధువుల ఖాతాలకు ట్రాన్స్ ఫర్ చేసుకున్నాడు.విషయం వెలుగులోకి రావడంతో పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రైటర్ ప్రవీణ్ పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.
అయితే ఈ వార్త బయటకు రాకుండా మీర్పేట్ పోలీసులు చాలా జాగ్రత్త పడినట్లు సమాచారం. ప్రజల సొమ్మును కాపాడాల్సిన పోలీసులే ఇలా చేయడం సిగ్గుచేటని స్థానికులు మండిపడుతున్నారు.

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన మాదాసు శ్రీనివాస్

ధర్మారెడ్డిపల్లి గ్రామంలో శ్రీరామ్ ఎల్లం తల్లి నర్సమ్మ మృతి పట్ల సంతాపం

గజ్వేల్ నియోజకవర్గం, అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి):

ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీరామ్ ఎల్లం తల్లి నర్సమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ శనివారం మాజీ వైస్ ఎంపీపీ కృష్ణ గౌడ్, సర్పంచ్ శ్రీనివాస్‌తో కలిసి మృతురాలి నివాసానికి వెళ్లారు.ఈ సందర్భంగా నర్సమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, నాయకులు మాధవరెడ్డి,శ్రీరామ్ నర్సింలు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరులో వైద్య విప్లవం..

- పేదలకూ కార్పొరేట్ వైద్యం అందాలి: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి..
- ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే..



పటాన్‌చెరు, అక్టోబర్ 31
(ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం శుభపరిణామమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సైతం ఆధునిక వైద్య సేవలు అందుబాటు ధరల్లో లభించేలా ఆసుపత్రులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం పటాన్‌చెరులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశ్రామికంగా, జనాభా పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు ప్రాంతంలో ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా మెరుగైన వైద్య సదుపాయాలు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యం కేవలం ఆర్థిక స్థోమత ఉన్నవారికే పరిమితం కాకుండా పేదలకు సైతం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి యాజమాన్యం నాణ్యమైన వైద్య సేవలతో పాటు పేదలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ వెంకట్ ఆలపాటి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, పృథ్వీరాజ్, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు..

మల్లన్నసాగర్ డ్యామ్‌కు ఎలాంటి ప్రమాదం లేదు

- మల్లన్నసాగర్ భద్రతపై ఆందోళన వద్దు.. అధికారుల స్పష్టీకరణ
- తిప్పారం వద్ద చేపడుతున్నవి నియంత్రిత పేలుళ్లే
- నీటి లీకేజీపై వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు: చీఫ్ ఇంజినీర్ శివధర్మతేజ్



గజ్వేల్ నియోజకవర్గం,
అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి):

మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్టకు ఎలాంటి ప్రమాదం లేదని నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామ సమీపంలో పంప్‌హౌస్ నిర్మాణ పనుల్లో భాగంగా నిబంధనలకు అనుగుణంగా నియంత్రిత పేలుళ్లు నిర్వహిస్తున్నామని, వీటివల్ల రిజర్వాయర్ భద్రతకు ఎలాంటి ముప్పు లేదని వెల్లడించారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట నమీవంలో జరుగుతున్న నిర్మాణ పనులు, పేలుళ్లపై గత కొన్ని రోజులుగా తిప్పారం గ్రామ ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శివధర్మతేజ్, హెచ్ఎండ బ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ ప్రాజెక్టు డైరెక్టర్ మహేష్‌తో కలిసి తిప్పారం గ్రామంలో మీడియా సమావేశం నిర్వహించి నిర్మాణ పనుల వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ శివధర్మతేజ్ మాట్లాడుతూ.. పంప్‌హౌస్ నిర్మాణ పనుల కోసం సాంకేతిక నిబంధనలను పాటిస్తూ నియంత్రిత పేలుళ్లు మాత్రమే చేపడుతున్నట్లు తెలిపారు.వీటివల్ల మల్లన్నసాగర్ డ్యామ్ కట్టకు ఎలాంటి ప్రమాదం వాటిల్లదని స్పష్టం చేశారు.అదేవిధంగా రిజర్వాయర్ నుంచి నీటి లీకేజీ జరుగుతోందన్న ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొన్నారు.డ్యామ్ భద్రతకు సంబంధించి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వాస్తవాలను తెలుసుకోకుండా జరుగుతున్న ప్రచారాలను నమ్మవద్దని అధికారులు సూచించారు.

ఏఐ వచ్చాక మనుషులతో పనిలేదనడం కేవలం అపోహ మాత్రమే

టీకేఆర్ మెగా జాబ్ మేళాలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఐఏఎస్!
టి కె ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ తీగల కృష్ణ రెడ్డి





మహేశ్వరం, అక్టోబర్ 31, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజక వర్గం బాలాపూర్ మండలం మీర్పేట్ టీకేఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) ప్రాంగణంలో ఈరోజు “మెగా జాబ్ మేళా–2026” అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఎన్ బి ఏ టైర్ 1 మరియు నాక్ ఏ గ్రేడ్ సాధించిన ఈ ప్రతిష్టాత్మక విద్యాసంస్థ ఏర్పాటు చేసిన ఈ ఉపాధి మేళాలో 150కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు నేరుగా ఇంటరవ్యూలు నిర్వహించాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఐఏఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం ఏఐ వచ్చాక మనుషులతో పనిలేదు అనేది కేవలం అపోహ మాత్రమే” అని స్పష్టం చేశారు.
ఆయన మాట్లాడుతూ ‘‘భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవడం ప్రతి ఒక్కరికీ చాలా ముఖ్యం. వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకుంటూ టీమ్‌తో కలిసి పనిచేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయి. తాను గతంలో సి హెచ్ ఎస్ లో మొదటిసారి రిపోర్ట్ చేసినప్పుడు నేర్చుకున్న అంశాలు తన కెరీర్‌లో ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రతి వ్యక్తి తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ, ఇతరులతో కలిసి పనిచేస్తేనే ఏ సంస్థ అయినా అభివృద్ధి చెందుతుంది. అలాగే టీమ్‌లో ఉన్న ప్రతి ఒక్కరి నైపుణ్యాన్ని గుర్తించి, వారిని ప్రోత్సహిస్తూ ముందుకు తీసుకెళ్లాలి” అని సూచించారు.
అలాగే ఏ ఐ సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ, మనుషులలో ఉండే నైపుణ్యం, ప్రతిభ మరియు సృజనాత్మకతకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. మార్కెట్‌లో అనేక కంపెనీలు, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి; విద్యార్థులు తమ టాలెంట్‌ను బట్టి వాటిని సాధించుకోవాలి. 150కి పైగా కంపెనీలను ఒకే వేదికపైకి తెచ్చి యువతలో కొండంత భరోసా నింపిన టికెఆర్ యాజమాన్య ప్రయత్నం ఎంతో ప్రశంసనీయం అని కొనియాడారు. టి కె ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ తీగల కృష్ణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే మా సంస్థ ప్రధాన లక్ష్యం. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుని, వచ్చిన ప్రతి అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి. భవిష్యత్తులో కూడా విద్యార్థుల ఉపాధి కోసం ఇలాంటి భారీ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తాం” అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ టి. హరినాథ్ రెడ్డి, ట్రెజరర్ టి. అమర్‌నాథ్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మెన్ తీగల అనిత రెడ్డి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రామస్వామి రెడ్డి, కన్వీనర్ ఆర్. అయ్యప్ప శర్మ తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి బీజేపీ నాయకుల పరామర్శ.. ఆర్థిక సాయం

గజ్వేల్ నియోజకవర్గం, అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి):
గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామ బూత్ అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాస్ తల్లి మృతి చెందడంతో బీజేపీ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు తరఫున కుటుంబానికి భరోసా కల్పిస్తూ,అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు.గజ్వేల్ మండల బీజేపీ శాఖ పక్షాన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్,జిల్లా కార్యవర్గ సభ్యుడు వంజరి రాజు,దాతర్‌పల్లి సర్పంచ్ దివ్య రాజు,జిల్లా కౌన్సిల్ సభ్యుడు మన్నె శేఖర్,మండల ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి, బారు అరవింద్, గజ్వేల్ మండల నాయకులు నరేష్ గౌడ్, మహేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఐదేళ్ల చిన్నారి మృతి

అమ్మవారి పండుగకు బంధువుల ఇంటికి వచ్చి మృత్యువాత.. కుటుంబంలో విషాదం

మల్కాజిగిరి, అక్టోబరు 31 (ప్రజా కలం ప్రతినిధి): అమ్మవారి పండుగకు బంధువుల ఇంటికి వచ్చిన ఐదేళ్ల చిన్నారి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషాద ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసరలో నివాసం ఉంటున్న రాజశేఖర్ అమ్మవారి పండుగ నిమిత్తం అక్టోబరు 30న ఉప్పర్‌గూడలోని తన బంధువుల ఇంటికి కుమార్తె వైశాలి (5)తో కలిసి వచ్చాడు. ఈ క్రమంలో రాత్రి సుమారు 8 గంటల సమయంలో కమ్యూనిటీ హాల్‌పై ఏర్పాటు చేసిన షామియానాకు అమర్చిన విద్యుత్ దీపాల కారణంగా చిన్నారి వైశాలి విద్యుదాఘాతానికి గురైంది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే చిన్నారిని చికిత్స నిమిత్తం అంకుర్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పండుగ వేళ చోటుచేసుకున్న ఈ ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. చిన్నారి తండ్రి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గజ్వేల్‌లో ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

దేశ సమగ్రతకు పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయం: కళ్యాణ్‌కార్ నర్సింగరావు

గజ్వేల్, అక్టోబర్ 31 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ పట్టణంలోని ఎయిర్‌టెల్ టవర్ సమీపంలో హైందవ సోదరుల ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి నివాళులర్పించి, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళ్యాణ్‌కార్ నర్సింగరావు మాట్లాడుతూ. 1875 అక్టోబర్ 31న జన్మించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని, స్వతంత్ర భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రిగా,హోంమంత్రిగా దేశ సమగ్రతకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు.స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని 560కి పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. గుజరాత్‌లోని బార్డోలీ సత్యాగ్రహంలో రైతులు,మహిళలను సంఘటితం చేసి ఉద్యమాన్ని విజయవంతం చేయడంతో ప్రజలు ఆయనకు ‘సర్దార్’ అనే బిరుదును ప్రదానం చేశారని తెలిపారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ పటేల్ చేపట్టిన పోలీసు చర్య (ఆపరేషన్ పోలో) కీలక ఘట్టమని పేర్కొన్నారు.పటేల్ ఆశయాలు,దేశ సమగ్రత కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని,ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణతో పాటు భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తోట అమరేందర్‌రావు, మంతూరి నాగరాజు,బాలకుమార్ సుంకరి,రమణ బొమ్మ, చిలివేరి జనార్దన్,కాశామైన సందీప్ కుమార్,అరవింద్,బారు అరవింద్, యాదగిరి,కనకరాజు,వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



గుట్టను తోడి పారేస్తున్న అక్రమార్కులు

-విలువైన సహజ సంపదను కొల్లగొడుతున్న గుత్తేదారులు
- 15 రోజులుగా యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు
- చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- ప్రభుత్వ ఆదాయానికి గండి - ప్రకృతి సంపదకు తీరని నష్టం!







మెదక్ అక్టోబర్ 31 (ప్రజాకలం ప్రతినిధి) ప్రకృతి ప్రసాదించిన విలువైన సహజ సంపద అక్రమార్కుల చేతుల్లో కరిగిపోతోంది. ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని పట్టించుకోకుండా కొందరు గుత్తేదారులు గుట్టలను తవ్వుతూ మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నార్సింగి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దశంకరంపేట వెళ్లే మార్గంలో గుట్టను తవ్వి మట్టిని తరలిస్తున్న వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

15 రోజులుగా యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు

స్థానికుల సమాచారం ప్రకారం గత 15 రోజులుగా ఈ ప్రాంతంలో అక్రమ మట్టి తవ్వకాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. భారీ యంత్రాలను ఉపయోగించి గుట్టను తవ్వుతూ మట్టిని టిప్పర్ల వాహనాల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజురోజుకూ గుట్ట స్వరూపమే మారిపోతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయి. మట్టి తరలింపుకు ఎవరి అనుమతులు ఉన్నాయి? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

సహజ సంపదను కొల్లగొడుతున్నారా అక్రమార్కులు

గుట్టలు, కొండలు కేవలం మట్టి రాళ్ల సముదాయం మాత్రమే కాదు. అవి ప్రకృతి సమతుల్యతలో కీలక భాగాలు. ఇష్టారాజ్యంగా గుట్టలను తవ్వడం వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లడంతో పాటు వర్షపు నీటి ప్రవాహాలు, భూగర్భ జలాల పరిస్థితులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టడం చట్టవిరుద్ధం. అయినప్పటికీ నిబంధనలను తుంగలో తొక్కి మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నారు.

రెవెన్యూ అధికారుల నిఘా ఎక్కడ ?

ఒకటి రెండు రోజులు కాదు.. ఏకంగా 15 రోజులుగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు తనిఖీలు చేపట్టారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. గ్రామ పరిధిలో ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు జరుగుతుంటే అధికారుల దృష్టికి వెళ్లలేదా? వెళ్లినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమా? ప్రైవేటు పట్టా భూమా? అసలు తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? మట్టి తరలింపుకు రాయల్టీ చెల్లిస్తున్నారా? అనే అంశాలపై రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న దుండగులు

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నట్లయితే ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది. మరోవైపు అక్రమ తవ్వకాల వల్ల సహజ వనరులు నాశనమవుతున్నాయి. సంబంధిత శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఇలాంటి కార్యకలాపాలకు అవకాశం కలుగుతోందా అనే సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి!

పాపన్నపేట మండలం నార్సింగి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దశంకరంపేట వెళ్లే ప్రాంతంలో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ మట్టి తవ్వకాలపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, మైనింగ్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక అధికారులకు గుట్టలు మాయమవుతున్నా కళ్లకు కనిపించడం లేదా? ప్రకృతి సంపదను కాపాడాల్సిన బాధ్యత ఎవరిది? అక్రమ మట్టి తవ్వకాల వెనుక ఎవరున్నారు? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

నిజాయతీపరుడైన అధికారిని కోల్పోయాం..

విజయవాడ : రిటైర్డ్ డీజీపీ ఎన్. బాలసుబ్రహ్మణ్యం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేశ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బాలసుబ్ర హ్మణ్యం నిజాయతీకి, నిబద్ధతకు మారుపేరని, ఆయన మరణం తనను తీవ్ర విచారానికి గురిచేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ.. "బాలసుబ్రహ్మణ్యం గారు నిజాయతీ విషయంలో ఎన్నడూ రాజీపడని అధికారి. దృఢమైన నిర్ణయాలు, ప్రగతిశీల ఆలోచనలతో ఆయన ఎంతో గౌరవం సంపాదించుకు న్నారు. పోలీసింగ్, ఇంటెలిజెన్స్, రవాణా, ప్రభుత్వ పాలన వంటి వివిధ శాఖల్లో తనదైన ముద్ర వేశారు. సంస్కరణలు, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని ఆయన నిరంతరం ప్రోత్సహించేవారు. కొన్ని నెలల క్రితం వరకు కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఆయన తన అనుభవంతో విశేష సేవలు అందించారు. అనారోగ్యంతో పోరాడుతున్న సమయంలోనూ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు" అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నారా లోకేశ్ కూడా బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ఏపీఎస్ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ బాలసుబ్రహ్మణ్యం అమెరికాలో చికిత్స పొందుతూ కన్నుమూశారని తెలిసి తీవ్రగ్లాని్తకి గురయ్యానని పేర్కొన్నారు. "నిజాయతీ, అంకితభావంతో విధులు నిర్వర్తించి ముక్కుసూటి మనిషిగా పేరుపొందిన బాలసుబ్రహ్మ ణ్యం గారి సేవలు చిరస్మరణీయం.వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. పరిపాలనా నైపుణ్యం, ఆధునిక పోలీసింగ్‌కు ఆయన ఒక మూలస్తంభం వంటివారు.ప్రజా సేవలోచూపిన అంకితభావం, ధైర్యం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి" అని లోకేశ్ నివాళులర్పించారు.

ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

చిట్వేలి : ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను ప్రజలకు వివరించి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు చిట్వేలి పట్టణంలో శ్రీ సాయి వికాస్ పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సాధారణ చెత్తలో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి రీసైక్లింగ్‌కు అందించాలని విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్రజలకు సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా సాయి వికాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య నాయుడు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెను ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ ను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల నేల, నీరు కలుషితమవడంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను కూడా సాధారణ చెత్తలో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి, తగిన విధానంలో రీసైక్లింగ్‌కు పంపించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నచిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించి, పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలను వినియోగించడం అలవాటు చేసుకోవాలని తెలిపారు.
పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ సర్కిల్‌లో విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పర్యావరణాన్ని కాపాడాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని వివిధ దుకాణాల వద్దకు వెళ్లిన విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వ్యాపారులకు, ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా పునర్వినియోగ సంచులను ఉపయోగించాలని సూచించారు. పరిసరాల్లో చెత్తను పడేయకుండా, వ్యర్థాలను వేర్వేరుగా సేకరించే అలవాటును పెంపొందించుకోవాలని కోరారు.

పుస్తెలతాడు లాక్కున్న దొంగలకు దేహశుద్ధి

సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లాలో మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారయ్యేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులకు స్థానిక రైతులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పొలంలో ఒంటరిగా పనిచేస్తున్న మహిళను లక్ష్యంగా చేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.జిన్నారం మండలం సోలక్‌పల్లి గ్రామానికి చెందిన కిష్టమ్మ వ్యవసాయ పనులు చేసుకుంటుండగా ఇద్దరు వ్యక్తులు ఆమె వద్దకు వచ్చారు. అనంతరం ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కొని అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని పొలాల్లో పనిచేస్తున్న రైతులు అప్రమత్తమయ్యారు.వెంటనే నిందితులను వెంబడించి పట్టుకున్నారు. ఈ క్రమంలో బాధితురాలు కూడా వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. రైతులు వారిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. అపహరణకు గురైన బంగారు పుస్తెలతాడును కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.నిందితులు ఎవరు? పోలీసులు నిందితులను హత్నూర మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన వడ్డే సాయిలు, మీనంపల్లి గ్రామానికి చెందిన అరవింద్‌గా గుర్తించారు. వీరిపై గతంలోనూ కేసులు నమోదైనట్లు జిన్నారం సీఐ నాగార్జున రెడ్డి వెల్లడించారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ డిజిటల్ రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్

మంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు కృషి చేస్తోందని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ తెలిపారు.మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2, 10వ డివిజన్లలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మేయర్ ధరణి మధుకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు తెల్ల రేషన్ కార్డు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టడం ద్వారా ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మేయర్ వెల్లడించారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు రాచకొండ గోపాల్ రావు, ఎండీ ఖలీద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు

మందమర్రి : స్థానిక ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించిన డిసిసి అధ్యక్షుడు రఘునాథ రెడ్డి.ఈ సందర్భంగా రఘునాధరెడ్డి మాట్లాడుతూ..చెన్నూరు,పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గాలలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మంత్రి వివేక్ వెంకటస్వామి,ఎంపీ వంశీ క్రిష్ణ లపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బిజెపి నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నరని అన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారని కాంగ్రెస్ మంత్రులు,ఎంపీలు నిరసనలు ధర్నాలు చేపడితే బిజెపి నాయకులు తప్పు పట్టడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి కి కృషిచేసిన దివంగత నేత కాకా వెంకటస్వామి కుటుంబాన్ని విమర్శించే ముందు బిజెపి నాయకులు నిజ నిజాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు.కాంగ్రెస్ ఓటు బ్యాంకును తగ్గించాలనే ఉద్దేశంతోనే బిజెపి ప్రభుత్వం సర్ ప్రక్రియను తీసుకొచ్చిందని,నవంబర్ ఒకటవ తేదీన సర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు భారీఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణకు కేంద్రం రూ.50 వేల కోట్ల నిధులు ప్రకటించాలి

- వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఆహార పంటలకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి
- తాండూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



తాండూరు : ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో పంటలు తీవ్రంగా నష్టపోయి రైతులు కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రూ.50 వేల కోట్ల ప్రత్యేక నిధులు ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలో ఎల్‌నినో ప్రభావంతో దెబ్బతిన్న పత్తి పంటలను సీపీఎం రాష్ట్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.మంచిర్యాల జిల్లాలో 11 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ తాండూరు మండలాన్ని విస్మరించడం అన్యాయమన్నారు. తాండూరు మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఆహార పంటలకు ఎకరాకు రూ. 30 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టంపై ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి రైతులకు అండగా నిలవాలన్నారు.నిత్యావసర ధరలను తగ్గించాలికరువు పరిస్థితుల నేపథ్యంలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, బియ్యం కిలో రూ.90కి చేరడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జాన్ వెస్లీ పేర్కొన్నారు. ప్రభుత్వం ధరలను నియంత్రించి, రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను సబ్సిడీపై పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలిఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ పనులు తగ్గి కూలీలకు ఉపాధి దొరకడం లేదని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.800 కూలి చెల్లించాలని కోరారు. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ భరోసా పథకం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజలను ఆదుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కరువు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర బృందానికి సన్మానం తాండూరు మండల కేంద్రంలోని ఐబీ వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో పాటు రాష్ట్ర బృందం సభ్యులను శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్, భూపాల్, ఎం.వి. రమణ, ఆశన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు నగేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా కార్యదర్శి బోడంకి చందు, గోమాస ప్రకాష్, గుమాస అశోక్, దాగం రాజారాం, సాంబార్ వెంకటస్వామి, దాగం శ్రీకాంత్, పాయిరాల రాములు, దుర్గం నాన్నయ్య, బొల్లం రాజేశం, కొమ్మ రాజయ్య తదితర సీపీఎం నాయకులు, రైతులు, కౌలుదారులు పాల్గొన్నారు.

పత్తి పంటల వద్ద దళారుల పాగా.. అన్నదాత శ్రమపై ఆధిపత్యం

ముందస్తు అడ్వాన్సులతో రైతులకు వల.. - ప్రభుత్వ నిబంధనలకు తూట్లు

అమాయక రైతులే ఆసరాగా.. పత్తి వ్యాపారంలో దళారులదే పైచేయి

చర్ల : రైతు కష్టానికి విలువ లేదా? పత్తి ధరను నిర్ణయించాల్సింది మార్కెట్‌నా.. లేక దళారులా? పంట పండించేందుకు నెలల తరబడి చెమటోడ్చిన అన్నదాతకు తన పంటకు తగిన ధర దక్కాల్సి ఉండగా, కొందరు దళారుల నిర్ణయాలే శాసనాలుగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పత్తి పంటల వద్దే తిష్టవేసి, ముందస్తు అడ్వాన్సుల పేరుతో రైతులను తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నారనే ఆరోపణలు రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి.ముందస్తు అడ్వాన్సులు.. వెనుక అసలు మతలబేంటి? పత్తి పంట చేతికొచ్చే ముందే కొందరు వ్యాపారులు, దళారులు రైతులకు అడ్వాన్సులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అత్యవసర ఆర్థిక అవసరాలతో రైతులు ఈ మొత్తాలను తీసుకుంటుండగా, పంట చేతికొచ్చిన తర్వాత తమకే విక్రయించాలనే షరతులు విధిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముందస్తు చెల్లింపుల వెనుక ఉన్న ఒప్పందాలు, ధర నిర్ణయించే విధానం, రైతులకు లభిస్తున్న ప్రయోజనాలపై స్పష్టత రావాల్సి ఉంది.రైతుకు పెట్టుబడి అవసరమైన సమయంలో చేయూతనిచ్చినట్లు కనిపిస్తున్న ఈ వ్యవహారం. పంట విక్రయించే సమయానికి రైతు స్వేచ్ఛను పరిమితం చేసే పరిస్థితికి దారితీస్తే అది ఆందోళనకరమే. అప్పు తీసుకున్నాడనే కారణంతో రైతు తన పత్తిని ఇష్టమైన ధరకు విక్రయించుకోలేని పరిస్థితి ఏర్పడితే, ఆర్థికంగా నష్టపోయేది అన్నదాతే.మేము చెప్పిందే ధర.. రైతు అడిగితే



సమాధానం లేదా?మార్కెట్‌లో పత్తికి లభిస్తున్న ధరకు, రైతుకు వాస్తవంగా చెల్లిస్తున్న ధరకు మధ్య వ్యత్యాసం ఉంటే దానికి కారణాలేమిటన్నది తేలాల్సిఉంది. నాణ్యత, తేమ శాతం, ఇతర ప్రమాణాల ఆధారంగా ధరలో మార్పులు ఉండవచ్చు. అయితే వాటిని సాకుగా చూపి రైతుకు చెల్లించాల్సిన మొత్తాన్ని తగ్గిస్తున్నారా? తూకంలో పారదర్శకత పాటిస్తున్నారా? ధర నిర్ణయంలో రైతుకు తన అభిప్రాయం చెప్పే అవకాశం ఉందా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మద్దూరును కరువు మండలంగా ప్రకటించాలి

మండల సభను బహిష్కరించిన సర్పంచులు

మద్దూరు (ధూళిమిట్ట): సిద్దిపేట జిల్లా మద్దూరు మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వివిధ గ్రామాల సర్పంచులు మండల సభను బహిష్కరించారు. సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు శనిగరం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట సర్పంచులు బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ మండల అధికారుల నిర్లక్ష్యం వల్లనే మద్దూరును కరువు మండలంగా ప్రకటించలేదని విమర్శించారు. దీనికి అధికారులే బాధ్యత వహించాలని కోరారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న మద్దూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం శోచనీయం అన్నారు. గ్రామాల్లో చెరువులు కుంటలు పూర్తిస్థాయిలో ఎండిపోవడం వల్ల నీళ్లు లేక సరిగా కరెంటు రాక పంటలు ఎండిపోయాయని తెలిపారు. పంటలు ఎండిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయి అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దూరు మండలాన్ని కరువు మండలం గా ప్రకటించినం తవరకు ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచులమంతా దూరంగా ఉంటామన్నారు. అదేవిధంగా కరువు మండలంగా ప్రకటించేంతవరకు వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలను చేపడతా మని హెచ్చరించారు. అనంతరం ఆందోళన చేస్తున్న సర్పంచులకు ఎస్సై మమ్మద్ ఆసిఫ్ నచ్చజెప్పి విరమిం పజేశారు. అదేవిధంగా ఎంపీడీవో శ్రీనివాస్ ఆందోళన విరమించాలని సర్పంచులకు విజ్ఞప్తి చేశారు. దీంతో సర్పంచులు తమ ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దామెర మల్లేశం, నీరటి శ్రీనివాస్, ఇట్టబోయిన కనకచంద్రం, కాసర్ల రేణుక కనకరాజు, గడిపే మౌనిక అనిల్ కుమార్, జక్కుల లింగమ్మ కనకయ్య, కర్నె సునీత మనోహర్, బీజేపీ మండల అధ్యక్షుడు మోకు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.